www.Padasalai.Net www.Trb Tnpsc.Com

GOVERNMENT OF TAMIL NADU

# ఐదవ తరగతి

## STANDARD V

# తెలుగు వాచకం

## TELUGU READER

www.Padasalai.Net

Department of School Education

Untouchability is Inhuman and a Crime

5th_Telungu_Reader_Index.indd 1 02-07-2019 20:49:31

Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

**Government of Tamil Nadu**

First Edition - 2019
Reprint - 2020, 2021, 2022, 2023, 2024

(Published under New Syllabus)

www.Padasalai.Net

**Content Creation**

State Council of Educational Research and Training

© SCERT 2019

**Printing & Publishing**

Tamil NaduTextbook and Educational Services Corporation

www.textbooksonline.tn.nic.in



5th_Telungu_Reader_Index.indd 2 02-07-2019 20:49:32

Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# జాతీయ గీతం

జన గణ మన అధినాయక జయహే
భారత భాగ్య విధాతా
పంజాబ సింధు గుజరాత మరాఠా
ద్రావిడ ఉత్కళ వంగ
వింధ్య హిమాచల యమునా గంగా
ఉచ్ఛల జలధి తరంగ
తవ శుభ నామే జాగే
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయ గాథా
జనగణ మంగళ దాయక జయహే
భారత భాగ్య విధాతా
జయహే జయహే జయహే
జయ జయ జయ జయహే !

**– రవీంద్రనాథ్ ఠాగూర్.**

## జాతీయ గీతం – భావం

ప్రజల హృదయాలను పరిపాలించే భారతదేశ భాగ్యవిధాత అయిన నీకు జయం కలుగుతుంది. నీ శుభనామం పంజాబు, సింధు, గుజరాత్, మహారాష్ట్ర, ద్రావిడ, ఉత్కళ, బెంగాలు మొదలైన దేశప్రజల మనస్సులను ఉప్పొంగ చేస్తుంది.

వింధ్య, హిమాలయ పర్వతాలలో ప్రతిధ్వనిస్తోంది. యమునా, గంగా నదుల ప్రవాహంలో లీనమైంది.

నీ ఆశీర్వాదం కోసం నిన్ను కీర్తిస్తూ గానం చేస్తున్నారు. భారతదేశ భాగ్య విధాత అయిన నీకు జయం కలుగుతుంది.

నీకు జయం కలుగుగాక! జయం కలుగుగాక! జయం కలుగుగాక!



www.Padasalai.Net



Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# మా తెలుగు తల్లి

మా తెలుగు తల్లికి మల్లెపూదండ
మా కన్న తల్లికి మంగళారతులు
కడుపులో బంగారు కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు దొరలించు మా తల్లి ॥ మా తెలుగు తల్లికి ॥

గలగల గోదారి కదలిపోతుంటేను
బిరబిర కృష్ణమ్మ పరుగులిడుతుంటేను
బంగారు పంటలే పండుతాయి
మురిపాల ముత్యాలు దొరలుతాయి ॥ మా తెలుగు తల్లికి ॥

అమరావతీ నగర అపురూప శిల్పాలు
త్యాగయ్య గొంతులో తారాడు నాదాలు
తిక్కయ్య కలములో తియ్యందనాలు
నిత్యమై, నిఖిలమై నిలిచి ఉండేదాక ॥ మా తెలుగు తల్లికి ॥

రుద్రమ్మ భుజశక్తి, మల్లమ్మ పతిభక్తి
తిమ్మరుసు ధీయుక్తి, కృష్ణరాయని కీర్తి
మా చెవుల రింగుమని మారుమ్రోగేదాక
నీ ఆటలే ఆడుతాం – నీ పాటలే పాడుతాం
జై తెలుగు తల్లీ! జై తెలుగు తల్లీ!

– శంకరంబాడి సుందరాచారి

www.Padasalai.Net




5th_Telungu_Reader_Index.indd 4 02-07-2019 20:49:33
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# తమిళ్ తాయ్ వాళ్తు

నీరారుం కడలుడుత్త నిలమడందై కెళిలొళుగుం
సీరారుం వదనమెన త్తిగళ్ భరత ఖండమిదిల్
తెక్కణముమ్ అదిర్‌సిరంద ద్రావిడనల్ తిరునాడుమ్
తక్కసిరు పిరైనుదలమ్ దరిత్తనరుమ్ తిలగముమే
అత్తిలగ వాసనైపోల్ అనైత్తులగమ్ ఇన్బముర
ఎత్తిసైయుమ్ పుగళ్‌మనక్క ఇరుంద పెరుం
తమిళణంగే! తమిళణంగే!
ఉన్ సీరిళమై త్తిరం వియందు
సెయల్ మరందు వాళ్‌త్తుదుమే
వాళ్‌త్తుదుమే! వాళ్‌త్తుదుమే!

– మనోన్మణియం. పె.సుందరం పిళ్ళై.



## తమిళ్ తాయ్ వాళ్తు భావం

నీలాల కడలి మధ్య భరత ఖండమనే మహిళ ఉంది. ఆమె అతి సుందర వదన.
ఆ తల్లినొసట తీర్చిదిద్దిన కస్తూరి తిలకంలా ఉంది ద్రావిడనాడు.
ఆమె కమ్మని వలపు, తియ్యదనం, లేత్రాయం, ధీరత్వం తమిళ భాష.
అది సర్వదిశలావ్యాపించి ఉంది. అది నిత్యనూతనం, ప్రఖ్యాతం. ఆమెకు సర్వదా
విజయోస్తు! విజయోస్తు! విజయోస్తు!

కీ॥శే॥ ఆచార్య దేవెళ్ళ చిన్నికృష్ణయ్య



5th_Telungu_Reader_Index.indd 5 02-07-2019 20:49:33
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## ముందుమాట

విద్య జ్ఞాన సముపార్జన మార్గం మాత్రమే కాదు, భవిష్యత్ జీవితానికి పునాదిని ఏర్పరచే కలల సౌధం కూడా. అలాగే పాఠ్యపుస్తకం అనేది విద్యార్థుల చేతులలో ఉండే దారి చూపే కరదీపిక మాత్రమే కాదు, తరువాతి తరాల విద్యార్థుల ఆలోచనా విధానాన్ని రూపొందించే సామర్థ్యం కలిగినది. తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, విద్యార్థుల రంగుల కలలను రంగరించి ఒక చిత్రలేఖనంగా చిత్రించి ఉన్నాం. దాంతో పాటు కింద ఇవ్వబడిన ఉద్దేశ్యాలను సాధించడానికి ఎంతో ప్రయత్నం చేశాం.

- అభ్యసనాన్ని కంఠస్థ దిశ నుండి మరల్చి ఉత్పాదన బాటలో పయనింపజేయడం.
- తెలుగువారి సంస్కృతీసంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, చారిత్రక పునాదులు, సాహిత్యం, కళలు మొదలైన అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించి, అభివృద్ధిని పెంపొందించటం.
- ఆత్మవిశ్వాసంతో సాంకేతిక నైపుణ్యాల సాయంతో విద్యార్థులు నవీన ప్రపంచంలో విజయవంతంగా అభ్యసించడాన్ని నిర్ధారణచేయడం.
- జ్ఞాన సముపార్జన కేవలం పుస్తక జ్ఞానంగా మాత్రమే కాక, నిజమైన జ్ఞానాన్ని పొందే సాధనంగా పుస్తకాలు ఉపయోగపడాలి.
- ఓటమి భయాన్ని, మానసిక ఒత్తిడిని కలిగించే పరీక్షలను రూపుమాపి, అభ్యసన తియ్యదనాన్ని విద్యార్థులకు అందించడం.

పాఠ్యపుస్తకపు నూతన రూపురేఖలు, అందమైన భావాలు మరియు పిల్లల మనస్తత్వానికి అనుగుణంగా సరికొత్త పలు నూతన పద్ధతులను అవలంభించిన ఈ నూతన పాఠ్యపుస్తకం మీ చేతులలో కదులాడుతున్నప్పుడు, గర్వం ఉప్పొంగి ఒక నవీన ప్రపంచంలో మీరు ప్రవేశిస్తారని నమ్ముతున్నాం.



5th_Telungu_Reader_Index.indd 6 02-07-2019 20:49:34
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విషయ సూచిక


| విభాగం | పాఠ్యాంశం | ఇతివృత్తం | కవి/రచయిత | పుట |
|---|---|---|---|---|
| 1 | **భాషావైశిష్ట్యం** | | | |
| 1.1 | తెలుగు తల్లి | పద్యభాగం | వేంకట పార్వతీశ కవులు | 1 |
| 1.2 | మన భాషలు | గద్యభాగం | | 7 |
| 1.3 | మహాకవి కాళిదాసు | ఉపవాచకం | రచయితల బృందం | 16 |
| 2 | **విద్య** | | | |
| 2.1 | వేమన పద్యాలు | పద్యభాగం | వేమన | 18 |
| 2.2 | ప్రగతి పథంలో స్త్రీ | గద్యభాగం | | 23 |
| 2.3 | కర్ణుని దాతృత్వం | ఉపవాచకం | రచయితల బృందం | 29 |
| 3 | **ప్రకృతి-పర్యావరణం** | | | |
| 3.1 | మా తోట | పద్యభాగం | అవధాని రమేష్ | 31 |
| 3.2 | నీడ ఖరీదు | గద్యభాగం | | 39 |
| 3.3 | ఉత్తమ జంతువు | ఉపవాచకం | | 47 |
| 4 | **శాస్త్రం - సాంకేతికం** | | | |
| 4.1 | పంట సిరి | పద్యభాగం | | 50 |
| 4.2 | సెల్ ఫోన్ (చరవాణి) | గద్యభాగం | | 57 |
| 4.3 | మనసుంటే మార్గం ఉంటుంది | ఉపవాచకం | | 64 |
| 5 | **కళలు** | | | |
| 5.1 | మంజీర | పద్యభాగం | డా॥ వేముగంటి నరసింహాచార్యులు | 67 |
| 5.2 | ప్రభు భక్తి | గద్యభాగం | | 73 |
| 5.3 | కవికోకిల సరోజిని నాయుడు | ఉపవాచకం | | 81 |




5th_Telungu_Reader_Index.indd 7 02-07-2019 20:49:34
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com


| | | | | |
|---|---|---|---|---|
| 6 | నాగరికత – వృత్తులు – వ్యాపారం | | | |
| 6.1 | రాజు – కవి | పద్యభాగం | గుర్రం జాషువా | 83 |
| 6.2 | బాలభట సంఘం | గద్యభాగం | రచయితల బృందం | 89 |
| 6.3 | ఆరోగ్యమే మహాభాగ్యం | ఉపవాచకం | | 95 |
| 7 | దేశం – సమూహం – ప్రభుత్వం – నిర్వహణ | | | |
| 7.1 | జన్మభూమి | పద్యభాగం | రాయప్రోలు సుబ్బారావు | 98 |
| 7.2 | గానయోగి – ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం | గద్యభాగం | రచయితల బృందం | 103 |
| 7.3 | ఎవరు బాధ్యులు | ఉపవాచకం | | 110 |
| 8 | ధార్మికత – తాత్త్వికత – చింతన | | | |
| 8.1 | సంతోషానికి కారణం | పద్యభాగం | | 115 |
| 8.2 | సాహస బాలుడు | గద్యభాగం | | 122 |
| 8.3 | క్రిస్మస్ | ఉపవాచకం | | 127 |
| 9 | మానవత్వం – వ్యక్తిత్వం | | | |
| 9.1 | బుద్ధి బలం | పద్యభాగం | | 129 |
| 9.2 | మహాత్ముడు | గద్యభాగం | | 136 |
| 9.3 | అతిథి సత్కారం | ఉపవాచకం | | 142 |
| | వ్యాసాలు | | | 145 |
| | లేఖలు | | | 147 |


(*) గుర్తించిన పద్యాలను కంఠస్థం చేయాలి.



5th_Telungu_Reader_Index.indd 8 02-07-2019 20:49:34
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
1

# 1.1 తెలుగు తల్లి



కవి: వేంకట పార్వతీశ కవులు

1.* తెలుఁగు మాటల పంచదారల
తీపుఁ గాంచిన తెలుఁగు తల్లీ!
తెలుఁగు పాటల తేనెతేటల
దెసల నించిన తెలుఁగు తల్లీ!

2. తెలుఁగు తేజము దిక్కు దిక్కుల
నిలుపనేర్చిన తెలుఁగు తల్లీ!
"దేశభాషలఁ దెలుగు లెస్స" ను
తీర్పుఁ గాంచిన తెలుఁగు తల్లీ!


3. దేశ దేశములందు ప్రాభవ
దీప్తిఁ జూపిన తెలుఁగు తల్లీ!
పావనములగు జీవనదులకు
దావులొసఁగిన తెలుఁగు తల్లీ!

www.Padasalai.Net



5th Telugu Reader _unit1.indd 1 02-07-2019 20:51:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com





4. పంట పొలములఁ బాఁడి పశువులఁ
ప్రబలి యుండెడి తెలుఁగు తల్లీ!
మూడు కొండల కోటలోపల
మూర్తిఁ గాంచిన తెలుఁగు తల్లీ!



5. * పుణ్య సతులకు భక్తవరులకుఁ
బుట్టినిల్లగు తెలుఁగు తల్లీ!
ఎందు చూచినఁదోఁచు నీకిదె
వందనము మా తెలుఁగు తల్లీ!

## సారాంశం

ఓ తెలుగు తల్లీ! నీ గొప్పతనాన్ని ఏమని వర్ణించగలనమ్మా! నీ మాటలు, పాటలు తేనెలాగా తియ్యగా ఉంటాయి. నీ కీర్తి నాలుగు దిక్కుల వ్యాపించి మారుమోగుతోంది. నీ తేజస్సు (కాంతి) ను ప్రపంచమంతటా వ్యాపింపజేసిన గొప్పదానివి తల్లీ. "దేశభాషలందు తెలుగు లెస్స" అని అందరి చేత పొగడబడ్డావు. దేశ విదేశాల్లో గొప్పతనమనే వెలుగులను ప్రసరింపజేసావు.



5th Telugu Reader _unit1.indd 2 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

ఓ తెలుగు తల్లీ! పవిత్రమైన జీవనదులు నీ నేలలో ప్రవహించడానికి దారినిచ్చావు. తెలుగుదేశం పాడిపంటలతో సస్యశ్యామలంగా సుభిక్షంగా ఉంటుంది. మూడు లింగాలైన శ్రీశైలం, దక్షారామం, కాళేశ్వరం మధ్యలో నివసిస్తున్న ఓ తెలుగు తల్లీ! నీ నేల చానమ్మ, ప్రోలమ్మ, రుద్రమదేవి, నాగమ్మ, మాంచాల వంటి ఎందరో వీర వనితలకు, త్యాగయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, గోపన్న వంటి ఎందరో గొప్ప భక్తులకు పుట్టినిల్లు. ఏ వైపు చూసినా కనిపించే నీ రూపానికి నా వందనాలు.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. దెస = దిక్కు
2. తేజం = వెలుగు
3. లెస్స = బాగు
4. ప్రాభవం = గొప్పదనం
5. దీప్తి = కాంతి
6. పావనం = పవిత్రం
7. తావులు = స్థానాలు, ప్రదేశాలు
8. ఒసగిన = ఇచ్చిన
9. ప్రబలు = వ్యాపించు
10. సతి = భార్య

### II ప్రకృతి - వికృతి

1. దిశ - దిక్కు
2. పుణ్యం - పున్నెం
3. భక్తి - బత్తి
4. స్థానం - తావు
5. భాష - బాస



5th Telugu Reader _unit1.indd 3 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## III వ్యతిరేక పదాలు

1. తీపి × చేదు
2. జీవం × నిర్జీవం
3. పుణ్యం × పాపం
4. పుట్టినిల్లు × మెట్టినిల్లు

## IV జతపరచండి

1. తెలుగు మాటల – తెలుగు తల్లీ
2. దేశ భాషల – దిక్కుదిక్కుల
3. దీప్తిఁ జూపిన – తేనె తేటల
4. తెలుగు తేజము – పంచదారల
5. తెలుగు పాటల – తెలుగు లెస్స

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1. --------- గాంచిన తెలుగు తల్లీ!
2. --------- నదులకుఁ దావులొసఁగిన తెలుగు తల్లీ!
3. --------- పశువులఁ బ్రబలి యుండెడి తెలుగు తల్లీ!
4. --------- భక్తవరులకు బుట్టినిల్లగు తెలుగుతల్లీ!
5. --------- నీకిదే వందనం మా తెలుగు తల్లీ!

## VI విడదీసి రాయండి

1. పుట్టినిల్లు –
2. నీకిదె –
3. తీపుఁగాంచిన –
4. దేశములందు –
5. పావనములగు –



5th Telugu Reader _unit1.indd 4 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com
www.Padasalai.Net

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## VII ప్రశ్నలు

1. తెలుగు పాటలు, మాటలు ఎలా ఉంటాయి?
2. తెలుగు తల్లి గొప్పదనం ఎంత వరకు వ్యాపించింది?
3. తెలుగుదేశం ఎలా ఉంటుంది?
4. తెలుగు తల్లి ఎక్కడ నివసిస్తున్నదని కవి పేర్కొన్నాడు?
5. తెలుగు నేల ఎవరెవరికి పుట్టినిల్లని కవి చెప్పాడు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం



తెలుగు భాషలోని పదాలను ఐదు రకాలుగా విభజించారు. వీటిని భాషా భాగాలు అంటారు.

1) నామవాచకం

2) సర్వనామం

3) క్రియ

4) విశేషణం

5) అవ్యయం

1) **నామవాచకం** : పేర్లను గూర్చి తెలిపేది 'నామవాచకం'.

ఉదా॥ రాముడు, సీత, హిమాలయాలు, గంగానది, ఏనుగు, చిలుక

2) **సర్వనామం**: నామవాచకానికి బదులుగా వాడబడే పదాలను 'సర్వనామాలు' అంటారు.

ఉదా॥ అతడు, ఆమె, అది, వారు

3) **క్రియ** : పనిని గూర్చి తెలిపేది క్రియ.

ఉదా॥ చదవడం, రాయడం, తినడం, పాడడం. ఆడడం

4) **విశేషణం** : నామవాచకం యొక్క గుణాలను తెలిపే పదాలను 'విశేషణాలు' అంటారు.

ఉదా॥ అందమైన, తియ్యని, నల్లని, మంచి

5) **అవ్యయం** : లింగ, వచన, విభక్తులు లేని పదాలను 'అవ్యయాలు' అంటారు.

www.Padasalai.Net



5th Telugu Reader _unit1.indd 5 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

అ) 'నామవాచకం' అంటే పేర్లను గూర్చి తెలిపే పదాలని తెలుసుకున్నారు కదా! కింది వాక్యాలలో నామవాచక పదాల కింద గీత గీయండి.

1) రవి మధురై వెళ్ళాడు.

2) కుక్క విశ్వాసం గల జంతువు.

3) గీత, సంధ్య, లావణ్య, సరఫినా సినిమాకు వెళ్ళారు.

ఆ) సర్వనామం అంటే నామవాచకానికి బదులుగా వాడబడే పదాలు అని తెలుసుకున్నారు కదా! కింది వాక్యాలలో సర్వనామ పదాలకు గీతలు గీయండి.

1) అనిత పొలానికి వెళ్ళింది. ఆమె వరి పైరు కోసింది.

2) పిల్లి పాలు తాగింది. అది బయటికి వెళ్ళింది.

3) రవి బడికి వెళ్ళాడు. అతడు పరీక్ష రాశాడు.

## IX విద్యార్థులకు సూచన

1. తెలుగు తల్లిని కీర్తించే పాటలను సేకరించి తరగతి గదిలో పాడి వినిపించండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. తెలుగు కవులను విద్యార్థులకు పరిచయం చేయండి.

### ప్రణాళికా పని



కింద ఇచ్చిన పదాల ఆధారంగా ఈ పేరా పూర్తి చేయండి

(దర్శనం, మిత్రులం, పురాతన, స్నానం, చెరువు, ఈత )

మా ఊరిలో ఒక --------- మైన గుడి ఉంది. ఆ గుడి పక్కనే పెద్ద -------ఉంది. ఆ చెరువులో ఎప్పుడూ నీళ్ళు ఉంటాయి. ఎండాకాలం రాగానే మా ------- అందరం కలిసి రోజూ గుడికి వెళ్తాం. అక్కడ గుడిలో ఉన్న దేవుణ్ణి -------- చేసుకుని క్రికెట్, కబడ్డీ, దాగుడుమూతలు మొదలైన ఎన్నో ఆటలు ఆడుకుంటాం. ఎండ నెత్తి మీదకు రాగానే అందరం కలిసి చెరువులో ----- చేస్తాం. ఆ చల్లని నీటిలో చాలాసేపు -------- కొడుతూ ఉంటాం.



5th Telugu Reader _unit1.indd 6 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 1

# 1.2 మన భాషలు




| | | |
|---|---|---|
| **భారతి** | : | (సౌధమంటే భవనం, సౌధమంటే భవనం ఇలా చదువుతూ) అమ్మా..... చెల్లెల్ని చూడు, నేను చదువుకుంటూంటే ఏవో శబ్దాలు చేస్తూ ఆటంకం కలిగిస్తోంది. |
| **అమ్మ** | : | సుధాత్రీ ఇక్కడికి రా! ఎందుకలా గోల చేస్తున్నావ్? అక్కయ్యను చదువుకోనియ్యి. |
| **మామయ్య** | : | భారతీ ! ఓ సారి ఇలా రావమ్మా! ఈ పుస్తకం నీదేనా? ఏమిటి చదువుతున్నావు? |
| **భారతి** | : | "ఆడిన మాట" పాఠం. "ఆవు పులి" కథ మామయ్యా! |
| **మామయ్య** | : | ఈ పాఠంలో "పూరియు మేయ నేర .... " ఈ పంక్తిలో పూరి అనే శబ్దానికి అర్థమేమిటో తెలుసా? |



5th Telugu Reader _unit1.indd 7 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

**భారతి** : పూరి అంటే పూరీ. మనం తినేది.

**మామయ్య** : (నవ్వుతూ .... ) కాదు కాదు. పశువులు మేసే పూరి – అంటే గడ్డి.

**భారతి** : ఓహో! అయితే ఈ పూరి వేరన్నమాట. ఔను మామయ్య! ఇందాక నువ్వు శబ్దం అన్నావు. మరీ, ఓ గ్లాసు కిందపడినప్పుడూ, టపాసులు కాల్చినప్పుడూ అయ్యే చప్పుడును కూడా శబ్దం అని అంటాం కదా! అదీ ఇదీ ఒకటేనా?

**మామయ్య** : కాదు. మనం గుర్తుపట్టడానికి వీలయ్యే ధ్వని ఒకటి, మనం భావం గ్రహించడానికి వాడే పదం ఒకటి. ఇలా శబ్దాన్ని రెండు అర్థాల్లో వాడవచ్చు. నువ్వన్నట్లుగా ప్రతి ధ్వనికీ లేదా ప్రతి శబ్దానికీ అర్థాలుండవు. ఉదా॥ పిల్లలు, బుడతలు అనే పదాలు అర్థవంతమైన ధ్వనులు / శబ్దాలు. ల్లలుపి, డలుతబు ఇవి ధ్వనులే కాని అర్థవంతమైన శబ్దాలు కావు. అంటే మాటలు కావన్నమాట.

**భారతి** : మామయ్యా! చేతులతో సైగలు కూడా చేస్తాం కదా!

**మామయ్య** : అదీ నిజమే. సైగలు కూడా మన భావాన్ని ఇంకొకళ్ళకి చెప్పడానికే ఉపయోగపడతాయి.

**భారతి** : మన భావాన్ని చెప్పడానికి మాట్లాడుతాం, రాస్తాం కదా!

**మామయ్య** : అలా మాట్లాడిన దాన్ని మనం ఏమంటామో తెలుసా?

**భారతి** : "భాష" అంటాం కదా! మరి రాసేదాన్ని ఏమంటాం?

**మామయ్య** : అదీ భాషే, అంటే నోటి భాషకు రాత రూపమన్న మాట. ఇందాక నువ్వు సైగలు అన్నావు కదా! అది కూడా ఒక రకంగా భాషే.

**భారతి** : అయితే భాష ఇన్ని విధాలుగా ఉంటుందన్నమాట!

**మామయ్య** : అవును మాట్లాడే భాషను "వాగ్రూప భాష" అని, రాసే భాషను "లిఖిత రూప భాష" అని, సైగల భాషను "సంకేత భాష" అని అంటాం. అంటే భాష వాగ్రూపంగానూ, లిఖిత రూపంగానూ, సంకేత రూపంగానూ ఉండవచ్చు.

**భారతి** : మూగ, చెవిటి వాళ్ళు సంకేత భాషను వాడతారు కదా!

**మామయ్య** : వాళ్ళే కాదు మనమందరం వాడతాం. కళ్ళతో, చేతులతో మనం చేసే సైగలు, మనం జ్ఞాపకం పెట్టుకోవడానికి వాడే గుర్తులు మొదలైనవన్నీ సంకేతాలే. రక్షణ సమాచారాన్ని చేరవేయడానికి, వైజ్ఞానిక అంశాల్ని గుర్తుంచుకోవడానికి లిఖిత సంకేతాన్ని ఉపయోగిస్తారు. మన ఆలోచనలు కూడా భాషలోనే సాగుతాయి తెలుసా?



5th Telugu Reader _unit1.indd 8 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

**భారతి** : అదెలా?

**మామయ్య** : ఇప్పుడు నువ్వు ఓ విషయం గురించి చెప్పాలనుకున్నప్పుడు, ముందు ఆలోచిస్తావు కదా! అంటే ఆ ఆలోచన నువ్వు మాట్లాడే భాషలోనే ఉంటుందా, లేదా?


**భారతి** : ఔను, నిజమే. మనకు వచ్చే కలల్లో కూడా మన భాష ఉంటుంది కదా మామయ్య!

**అమ్మ** : మనం మెలకువగా ఉన్నప్పుడు మాట్లాడే భాషే కలలో కూడా వినిపిస్తుంది. భాష వల్ల మనకు చాలా ఆనందం కలుగుతుంది. ఆనందమే కాదు, మన పూర్వీకుల గాథలు, కథలు, సంస్కృతీసంప్రదాయాలు, చరిత్ర ..... ఇలా ఒకటేమిటి అనేకమైన వాటిని భాష వలననే మనం తెలుసుకోగలుగుతున్నాం.

**మామయ్య** : భారతీ! మీ అమ్మ చెప్పింది అక్షరాల నిజం.

**భారతి** : ఆటలు, పాటలు, నాటికలు, ఉపన్యాసాలు, మిమిక్రీ, ప్రకటనలు...... ఇలా అన్నిటిలోనూ మనం భాషను ఉపయోగిస్తూనే ఉంటాం కదా అమ్మా!

**అమ్మ** : రోజూ మనం చదివే పత్రికల్లో, మనం పాడుకునే గేయాల్లో, కవుల రచనల్లో, నిత్యం రాసుకునే డైరీల్లో, కరపత్రాల్లో ..... ఇలా అనేక వ్యవహార రూపాల్లో కనిపిస్తుంది.



**మామయ్య** : శిలాశాసనాల్లోని భాష ఆధారంగానే మనం కొంత చరిత్ర తెలుసుకోగలుగుతున్నాం భారతీ!

**భారతి** : మామయ్య మా తరగతిలో కొంతమంది పిల్లలు మాట్లాడుతుంటే నాకు అసలు అర్థం కాదు. వాళ్ళు అదేదో వేరే భాష అని అంటారు.



5th Telugu Reader _unit1.indd 9 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

| | |
|---|---|
| మామయ్య | : మనం తెలుగులో ఎలా మాట్లాడుకుంటున్నామో, వాళ్ళు వాళ్ల భాషలో అలానే మాట్లాడుకుంటారు. |
| భారతి | : వాళ్ళ భాష అంటే ఒక్కొక్కరికి ఒక్కో భాష ఉంటుందా? |
| మామయ్య | : అలా కాదు. ఒక్కొక్కరికి ఒక్కో భాష అని కాదు. ప్రాంతాలు, పరిసరాలు మొదలైన కారణాలనుబట్టి ఆయా వ్యక్తులు ఆయా భాషలు మాట్లాడుతుంటారు. |
| భారతి | : ఒక్కరే ఎన్ని భాషలనైనా నేర్చుకోవచ్చా? |
| అమ్మ | : అవును నేర్చుకోవచ్చు. మీ మామయ్య తెలుగు, తమిళం, ఇంగ్లీష్, హిందీ, కన్నడం, బెంగాలీ భాషలో మాట్లాడగలడు తెలుసా! |
| భారతి | : అమ్మ బాబోయ్! మామయ్యకు ఆరు భాషలు వచ్చా! |
| మామయ్య | : మన రాష్ట్రంలో ఏయే భాషలు మాట్లాడే వాళ్ళున్నారో తెలుసా? |
| భారతి | : తెలుగు, తమిళం, మలయాళం, కన్నడం, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళున్నారు. |
| మామయ్య | : అంతే కాదు. మన రాష్ట్రంలోని నీలగిరి అడవులలో తుళు, కొండ, కోయ వంటి భాషలు మాట్లాడే గిరిజన ప్రజలున్నారు. ఈరోడ్డు, క్రిష్ణగిరి జిల్లాలో కన్నడమూ, తిరువళ్ళూరు జిల్లాలో తెలుగు, వేలూరు జిల్లాలో ఉర్దూ, మదరాసు మన రాష్ట్ర రాజధాని అయినందువలన వృత్తి వ్యాపారాల్లో పలు భాషల ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. హిందీ, గుజరాతీ, మలయాళం, బీహారి వంటి భాషలు మాట్లాడే ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. |
| భారతి | : అసలింతకూ మనదేశంలో ఎన్ని భాషలు ఉన్నాయి మామయ్య? |
| మామయ్య | : ఇది కూడా మంచి ప్రశ్న. మన దేశంలో 1652 భాషలు ఉన్నాయట. ప్రపంచంలో ఏడు వేల పైచిలుకు భాషలు ఉన్నాయని ఒక అంచనా. |
| భారతి | : అమ్మో! ఇన్ని భాషలా? |
| అమ్మ | : భారతీ! పది రూపాయల నోటు మీద “పది రూపాయలు” అని అనేక భాషల్లో రాసి ఉంటుంది గమనించావా? |
| భారతి | : లేదమ్మా! |
| మామయ్య | : ఇదిగో చూడు. ఒక్క పది రూపాయల నోటు మీదే కాదు. ప్రతి నోటు మీద ఉంటాయి. |
| భారతి | : ఔను, నిజమే మామయ్యా! ప్రాచీన కాలంలో పుట్టిన భాషలు ఇప్పటికీ ఉన్నాయి కదా మరి! |



5th Telugu Reader _unit1.indd 10 02-07-2019 20:51:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com




**మామయ్య** : కొన్ని వేల ఏళ్ళ నుంచి కొన్ని మాటలు వాడుకలో ఉన్న భాషను ప్రాచీన భాష అంటాం. మన కేంద్ర ప్రభుత్వం సంస్కృతం, తమిళం, తెలుగు, కన్నడం, మలయాళ భాషను ప్రాచీన భాషలుగా కూడా గుర్తించింది.

**భారతి** : ఓహో! అలానా!

**అమ్మ** : నీకు తెలుసా! ఒరియా, కాశ్మీరీ, అస్సామీ, బెంగాలీ, మణిపురి మొదలైన భాషలన్నీ మన దేశంలో మాట్లాడే భాషలేనని తెలుసా?

**భారతి** : తెలియదు. అబ్బబ్బా, అన్ని భాషలా? అసలు ఇన్ని భాషలు ఎందుకు తయారు చేశారో?

**మామయ్య** : ఇది ఎవరో ఒకరు, ఎప్పుడో కూర్చుని చేసే పని కాదమ్మా. మనిషి మాట్లాడటం మొదలు పెట్టినప్పటి నుండే భాషలు ఆవిర్భవించాయి. వీటిలో కొన్నిటికి లిపి ఏర్పడింది. ఇది సహజంగా జరిగిన ప్రక్రియ.


**భారతి** : లిపి ఉన్న భాషలు అన్నారు కదా! లిపిలేని భాషలు ఉంటాయా?

**మామయ్య** : కొన్ని భాషల వాళ్ళు వాళ్ళ భావాలను తెలపడానికి కొన్ని గుర్తులు పెట్టుకున్నారు. ఆ గుర్తులను వాడగా వాడగా రాతలో అక్షరాలు ఏర్పడ్డాయి. ఆ అక్షరాలను గుర్తులతో రాసే విధానాన్ని లిపి అంటారు. మిగిలిన భాషల వాళ్ళు కొందరు రాసుకోవడానికి ఆ విధంగా లిపిని తయారు చేసుకోలేదు. ఇతరుల లిపిని వాడుకోనూ లేదు. కాబట్టి కొన్ని భాషలకు లిపి లేదు. ఈ లిపి కూడా మారుతూ వచ్చింది. ఇప్పుడు అనేక భాషల లిపుల్లో ఎన్నో మార్పులు వచ్చాయి.

**భారతి** : మామయ్యా! నువ్వు మొదట్లో లిఖితరూప భాష అన్నావు కదా! అది ఇదేనా?



5th Telugu Reader _unit1.indd 11 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com



మామయ్య : ఔను, భాషకు లిఖిత రూపం రావడం వల్లనే వైజ్ఞానికాభివృద్ధి సాధ్యమైంది.

భారతి : తాళపత్ర గ్రంథాలు అంటారు కదా! అంటే ఏమిటి?

మామయ్య : లిపిని మొదట బంకమట్టి బిళ్ళల మీద, ఇటుకల మీద, చెట్ల మీద, బండలమీద, పత్రాల మీద ఆ తర్వాత తాటాకుల మీద రాయటం అలవాటు చేసుకున్నారు. తాటాకుల మీద ఘంటంతో రాసిన పుస్తకాల్ని తాళపత్ర గ్రంథాలని అంటాం. తాళపత్రం అంటే తాటాకు అన్నమాట.

భారతి : మనం ఇప్పుడు అచ్చు పుస్తకాలు చదువుతున్నాం కదా!

మామయ్య : ఔను ముద్రణ కంటే ముందు రాగిరేకులమీద చెక్కేవారు. అన్నమాచార్యుల వారు పాడిన ఎన్నో పాటలను రాగిరేకులమీద చెక్కించారు.

భారతి : ముద్రణాయంత్రం రావడం లిఖిత భాషకు మంచిదైంది కదా మామయ్యా!

మామయ్య : బాగా చెప్పావు. ముద్రణ అనేది అనేక భాషల సాహిత్యాలను బతికిస్తూ ఉంది. అనేక వైజ్ఞానిక, చారిత్రక, సాంఘిక విషయాల సంపదను తరతరాల వాళ్ళు అందుకొని కాపాడుకోవడానికి వీలు కల్పించింది.

భారతి : మామయ్యా! భాషల గురించి తెలుసుకొంటున్న కొద్దీ ఇంకా తెలుసుకోవాలనిపిస్తూంది.

అమ్మ : భారతీ! ఈనాటికి ఇది చాలమ్మా! తెలుసుకొన్న విషయాల్ని చక్కగా గుర్తించుకొని నీ స్నేహితురాళ్ళతో చర్చించు. ఇక భోజనం చేద్దాం పదండి.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. ధ్వని = శబ్దం
2. లిపి = భాషకు గల అక్షర రూపం





Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. తాళపత్రం = తాటి ఆకులు
4. ఘంటం = రాసే సాధనం
5. శిలాశాసనాలు = రాతి బండలపైన రాసిన విషయాలు
6. గిరిజనులు = అడవులలో జీవించేవారు.

## II ప్రకృతి – వికృతి

1. భాష – బాస
2. పుస్తకం – పొత్తం
3. అమ్మ – అంబ
4. కథ – కత
5. భోజనం – బోనం

## III వ్యతిరేకపదాలు

1. ఆటంకం × నిరాటంకం
2. కింద × పైన
3. నిజం × అబద్ధం
4. ముద్రితం × అముద్రితం

## IV జతపరచండి

1. వాగ్రూప భాష – చరిత్ర
2. లిఖితరూప భాష – సైగల భాష
3. సంకేత భాష – మాట్లాడే భాష
4. శాసనాలు – రాసే భాష

## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



1) మన దేశంలోని మొత్తం భాషలు ---

అ) 1652 ఆ) 1000 ఇ) 1600 ఈ) 2000

2) సౌధం అనగా ----

అ) పుష్పం ఆ) భవనం ఇ) గుడి ఈ) చెట్టు



5th Telugu Reader _unit1.indd 13 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

3) మూగవాళ్ళు వాడే భాష ---

అ) వాగ్రూప భాష    ఆ) సంస్కృత భాష    ఇ) సంకేత భాష    ఈ) ఆంగ్ల భాష

4) చరిత్రను దేని ఆధారంగా తెలుసుకుంటున్నాం

అ) శిలాశాసనాలు    ఆ) పురాణాలు    ఇ) కథలు    ఈ) చెట్లు

## VI కలిపి రాయండి

1. సౌధము + అంటే =
2. కాదు + అమ్మా =
3. చాలు + అమ్మా =

## VII ప్రశ్నలు

1) భాష అనగానేమి?

2) వాగ్రూప భాష అనగానేమి?

3) లిఖిత రూప భాష అనగానేమి?

4) తాళపత్ర గ్రంథాలు అనగానేమి?

5) అన్నమాచార్యుల కీర్తనలు వేటిపై చెక్కించారు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం.



కింది పేరాను చదవండి నామవాచకాలు,
సర్వనామాలు, విశేషణాలు గుర్తించి పట్టికలో రాయండి

రమ తన స్నేహితురాలు లత ఇంటికి వెళ్ళింది. అక్కడ రమ పెద్ద మామిడి చెట్టు, గుబురుగా పెరిగిన జామ చెట్టు, సపోటా చెట్లు చూసింది. వాళ్ళ ఇంట్లో ఇవే కాక చాలా పూల మొక్కలు ఉన్నాయి. ఎన్ని రంగురంగుల పువ్వులో! గులాబీలు, పసుపుపచ్చ చేమంతులు, ఎర్రని మందారాలు ఇలా చాలా ఉన్నాయి. లత రమకు పెద్ద గులాబీ పూవు కోసి ఇచ్చింది. రమ తన బుట్టలో వేసుకుంది. రమ పావని అందమైన పెద్ద తోటలోకి వెళ్ళారు. తియ్యని జామపళ్ళు కోశారు. మాధురికి ఇచ్చారు.

www.Padasalai.Net



5th Telugu Reader _unit1.indd 14 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net
www.Trb Tnpsc.Com

| నామవాచకాలు | సర్వనామాలు | విశేషణాలు |
| --- | --- | --- |
| | | |

## IX విద్యార్థులకు సూచన

1. ప్రాచీన భాషలు ఏవో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. భాషలోని మాండలిక భేదాలను తెలియజేయండి.

### ప్రణాళికా పని

మన రాజ్యాంగం ఆమోదించిన భాషలు ఏవి? చార్టుపై రాయండి.



www.Padasalai.Net




5th Telugu Reader _unit1.indd 15 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
1

చదువు - ఆనందించు

# 1.3 మహాకవి కాళిదాసు



పూర్వం సుధర్మ మహారాజు మధుమంత రాజ్యాన్ని పరిపాలించేవాడు. అతను తన ప్రజలను కన్న బిడ్డల్లాగా చూసుకునేవాడు. అతనికి ఒక్కగానొక్క కుమార్తె. ఆమె పేరు విద్యావతి. సౌందర్యరాశి అన్ని కళలలోను శాస్త్రాలలోను చక్కటి పరిజ్ఞానాన్ని సంపాదించింది. ఆమెకు వివాహం చెయ్యాలని మహారాజు అనుకున్నాడు. కానీ అందులో ఒక చిక్కు వచ్చి పడింది.



5th Telugu Reader _unit1.indd 16 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విద్యావతీదేవి తనను ఎవరైతే శాస్త్ర విద్యా చర్చలో ఓడిస్తారో వారినే వివాహం చేసుకుంటానని తీర్మానంగా మహారాజుతో చెప్పింది. అందుకు మహారాజు నగరమంతా దండోరా వేయించాడు.

ఈ విషయం నలుమూలలా పాకింది. విద్యావతితో విద్యా చర్చల్లో పాల్గొనడానికి నలువైపుల నుండి ఎంతో మంది యువకులు ఉత్సాహంతో ముందుకు వచ్చారు. కానీ వారెవ్వరూ కూడా విద్యావతిని ఓడించ లేకపోయారు. ఓడిపోయిన రాజకుమారులు అవమానంతో సభ నుండి వెళ్లిపోయారు.

విద్యావతీదేవి రాజకుమారులను ఓడించడమే కాక వారిని తూలనాడింది. ఆస్థాన పండిత వర్గం ఈ విషయాన్ని గురించి చర్చించారు. ఒక స్త్రీగా ఆమెకు ఎంతో గర్వం ఉందని దానిని ఏదో ఒక విధంగా పోగొట్టాలని నిర్ణయించి ఆమెకు తగిన బుద్ధిని చెప్పాలనుకున్నారు. అందుకు ఒక తెలివిలేనివాడిని, మూర్ఖుని తీసుకొని వచ్చి ఆమెతో వివాహం జరిపించి ఆమె అహంకారాన్ని పోగొట్టాలని అనుకున్నారు.

ఒకానొక రోజు పండిత వర్గంలో ఉన్న కొంతమంది తెలివిలేనివాడు, మూర్ఖుడైన ఒకడిని వెతుక్కుంటూ వెతుక్కుంటూ నగరం పొలిమేర వరకు వెళ్ళారు. అక్కడ ఒక విచిత్రాన్ని చూశారు.ఒక గొర్రెల కాపరి తన గొర్రెల కోసం తాను కూర్చున్న కొమ్మను ఎలా నరుకుతున్నాడో చూసి అందరూ ఆశ్చర్యపోయారు. పైగా అతని తెలివితక్కువతనానికి నవ్వుకున్నారు.

అలాంటి తెలివితక్కువవాడైన ఆ గొర్రెల కాపరిని కిందకి రమ్మని మంచి రుచికరమైన భోజనాలు పెడతామని, రాజకుమారిని ఇచ్చి పెండ్లి చేస్తామని ఆశ చూపించి, అందంగా అలంకరించి, మంచి దుస్తులు వేసి రాజకుమారునిలా నగర వీధులలో తిప్పించారు.

రాజసభకు రాజమర్యాదలతో ఆ గొర్రెల కాపరిని ఆహ్వానించారు. పండిత వర్గం రాజకుమారుడిలా ఉన్న ఆ గొర్రెల కాపరిని చూసి ఎటువంటి పరిస్థితిలోనూ పోటీ సమయంలో నోరు మెదపకూడదని మరీ మరీ చెప్పారు. అందుకు అంగీకరించాడు గొర్రెల కాపరి. విద్యావతీదేవి దగ్గర అతను గొప్ప కవి అని, సైగల ద్వారా సమాధానం చెప్పగలడని అన్నారు.

మరుసటి రోజు రాజసభలో యువరాణి ఒకవైపు, మంచి దుస్తులతో, అలంకరణతో ఉన్న గొర్రెల కాపరి మరొకవైపు పోటీకి సిద్ధంగా ఉన్నారు. పోటీ మొదలయ్యింది. విద్యావతీ దేవి పరమాత్ముడు ఒక్కడేనని సూచించే విధంగా ఒక వేలిని చూపించింది. ఇది అర్థం కాని గొర్రెల కాపరి రెండు వేళ్ళను చూపించాడు. ఇది గమనించిన పండిత వర్గంలో ఒకడు ఆ రెండు వేళ్ళలో ఎంతో అర్థం ఉందని అది ఆత్మ, పరమాత్మ అని వివరించి చెప్పాడు.

నిజం తెలియని విద్యావతి అతనిని నిజంగానే పండితుడని భావించింది. అతనిని మెచ్చుకొని వివాహం చేసుకోవడానికి ఒప్పుకుంది. పండిత వర్గం పన్నిన పథకం ఫలించింది. యువరాణి విద్యావతీదేవికి ఆ గొర్రెల కాపరితో ఎంతో వైభవంగా వివాహం జరిగింది. అతని ప్రవర్తనలో కొంత విచిత్రమైన మార్పులను గమనించింది విద్యావతి. తన భర్త రాజకుమారుడిగా కాక నేలమీద పడుకోవటం చూసి ఆశ్చర్యపోయి అతనిని నిద్రలేపింది.



5th Telugu Reader _unit1.indd 17 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com


అతని భాషలో ఉన్న యాసను చూసి దిగ్భ్రాంతి పొందింది. భర్తను అన్ని విషయాలడిగి తెలుసుకొంది. ఇంత మోసం జరిగిందని తెలుసుకున్న విద్యావతి తన జీవితం ఏమవుతుందో అని అమ్మవారిని మొరపెట్టుకొంది.

వెంటనే అమ్మవారు ప్రత్యక్షమై "విద్యావతీ! ఆవేదన పడవద్దు, నీ భర్తను కాళీ ఆలయానికి పంపించు. భక్తిశ్రద్ధలతో ప్రార్థించమను. ఆ దేవి నీ భర్తను తప్పక కరుణిస్తుంది" అని చెప్పి అమ్మవారు అదృశ్యమైంది.

విద్యావతీదేవి తన భర్తను బుజ్జగించి మంచి మాటలతో అతనిని కాళికాలయానికి పంపించింది. ఆ గొర్రెల కాపరి అమ్మవారిని మనస్ఫూర్తిగా వేడుకున్నాడు. కాళికాదేవి ప్రత్యక్షమై "ఆవేదనపడకు నాయనా! నీ నోరు తెరువు. నీ నాలుక మీద బీజాక్షరాలు రాస్తాను. నీవు మహాకవి అవుతావు. పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తావు, నా భక్తులలో అగ్రగణ్యుడవు అవుతావు" అని ఆశీర్వదించింది.

కాళికాదేవి వరప్రసాదంతో ఆ గొర్రెల కాపరి గొప్ప కవిగా మారాడు. అమ్మవారిని స్తుతించాడు. అప్పటినుండి ఆ కవి "కాళిదాసు" అన్న పేరుతో చరిత్రలో నిలిచిపోయాడు.

1. కింది బొమ్మలకు రంగులు వేయండి.





5th Telugu Reader _unit1.indd 18 02-07-2019 20:51:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

విభాగం 2

# 2.1 వేమన పద్యాలు

కవి: వేమన





1.* తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి వాడు గిట్టనేమి
పుట్టలోన చెదలు పుట్టదా గిట్టదా
విశ్వదాభిరామ! వినుర వేమ!

2. చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు
కొంచెమైన నదియు కొదవగాదు
విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ! వినుర వేమ!

3.* అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను
సజ్జనుండుబల్కు చల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా
విశ్వదాభిరామ! వినుర వేమ!





5th Telugu Reader _unit2.indd 19 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com
www.Padasalai.Net

4. తప్పులెన్ను వారు తండోప తండంబు
ఉర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు
విశ్వదాభిరామ! వినుర వేమ!

5. * అంతరంగము నందు అపరాదములు చేసి
మంచి వాని వలెనె మనుజుడుండు
ఇతరులెరుగకన్న ఈశ్వరుండెరుగడా
విశ్వదాభిరామ! వినుర వేమ!

6. * మేడిపండు జూడ మేలిమైయుండును
పొట్ట విప్పి జూడ పురుగులుండు
పిరికి వాని మదిని బింక మీలాగురా
విశ్వదాభిరామ! వినుర వేమ!



**భావాలు:**

1) ఓ వేమా! వృద్ధాప్యంలో తల్లిదండ్రులను దయతో చూసుకోవాలి. ఒకవేళ తల్లిదండ్రులను దయతో చూడని కుమారుడు ఉంటె వాడు పుట్టినా, చచ్చినా ఒక్కటే. పుట్టలో చెదలు పుడుతుంది, చస్తుంది. దాని వలన ఎవరికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. దయలేని కుమారుడు కూడా అంతె.

2) ఓ వేమా! మంచి మనసుతో చేసిన పుణ్యం చిన్నదైనా అది చాలా విలువైనది. మర్రి విత్తనం చాలా చిన్నదైనప్పటికి దాని నుంచి చాలా పెద్దదైన మర్రి వృక్షం పుడుతుంది కదా. సహాయం చిన్నదైనా దాని ఫలితం గొప్పగా ఉంటుంది.

3) ఓ వేమా! చెడ్డవాడెప్పుడు తన గురించి గొప్పలు చెప్పుకుంటూ ఉంటాడు. అదే మంచివాడు అందరితో వినయంగా మెలగతాడు. కంచు ఎక్కువ శబ్దం చేస్తుంది. కాని దానికైనా విలువైన బంగారం మాత్రం శబ్దం చేయదు. మంచి వాళ్ళు వినయంగా ఉంటారు.

4) ఓ వేమా! ఈ లోకంలో ఎదుటి వారి తప్పులను లెక్కించే వారు చాలా మంది ఉంటారు. కాని వారి వారి తప్పులను మాత్రం తెలుసుకోరు. అందరిలోను తప్పులుంటాయి. తప్పులను సరిదిద్దుకొనేవారు గొప్పవారవుతారు.

5) ఓ వేమా! సమాజంలో కొంతమంది లోపల చాలా తప్పులు చేసినప్పటికి పైకి మాత్రం మంచి వారులాగా తిరుగుతుంటారు. చుట్టు పక్కల వారు తప్పులు చూడకపోయినా, దేవుడు చూడకుండా ఉంటాడా! తప్పుచేసిన వారికి తగిన శిక్ష వేస్తాడు.



5th Telugu Reader _unit2.indd 20 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

6) ఓ వేమా! మేడిపండు పైకి చూడడానికి బంగారు వన్నెతో మిలమిలలాడుతూ ఉంటుంది. పొట్ట విప్పి చూస్తే పురుగులుంటాయి. చెడ్డవారు పైకి మాత్రం మంచివారులాగా కనపడినా వారి గణాలు మాత్రం మంచివిగా ఉండవు.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. చిత్తం = మనసు
2. అల్పుడు = చెడ్డవాడు
3. సజ్జనుడు = మంచివాడు
4. కనకం = బంగారం
5. ఉర్వి = భూమి
6. అంతరంగం = మనసు (ఆత్మ)
7. మనుజుడు = మనిషి
8. మేడిపండు = అత్తిపండు
9. పిరికి = చెడ్డవాడు

### II ప్రకృతి - వికృతి

1. పుణ్యం - పున్నెం
2. కుమారుడు - కొమరుడు

### III వ్యతిరేక పదాలు

1. పుట్టుట × గిట్టుట
2. పాపం × పుణ్యం
3. ఆడంబరం × నిరాడంబరం
4. మంచి × చెడు
5. అపరాధం × నిరపరాధం

www.Padasalai.Net



5th Telugu Reader _unit2.indd 21 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

## IV జతపరచండి

1. పుట్టలోన చెదలు - పురుగులుండు
2. మఱ్ఱి విత్తనం - పుట్టదా గిట్టదా
3. సజ్జనుండు పల్కు - చిన్నది
4. తప్పులెన్నువారు - చల్లగాను
5. పొట్టవిప్పి జూడ - తమ తప్పులెరుగరు

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1) తల్లిదండ్రుల మీద ------- లేని పుత్రుడు.
2) ------------- కలిగి చేసిన పుణ్యంబు.
3) కంచు మ్రోగునట్లు --------- మ్రోగునా.
4) అంతరంగమునందు -------- చేసి
5) మేడిపండు జూడ ----------



## VI విడదీసి రాయండి

1. కొంచెమైన -
2. తప్పులెన్నువాడు -
3. ఈశ్వరుండెరుగడా -

## VII ప్రశ్నలు

1. తల్లిదండ్రుల మీద దయలేని కుమారుడు ఎవరితో సమానం?
2. మంచివాడు, చెడ్డవాడు ఎలా ప్రవర్తిస్తారు?
3. పిరికివాళ్ళ మనసు ఎటువంటిది?
4. మనం చేసిన తప్పుల్ని ఎవరు చూస్తుంటారు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది వాక్యాలు గమనించండి

1. తాత గుడికి వెళ్ళాడు.
2. నాన్న పొలం నుంచి వచ్చాడు.
3. రాధ పుస్తకం చదువుతున్నది.



5th Telugu Reader _unit2.indd 22 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

4. పిల్లలు ఆటలు ఆడుతున్నారు.

పైన గీత గీసిన పదాలు తాత, నాన్న, రాధ, పిల్లలు చేసిన పనిని తెలియజేస్తున్నాయి కదా! ఇలా పనిని తెలియజేసే పదాలను "క్రియాపదాలు" అంటారు.

ఆ) కింది క్రియా పదాల ఆధారంగా వాక్యాలు రాయండి.

(నడిచారు, అమ్ముతున్నారు, కొన్నాడు, చదివింది)

1. ----------------------------------------

2. ----------------------------------------

3. ----------------------------------------

4. ----------------------------------------

## IX. విద్యార్థులకు సూచన

1. సుమతి పద్యాలను, వేమన పద్యాలను కంఠస్థం చేయండి.

## X. ఉపాధ్యాయులకు సూచన

1 సుమతి శతకం, వేమన శతకం, భాస్కర శతకం వంటి పద్యాలను కంఠస్థం చేయించి పోటీలు నిర్వహించండి.

## ప్రణాళికా పని



1. నీతి పద్యాలను సేకరించి, చార్టుపై రాసి మీ తరగతి గది గోడలపై అతికించండి.

కింది పదాలు వరుస క్రమంలో ఉంచి రాయండి.

ఉదా॥ నూర్పిడి, కలుపు, ధాన్యం, నాట్లు : – నాట్లు, కలుపు, ధాన్యం, నూర్పిడి

1. బియ్యం, వడ్లు, బువ్వ, మిల్లు :____________

2. ప్రయాణం, టిక్కెట్టు, బస్సు, బస్టాండు :____________

3. ఇల్లు, పునాది, కప్పు, గోడ :____________

4. మేఘం, నీరు, ఆవిరి, వర్షం :____________

5. నీరు, తాడు, బావి, బక్కెట్టు :____________



5th Telugu Reader _unit2.indd 23 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
2

# 2.2 ప్రగతి పథంలో స్త్రీ

(సంభాషణ)

(అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలి. మనోవికాసం కలిగించుకోవాలి. దీనివల్ల స్త్రీల పరిస్థితి మెరుగవుతుందని చాటి చెప్పే సంభాషణ.)

వేదవతి ఇంటి వసారాలో బియ్యంలో రాళ్ళేరుతూ కూతురు గౌరీతో మాట్లాడుతోంది. గౌరి లోపల దినపత్రిక చూస్తోంది.

వేదవతి : అమ్మా గౌరీ! ఏం చేస్తున్నావమ్మ?

గౌరి : (లోపలి నుంచి) హోం వర్క్ చేసేశాను. ఈరోజు పత్రికలో వచ్చిన ఒక బొమ్మను చూస్తున్నాను.

వేదవతి : అలాగా! ఒక్కసారి ఇలారా ఈరోజు దాని గురించి నీకు చెప్పాలి. (లోపలి నుంచి గౌరి ఆ పత్రికతో సహా వచ్చింది)

గౌరి : ఏమిటమ్మా అది ఈ బొమ్మ గురించి ఏదో చెబుతానన్నావు..

వేదవతి : ఆడపిల్లలు అన్ని రంగాల్లోనూ ఎంతటి ఘనకార్యాలు సాధించారో తెలపడం కోసం ఈ వ్యాసాన్ని బొమ్మతో సహా వేశారు తెలుసా?



5th Telugu Reader _unit2.indd 24 02-07-2019 20:52:52
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



గౌరి : అలాగా అమ్మ! (పత్రికలోని బొమ్మను చూపుతూ) వీరందరూ ఏం చేశారమ్మా?

వేదవతి : విను మరి! ఈ బొమ్మలో ఉన్న వారు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్, కవయిత్రి సరోజినీ నాయుడు, నిస్వార్థ సేవకురాలు మదర్ థెరిసా. మరి ఇందులో మనకు స్వాతంత్రం వచ్చిన తర్వాత స్త్రీల స్థితిలో వచ్చిన మార్పు, స్వాతంత్ర్య పోరాట సమయంలో స్త్రీల తోడ్పాటు మొదలైన విషయాలను ప్రస్తావించారు.

గౌరీ : ఇదివరకు ఆడవాళ్ళ పరిస్థితి ఎట్లా ఉండేదమ్మా?

వేదవతి : స్త్రీల పరిస్థితి పూర్వం ఏ మాత్రం బాగుండేది కాదు.

గౌరి : మరి వాళ్ళలో మార్పు ఎలా వచ్చింది?

వేదవతి : దేశం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నప్పుడు జరిపిన పోరాటంలో అప్పుడప్పుడు స్త్రీలు పాల్గొన్నారు. మన దేశానికి పూర్తిగా స్వాతంత్ర్యం లభించిన తర్వాత పరిస్థితిలో బాగా మార్పు వచ్చింది.

గౌరి : అదెలా మొదలైంది?

వేదవతి :మనకు స్వాతంత్ర్యం వచ్చాక విద్యా విషయంలో స్త్రీల స్థితి మెరుగయింది. మగవారితో పాటు



5th Telugu Reader _unit2.indd 25 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



ఆడ పిల్లలు చదవడం పరిపాటి అయ్యింది. స్త్రీలు చదువుకుంటేనే వారి పిల్లలను ఆదర్శ పౌరులుగా తీర్చి దిద్దగలరనే నమ్మకం ఏర్పడింది. క్రమేపీ జరిగిన మనోవికాసం వల్ల స్త్రీలు ఉన్నత విద్యను అభ్యసించారు. గృహ విజ్ఞానం నుంచి సాంకేతిక విద్య వరకు స్త్రీలు వారి అభిరుచిని బట్టి చదివే అవకాశాలు లభించాయి. వైద్య విద్య చదివినవారు నేడు అధికంగానే ఉన్నారు.

గౌరి : మరి రాజకీయాల్లోనూ, సాంస్కృతిక రంగాలలోనూ అభివృద్ధి సాధించారా అమ్మా?

వేదవతి : అవును. శ్రీమతి ఇందిరాగాంధీ వంటి వారు రాజకీయాల్లోనూ, శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మి వంటివారు సంగీతంలోనూ, శ్రీమతి రుక్మిణి అరుండేల్ వంటివారు నృత్యంలోను పురోగమించి స్త్రీ సాధించిన ప్రగతికి ఆదర్శప్రాయంగా నిలిచారు.

గౌరి : అయితే మరి మన పని పిల్ల లక్ష్మి కొద్దిగా చదువుకుంది కానీ వాళ్ళ అమ్మాయిని బడికి పంపించదేం?

వేదవతి : చాలా చక్కటి ప్రశ్న వేశావు. లక్ష్మిలాంటి వాళ్లకు అందరూ పని చేస్తే కాని ఇల్లు గడవదు. అయినా తీరిక వేళల్లో కూర్చోబెట్టి తనే చదివిస్తుంటుంది. ఆ అమ్మాయి శ్రద్ధగా చదువుకుంటోంది. లక్ష్మిలాంటి కుటుంబాలు దేశంలో ఎన్నో ఉన్నాయి. క్రమేపీ అందరూ చదువు నేర్చుకుంటారు. అందుబాటులో ఉన్న ప్రతి అవకాశం వినియోగించుకొని బాగా చదువుకొని మనోవికాసం కలిగించుకోవాలి. దానికి పట్టుదల, కృషి తోడైతే దేన్నయినా సాధించవచ్చు.

గౌరి : అయితే నేనూ బాగా చదువుకొని చురుకుదనంతో పైకి వస్తాను. (ఇద్దరూ లోపలికి వెళ్ళారు.)



5th Telugu Reader _unit2.indd 26 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. ఘనకార్యం = గొప్ప పని
2. పోరాటం = యుద్ధం
3. పరిపాటి = అలవాటు
4. ప్రస్తావించు = పేర్కొను
5. పురోగమించు = ముందుకు వెళ్ళు
6. అభిరుచి = ఆసక్తి

### II. ప్రకృతి – వికృతి

1. విద్య – విద్దె
2. స్త్రీ – ఇంతి
3. బంధువు – బందువు

### III. వ్యతిరేకపదాలు

1. పరతంత్ర్యం × స్వాతంత్ర్యం
2. స్వదేశం × విదేశం
3. అల్పం × అధికం.

### IV జతపరచండి

1. సాధన – శ్రమ
2. కృషి – తక్కువ
3. అల్పం – ఉపకరణం
4. చదువు – సంస్కారం

www.Padasalai.Net



5th Telugu Reader _unit2.indd 27 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## V. చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



1. వేదవతి కూతురు పేరేమి?

అ) లక్ష్మి ఆ) గౌరి ఇ) సరస్వతి

2. నిస్వార్థ సేవకురాలు ఎవరు?

అ) మదర్‌థెరిసా ఆ) కృష్ణ ఇ) సీతాంబ

3. గౌరి దేనిలో బొమ్మను చూసింది..

అ) పత్రిక ఆ) పుస్తకం ఇ) గ్రంథం

4. భారతదేశాన్ని 250 సంవత్సరాలకు పూర్వం ఎవరు పరిపాలించారు?

అ) డచ్ ఆ) ఫ్రెంచ్ ఇ) బ్రిటిష్

## VI కలిపి రాయండి

1. రాళ్ళు + ఏరుతూ =

2. ఏర్పాటు + అయ్యాక =

3. అప్పుడు + అప్పుడు =

4. వాళ్ళ + అమ్మాయిని =

## VII. ప్రశ్నలు

1. గౌరి ఏం చేస్తోంది?

2. వేదవతి ఎవరి గురించి వివరించింది?

3. దేశంలో స్త్రీల స్థితులలో ఎప్పటినుంచి మార్పు కనిపించింది?

4. మనోవికాసానికి తోడ్పడేదేమిటి?

5. వివిధ రంగాల్లో ఉన్న స్త్రీలను ఉదాహరణలతో వివరించండి.

www.Padasalai.Net



5th Telugu Reader _unit2.indd 28 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## VIII. భాషను గురించి తెలుసుకుందాం.



సమాపక క్రియలు

కింది క్రియాపదాలను పరిశీలించండి.

చూశాడు, కాలిపోయింది, పడిపోయాను. ఈ పదాలు వాక్య భావాన్ని పూర్తయినట్లుగా తెలుపుతున్నాయి కదా! ఇలా వాక్యభావాన్ని పూర్తిగా తెలిపే క్రియా పదాలను 'సమాపక క్రియలు' అంటారు.

ఉదా॥

1. మీకు కావలసిన సహాయం చేస్తాను.
2. నేను అడవి చుట్టూ కాపలా కాస్తాను.
3. వర్షం జోరుగా కురిసింది.
4. జంతుప్రదర్శనశాల అందంగా ఉంటుంది.
5. దీప చెట్టు పై నుంచి కింద పడిపోయింది.

ఆ) కింది సమాపక క్రియ పదాలను ఉపయోగించి కొన్ని వాక్యాలు రాయండి

1. ఎగిరిపోయింది:________________
2. ప్రవహిస్తోంది:________________
3. వెళ్ళింది:________________
4. చదువుతున్నాడు:________________
5. పాడింది:________________

## IX విద్యార్థులకు సూచన

1. ఇలాంటి సంభాషణ ద్వారా మనోవికాసం పెంపొందించుకోవాలి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. నిస్వార్థ సేవకురాలు మదర్‌థెరిసా లాంటి స్త్రీలను గూర్చి విద్యార్థులకు వివరించి చెప్పాలి.

### ప్రణాళికా పని

1. స్థానికంగా ఉన్న ప్రముఖ స్త్రీల పేర్లు వారు సాధించిన విజయాలను, చేసిన సేవలను వివరించాలి.






5th Telugu Reader _unit2.indd 29 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 2

చదువు - ఆనందించు

# 2.3 కర్ణుని దాతృత్వం



మహాభారతంలో గొప్ప దాన గుణం కలిగిన మహావీరుడు కర్ణుడు. కుంతీదేవికి సూర్యుని వరం చేత సహజ కవచ కుండలాలతో కర్ణుడు జన్మించాడు. అర్జునుడు కూడా కుంతిదేవి పుత్రుడే. కానీ అర్జునుడు ఇంద్రుని వరం వలన ఆమెకు జన్మించాడు. కాబట్టి మహాభారత యుద్ధ సమయంలో ఇంద్రుడికి, సూర్యుడికి వారి వారి పుత్రులకే విజయం లభించాలని ఆశించారు.

ఒకరోజు రాత్రి కర్ణుడు నిద్రపోతుండగా కలలో సూర్యుడు కనిపించి ఇలా అంటాడు. “కర్ణా! రేపు ఒక బ్రాహ్మణుడు నీ దగ్గరకు వస్తాడు. కానీ అతడు బ్రాహ్మణ వేషంలో ఉన్న ఇంద్రుడు. జన్మించినప్పటి నుంచి నీకు సహజంగా ఉన్న కవచకుండలాలను అతనికివ్వమని అడుగుతాడు. కానీ నువ్వు అతనికి ఇవ్వద్దు”. అందుకు కర్ణుడు నా దగ్గరకు వచ్చి దానం అడిగినపుడు ఇవ్వకుండా ఎలా ఉండేది? అని అన్నాడు. అప్పుడు సూర్యుడు “కానీ నీ కవచకుండలాలు ఇస్తే నీ తేజస్సు క్షీణిస్తుంది. శక్తి నశించి పోతుంది. అప్పుడు యుద్ధంలో శత్రువులతో ఎలా పోరాడుతావు?” అని ప్రశ్నిస్తాడు. దానికి కర్ణుడు “నేను పరశురాముని వద్ద విద్యలెన్నో నేర్చుకున్నాను. వాటిని ఉపయోగించుకుంటాను. కానీ నన్ను దానం అడిగేవారిని నేను నిరాకరించలేను” అని



5th Telugu Reader _unit2.indd 30 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

అన్నాడు. "నాయనా! నీ మీద ఉన్న ప్రేమ కారణంగా నిన్ను హెచ్చరించడానికి వచ్చాను. కానీ కవచకుండలాలు ఇస్తే ఆపదలో చిక్కుకుంటావు" అని సూర్యుడు కర్ణుడితో అన్నాడు. అప్పుడు "మీ ఉపదేశానికి ధన్యవాదాలు. నా దగ్గర ఏదైనా ఉన్నప్పుడు యాచకులను (అడిగి వచ్చేవారిని) నిరాకరించడం నావల్ల కాదు" అని కర్ణుడు చెప్పాడు. సూర్యుడు "అయితే మరి నీ ఇష్టం" అని అదృశ్యమయ్యాడు. కర్ణుడికి నిద్ర మెలకువ వచ్చింది. కల పూర్తి అయ్యింది.

కౌరవ పాండవ యుద్ధంలో కర్ణుడు అర్జునుని తప్పకుండా ఓడిస్తాడు. అందుకు ఇంద్రుడు ఒక ఉపాయం ఆలోచించాడు. కర్ణుడి దానగుణం గురించి ఇంద్రుడికి బాగా తెలుసు. ఒకరోజు బ్రాహ్మణ వేషంలో ఇంద్రుడు కర్ణుని ఇంటికి వెళతాడు.

"కర్ణా! నాకు నీ నుంచి భిక్ష కావాలి!" అని యాచిస్తాడు ఇంద్రుడు. అప్పుడు కర్ణుడు ఆ బ్రాహ్మణునితో "మీకు ఎటువంటి బిక్ష కావాలి? మీ పుత్రుని ఉపనయనానికి వంద బంగారు వరహాలు ఇవ్వనా? లేకపోతే మీ పుత్రిక పెళ్ళికి 1000 బంగారు వరహాలు ఇవ్వనా? లేక మీకు గోవులు కావాలా?" అని అడిగాడు, కానీ ఇంద్రుడు కర్ణుని ప్రశ్న విని కపట ఉపాయంతో "నాకు నువ్వు చెప్పినవేవి వద్దు. నువ్వు పుట్టిన సమయం నుంచి నీ దగ్గర కవచకుండలాలు ఉన్నాయి కదా! అవే నాకివ్వు" అని అడిగాడు. కర్ణుడికి తన కల సంగతి గుర్తుకు వచ్చింది. సూర్యదేవుడు చెప్పినట్లుగా నిజంగా ఒక బ్రాహ్మణుడు తన ద్వారం వద్దకు వచ్చి తన కవచ కుండలాలు అడుగుతున్నాడు. అయితే ఈ బ్రాహ్మణుడు స్వయంగా ఇంద్రుడే!

కర్ణుడు బ్రాహ్మణుని వేషంలో వచ్చిన ఇంద్రునితో "మహాశయా! నా కవచకుండలాలను మీరు ఏం చేసుకుంటారు? కావాలంటే ఈ భూమినంతటిని జయించి మీకు సమర్పించుకుంటాను" అన్నాడు. అందుకు బ్రాహ్మణుడు "వద్దు! వద్దు! నాకు ఈ భూమితో అవసరం లేదు. నీ కవచకుండలాలే కావాలి. ఇస్తావా నాకు? అంతటి వీరుడవేనా నువ్వు?" అని ప్రశ్నిస్తాడు.

కర్ణుడు ఒకసారి ఇంద్రుని వంక చూసి "మీరు ఇంద్ర దేవులు. మీరు నా కవచకుండలాలను అడిగారు. తీసుకోండి మహాశయా!" అని ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా కర్ణుడు తన శరీరం మీద ఉన్న కవచకుండలాలను ఊడతీశాడు. అవి అతని శరీరంలో ఒక భాగం. వాటిని తీస్తున్నప్పుడు అతని శరీరం గాయమై రక్తం ధారగా కారింది. కాని కర్ణుడు దానిని పట్టించుకోలేదు. తన గుమ్మంలో నిలుచున్న ఆ బ్రాహ్మణునికి కవచకుండలాలను ఆనందంగా ఇచ్చేశాడు.

ఇంద్రుడికి కూడా ఆశ్చర్యం కలిగింది. వెంటనే కర్ణునితో "సూర్యుడు నీ కలలోకి వచ్చి హెచ్చరించినా నువ్వు నీ కవచకుండలాలు దానం ఇవ్వడానికి కొంచెం కూడా వెనకాడలేదు. నువ్వు ధన్యుడివి. దాన, వీర కర్ణుడిగా మూడు లోకాల్లో నీ కీర్తి పొగడబడుతుంది. కవచం తీస్తున్నప్పుడు నీ శరీరం గాయపడింది. కానీ ఆ మచ్చలు నీ శరీరం మీద కనిపించవు. నీకు "వాసవి" అనే శక్తిని ఇస్తున్నాను. దానిని నువ్వు యుద్ధంలో ఎవరి మీదనైనా ప్రయోగించవచ్చు. నీకు ఇంకేమైనా కావాలంటే అడుగు ఇస్తాను" అని అంటాడు. అప్పుడు కర్ణుడు "నా దగ్గర యాచించడానికి వచ్చిన మిమ్మల్ని ఏమీ అడగను? మీరు సంతోషంగా వెళ్ళండి" అని అన్నాడు. బ్రాహ్మణ రూపంలో ఉన్న ఇంద్రుడు వెళ్ళిపోతాడు. ఇంద్రుడు తన పన్నాగాన్ని చక్కగా పూర్తి చేసుకున్నాడు. కర్ణుడు తన ధర్మాన్ని నిలబెట్టుకున్నాడు. గొప్ప దాన వీరుడుగా కీర్తింపబడ్డాడు.



5th Telugu Reader _unit2.indd 31 02-07-2019 20:52:53
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విభాగం 3

# 3.1 మా తోట

కవి: అవధాని రమేష్



ఈ తోట మా తోట

ఇంపుల మూట

ప్రీతి రసముల ఊట

ప్రియముల బాట

చిన్ని మొక్కలు మాకు

చిన్ని తమ్ముళ్ళు

చిన్ని తీవలు మాకు



5th Telugu Reader _unit3.indd 32 02-07-2019 20:55:41
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com


www.Padasalai.Net www.Trb Tnpsc.Com

చిన్ని చెల్లెళ్ళు
నిజమైన ప్రేమతో
నీళ్ళు పోస్తాము
గాటంపు ప్రీతితో
కలుపు తీస్తాము
ఇరవైన కరుణతో
ఎరువు వేస్తాము
శ్రద్ధగా దినదినం
వృద్ధి చేస్తాము
చిగురు వేసిననాడు
చిటి విందు మాకు
మొగ్గ తొడిగిన నాడు
మురిపెంబు మాకు
కలకల లాడిన
కలుగు వేడుక మాకు
మిలమిల మెరిసిన
మోదమ్ము మాకు
చిగురాకు తెంపము
చెలిమితో మేము
ఎవరు గిల్లిన గాని
ఎవరు తెంపిన గాని
మము కొట్టినట్లుండు




Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



మనసులో మాకు

మా చిన్ని మొక్కలు

మము చేర బిల్చు

మము జూచి పుష్పాలు

మందహాసము చేయు

గంధోళుల్ సల్లి

కలకల నవ్వు

రంగురంగుల పూల

హోరంగుల ముందు

వన్నె చిన్నెలు చిమ్ము

సీతాకోక చిలుకల

కడు పాత్రమున వచ్చి

మిడుకు తుమ్మెదల

పిలిచి పూ దేనియ

బిచ్చంబు వేయు

పయనమ్ము సాగించు

బాటసారులను

నిలిపి తమ్మొకసారి

తిలకింప చేయు

తమదు రూపమ్ముల

తమ సువాసనల

కను వీనులకు విందు

www.Padasalai.Net



Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net
www.Trb Tnpsc.Com



కలిగించి పంపు

మా తోట చెంతకు

మానక వచ్చి

ఉబ్బి గానమ్ము చే

యును కోకిలమ్మ

ఆకుపచ్చని చీర

అందమ్ము తోడ

చిలకమ్మ జిలిబిలి

పల్కు లొల్కించు



5th Telugu Reader _unit3.indd 35 02-07-2019 20:55:42
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

అందాల మా తోట

నందనారామమ్ము

సుందరమ్ములకు మె

చ్చందనమ్ములకు

## సారాంశం

ఈ అందమైన తోట మా పూలతోట. ఈ తోటలో విహరిస్తుంటే ఇంపుగా, ప్రేమగా, ఆనందంగా ఉంటుంది. సుందరమైన ఈ తోట ప్రియమైన బాట. ఈ తోటలో ఉన్న చిన్న మొక్కలు మా చిన్న తమ్ముళ్ళు లాంటివి. అందమైన పూల తీగలు మాకు చిట్టి చెల్లెళ్ళు. నిజమైన ప్రేమతో మొక్కలకు నీళ్ళు పోస్తాం. ఆనందంతో కలుపు తీస్తాం.

మొక్కలన్నీ పుష్టిగా, బలంగా పెరగాలని కరుణతో ఎరువు వేస్తాం, ప్రతిరోజు శ్రద్ధగా మొక్కలను కంటికి రెప్పలా కాపాడుతూ పెంచుతాం. మొక్కలు చిగురించిన రోజు విందు భోజనం మాకు, మొగ్గలు తొడిగిన రోజు మురిసిపోతాం. తీగలతో పుష్పాలతో తోట కళకళలాడుతుంటె మాకు కనుల పండుగగా ఉంటుంది. మిలమిల మెరుస్తుంటె ఎంతో ఆనందం మాకు. మా తోటలో ఉన్న చిగురాకును కూడా మేము కోయము. ఎవరైనా తీగలను గిల్లినా, మొక్కలను తెంపినా మమ్మల్ని కొట్టినట్టుంటుంది.

మొక్కలతో మేము స్నేహంగా ఉంటాం. మొక్కలు మమ్మల్ని దగ్గరకు పిలుస్తాయి. పుష్పాలు సుగంధాలు చల్లి ఆనందంగా మాతో నవ్వుతాయి. కలకల నవ్వే రంగురంగుల పుష్పాలతో వన్నెచిన్నెలు చిమ్మే సీతాకోకచిలుకలు అందంగా ఉంటాయి. పుష్పాల దగ్గరకు ఆకలితే వచ్చే తుమ్మెదలకు తియ్యని తేనెను ఇస్తాయి.

దారిలో వెళ్ళే బాటసారులను నిలిపి ఒకసారి అందమైన ఉద్యానవనాన్ని చూసేటట్టు చేస్తుంది. అందమైన పూలతోట చూడడానికి కనులకు విందుగా ఉంది. పుష్పాల నుండి వెలువడే సువాసనలకు మైమరచి మాతోటకు విడవకుండా వచ్చి సంతోషంతో పాటలు పాడుతుంది కోకిలమ్మ. ఆకుపచ్చని చీరకట్టి అందమైన చిలుకపలుకలు పలికే రామచిలుకలకు నిలయం మా తోట. సుందరమైన అందాలకు నిలయమైన మా తోట అందాల నందనవనం.

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. బాట = దారి
2. చెలిమి = స్నేహం
3. పుష్పాలు = పువ్వులు



5th Telugu Reader _unit3.indd 36 02-07-2019 20:55:42
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

4. మందహాసం = చిరునవ్వు

5. మోదం = సంతోషం

6. బాటసారి = దారివెంట నడిచేవాడు

7. గంధోళి = పుప్పొడి

8. సువాసన = మంచి వాసన

## II ప్రకృతి – వికృతి

1. నిజం – నిక్కం

2. చిరి – చిలుక

3. శ్రద్ధ – సద్ద

4. వృద్ధి – వడ్డి

## III వ్యతిరేక పదాలు

1. ప్రియం × అప్రియం

2. నిజం × అబద్ధం

3. శ్రద్ధ × అశ్రద్ధ

4. ముందు × వెనుక

## IV జతపరచండి

1. మాతోట – ఆకుపచ్చని చీర

2. పుష్పాలు – సీతాకోకచిలుక

3. వన్నెచిన్నెలు – ఇంపుల మూట

4. కోకిలమ్మ – మందహాసం

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1. మా తోట ________________ మూట.

2. చిన్ని మొక్కలు మాకు ________________



5th Telugu Reader _unit3.indd 37 02-07-2019 20:55:42

Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. వన్నె చిన్నెలు ____________________ చిలుక.

4. ఉబ్బి గానమ్ము చేయును ____________________

5. నిజమైన ప్రేమతో ____________________ పోస్తాం.

## VI విడదీసి రాయండి

1. కొట్టినట్లుండు –
2. చిగురాకు –
3. పూదేనియ –

## VII ప్రశ్నలు

1. పిల్లలు తోటను ఎలా వృద్ధిచేస్తామని చెబుతున్నారు?
2. తోట రోజు రోజుకూ వృద్ధి చెందుతుంటే ఎలా ఉంటుందని గేయంలో చెప్పారు?
3. తోటను పాడుచేస్తే ఎలా ఉంటుందని గేయంలో పిల్లలు చెప్పారు?
4. తోటలోని పూల గురించి ఏమని తెలియజేశారు?
5. తోట అందం ఎలా ఉంది?

## VIII భాషను గురించి తెలుసుకుందాం



అ) క్రింది పదాలలో సమాపక, అసమాపక క్రియలు రెండిటిని ఉపయోగించి వాక్యాలను రాయండి.

| అసమాపక క్రియలు | సమాపక క్రియలు |
|---|---|
| నవ్వి | నవ్వాడు |
| పోయి | చదువుతున్నాడు |
| వచ్చి | పట్టుకున్నాడు |
| చూసి | ఆడుతున్నాడు |
| పరిగెతి | గీశాడు |
| తిని | చూస్తున్నాడు |

ఉదా॥ శ్రీరామ్ కథ రాసి, చదువుతున్నాడు.



5th Telugu Reader _unit3.indd 38 02-07-2019 20:55:43
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

ఆ) మీరు రోజు రకరకాల పనులు చేస్తూంటారు కదా! పనులను తెలియజేసే క్రియా పదాలు రాయండి. వాటికి అసమాపక క్రియా పదాలుగా రాసి, వాటితో వాక్యాలు రాయండి.

ఉదా॥ నిద్ర లేచాను – నిద్ర లేచి

నేను ఉదయాన్నే నిద్రలేచి, ముఖం కడిగాను.

1. -----------------------------------------------------

2. -----------------------------------------------------

3. -----------------------------------------------------

4. -----------------------------------------------------

5. -----------------------------------------------------

## IX విద్యార్థులకు సూచన

1. తోటను గురించి దాని ప్రాముఖ్యతను గురించి విద్యార్థులు తెలుసుకోవాలి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. మీ పాఠశాలలోని ఖాళీ స్థలంలో ఒక చిన్న తోటను పెట్టి విద్యార్థులను సంరక్షించమని చెప్పండి

## ప్రణాళికా పని



1. మొక్కల గురించి, చెట్లను గురించి రాసిన కవితలు/గేయాలు/పాటలు /పద్యాలు / చిత్రాలను సేకరించండి. వాటిని గురించి వివరించండి.





5th Telugu Reader _unit3.indd 39 02-07-2019 20:55:43
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
3

# 3.2 నీడ ఖరీదు



(ఈ చెట్టు నాది. ఈ చెట్టు నీడ కూడా నాదే! అన్న ముసలాయనతో "క్షమించండి, ఈ చెట్టు నీడను నాకు అమ్ముతారా?" అని నమ్రతగా శివయ్య అడిగాడు. ఇంతకీ శివయ్య ఎవరు? చెట్టు నీడను ముసలాయన అమ్మాడా? నీడను కూడా అమ్ముకునే వారుంటారా? ఏం జరిగిందో తెలుసుకోవాలని ఉందా? పాఠం చదవండి. మీకే తెలుస్తుంది.)

ఆ రోజు బడికి సెలవు కావడంతో పిల్లలందరూ ఊరి చివర చింతచెట్టు కింద ఆటలాడుకుంటున్నారు. కొందరు చెట్టు ఎక్కుతూ దిగుతూ కోతికొమ్మచ్చి ఆడుతున్నారు. "చింతకాయ పులుపు చెట్టెక్కి దులుపు" అంటూ చింతచెట్టు కొమ్మలని ఊపుతూ చింతకాయలు రాలుస్తున్నారు మరికొందరు.

చింత చెట్టుకు దగ్గరగా పెద్ద ఇల్లు ఉంది. ఆ ఇల్లు పిసినారి పాపయ్యది. పిల్లికి బిచ్చం పెట్టని పాపయ్యకు ఎవరితోనూ గిట్టదు. ఎప్పుడూ రుసరుసలాడుతూ ముఖం చిట్లించుకుంటూ ఉంటాడు. ఈ విషయం అక్కడ



5th Telugu Reader _unit3.indd 40 02-07-2019 20:55:43
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

ఆడే పిల్లలకు కూడా తెలుసు. అందుకే పిసినారి పాపయ్య కంటపడకుండా ఆడుకుంటూనే ఉంటారు. ఆ రోజు అదే తంతు. పిల్లలు కేరింతలు విన్నాడో లేదో "ఎవర్రా అది, నా చింత చెట్టుపై ఆడతారా? ఎంత ధైర్యం మీకు? ఉండండి! మీ పని చెప్తాను" అని అరుస్తూ పిల్లల్ని పట్టుకోవడానికి పరిగెత్తాడు. పిల్లలు దొరికితేనా? ఈయన మాట వినిపించిందో లేదో పిల్లలంతా కాలికి బుద్ధి చెప్పారు. ఇలా ఉండగా ఒకరోజు పొరుగూరు నుండి శివయ్య అనే యువకుడు ఆ దారిన వెళ్తూ అలసటతో చింత చెట్టు కింద కూర్చున్నాడు. ఆరోజు కూడా యధావిధిగా పిల్లలు రావడం, ఆడుకోవడం పిసినారి పాపయ్య నిప్పులు చెరుగుతూ పరుగెత్తుకొని రావడం జరిగింది. పిల్లలంతా పరుగో! పరుగు!

పాపయ్య చెట్టు కిందకు వచ్చాడు. పిల్లలు లేరు. కానీ చెట్టు నీడలో శివయ్య కనిపించాడు. అలసిపోయి ఉన్నాడేమో శివయ్యకు కునుకు పట్టింది. నిద్రిస్తున్న శివయ్య పాపయ్యను గమనించలేదు.

పాపయ్య కోపంతో "ఎవర్రా నువ్వు? పరాయి వాళ్ళ చెట్టునీడలో కూర్చుని కునుకు తీస్తున్నావ్! లే! లేచిపో! అని గట్టిగా కేకలేస్తూ అరిచాడు.

ఆ కేకలకు శివయ్య తుళ్ళిపడి లేచాడు.

"అయ్యా! క్షమించండి. ఏమంటున్నారు? మరోసారి సెలవియ్యండి!" అన్నాడు.

"ఏం నేనన్నది చెవికెక్కలేదా? పరాయివాళ్ళ చెట్టు నీడలో హాయిగా కూర్చుని కునుకు తీస్తున్నావ్!" అని అన్నాడు.

శివయ్యకు ముసలాయన ప్రవర్తన విచిత్రంగా అనిపించింది. "పరాయివాళ్ళ చెట్టు నీడ ఏమిటండీ?" అని అడిగాడు శివయ్య.

" ఇది నా చెట్టు. ఈ నీడ నా చెట్టు నీడ! ఊ..... నడు... బయటికి నడు" అంటూ ముసలాయన మళ్ళీ శివయ్య మీద గట్టిగా అరిచాడు.

"ఈ చెట్టు ఊరందరిదీ కదా!" అన్నాడు యువకుడు.

"ఎవరన్నారా మాట?" మా తాత ఈ చెట్టును వేశాడు. అందుచేత ఈ చెట్టు నాది. ఇక ఇక్కడినుంచి దయ చెయ్యి!" అంటూ ముసలాయన కస్సుమన్నాడు. "అదేమిటండి! దారిన వెళ్తూ సేదదీరడం తప్పా! రోడ్డు పక్కన చెట్లు బాటసారులకు నీడనిస్తాయనే కదా! మహానుభావులు చెట్లను నాటేది. మీరు మరీ విచిత్రంగా మాట్లాడుతున్నారు!" అని శివయ్య విస్తుపోతూ అన్నాడు.

ఈ మాటలు పిసినారి పాపయ్య చెవికెక్కితే కదా!" ఇదేమి నీ జాగీరు కాదు. ఉత్తి పుణ్యానికే చెట్టు కింద కూర్చుని ఇంకా నాకే నీతులు చెబుతున్నావా? లే...... లే! నడు! మర్యాదగా ఇక్కడినుంచి వెళ్ళు!" అని ముసలాయన అన్నాడు. ఆ మాటలకు శివయ్య మనస్సు చివుక్కుమంది. ముసలాయన ఎలాంటివాడో



5th Telugu Reader _unit3.indd 41 02-07-2019 20:55:43
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



అర్థమైంది. ఎలాగైనా పిసినారి పాపయ్యకు బుద్ధి చెప్పాలనుకున్నాడు.

"అలాగా ఈ చెట్టు మీదాండీ! క్షమించండి. ఈ చెట్టు నీడను నాకు అమ్ముతారా? నేను కొనుక్కుంటాను" అని శివయ్య ఎంతో నమ్రతగా ముసలాయనని అడిగాడు.

ఈ మాటలు విన్న పిసినారి పాపయ్యకు శివయ్య అమాయకుడిలా కనిపించాడు. "చెట్టు నీడను కొనుక్కుంటావా? ఓ... తప్పకుండా అమ్ముతాను, ఎంత ఇస్తావు?" అని వస్తున్న నవ్వును అణుచుకుంటూ అన్నాడు పాపయ్య.

"మీరే చెప్పండి" అని శివయ్య అన్నాడు.

"వెయ్యి రూపాయలిస్తావా? ఈ చెట్టు నీడ నీదైపోతుంది" అన్నాడు పాపయ్య. "అమ్మో వెయ్యి రూపాయలే! చాలా ఎక్కువ" అని అన్నాడు శివయ్య. "నీడంటే మాటలా? ఎండ తీవ్రంగా ఉందని పడుకున్నావు. ఎంత చల్లగా, హాయిగా ఉంటుందో చూశావా మరి! వెయ్యి రూపాయలిస్తేనే నీడ నీదవుతుంది, లేకుంటే లేదు. ఎంతోమంది ఉన్నారు ఈ నీడను కొనుక్కోడానికి" అని పిసినారి పాపయ్య అన్నాడు.

సరేనని శివయ్య వెయ్యి రూపాయలు తీసి ముసలాయనకు ఇచ్చాడు. నవ్వుతూ వెళ్ళి చెట్టు నీడలో పడుకున్నాడు.

"చెట్టు నీడను కొనుక్కునే తెలివితక్కువ దద్దమ్మ కూడా ఒకడుంటాడా?" అని తన అదృష్టానికి తానే మురిసిపోతూ ఇంట్లోకి వెళ్ళాడు పాపయ్య.



5th Telugu Reader _unit3.indd 42 02-07-2019 20:55:44
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

కాసేపటికి సూర్యుడి దిశ మారింది దాంతోపాటే చెట్టు నీడ కూడా జరగసాగింది. అలా.... అలా... ఆ నీడ ముసలాయన ఇంటి ఆవరణ వరకు జరిగింది. కాసేపయ్యాక శివయ్య లేచి నిల్చున్నాడు. చెట్టు నీడ పడ్డ ఇంటి ఆవరణలోకి వెళ్ళి కూర్చున్నాడు.

"శివయ్యా! ఇక్కడికి వచ్చావేమిటి? ఇలా ఇంకొకరి ఇంటి ఆవరణలోకి వచ్చి కూర్చోవచ్చా? నడు.... అవతలకి నడు" అన్నాడు ముసలాయన.

"అదేమిటండీ! అలా అంటారు!నేను మీరు అమ్మిన చెట్టు నీడలోనే కూర్చున్నాను" అన్నాడు శివయ్య.

పిసినారి పాపయ్యకు కోపం నషాళానికి అంటింది. "నా ఇంటి ఆవరణలోకి రావద్దన్నానా! ఎన్నిసార్లు చెప్పాలి? పో .... అవతలకి!" ముసలాయన మళ్ళీ గట్టిగా కేకలు వేశాడు.

"మీరే బయటకు వెళ్ళాలండీ! మీరు ఈ చెట్టు నీడను నాకు అమ్మారు కదా! ఆ నీడ ఎక్కడ పడితే అక్కడికి వెళ్ళి కూర్చోవడానికి నాకు హక్కు ఉంది" ఎంతో నెమ్మదిగా చెప్పాడు శివయ్య.

ముసలాయన తెల్లబోయాడు. లోలోపల సణుక్కుంటూ, గొణుక్కుంటూ విసవిసా ఇంట్లోకి వెళ్ళాడు.

శివయ్య చెట్టునీడతో పాటు జరుగుతూ ముసలాయన ఇంటి వరండాలోకి వెళ్ళాడు. ఆ తర్వాత చావడి గదిలోకి ప్రవేశించాడు.

"పో! బయటకి పో! నా ఇంట్లోంచి బయటకి పో!" అంటూ గట్టిగా చిందులు తొక్కాడు ముసలాయన.

శివయ్య చిరునవ్వులు చిందిస్తూ కూర్చున్నచోట నుంచి లేవలేదు. చెట్టు నీడ దిశ మారి పాపయ్య తోట మీద కూడా పడింది. శివయ్య తోటలోకి వెళ్ళి నీడ పడిన చోటులోని కూరగాయలన్నీ కోసుకోవడం మొదలుపెట్టాడు.

ఇది చూసి పిసినారి పాపయ్య లబోదిబోమని కన్నీరు మున్నీరుగా ఏడవడం మొదలుపెట్టాడు. మర్నాడు, ఆ తర్వాత రోజు, ఇలా ప్రతిరోజూ శివయ్య చెట్టు నీడతోపాటు జరుగుతూ, పడుకుంటూ, కూర్చుంటూ పిసినారి పాపయ్య ఇంట్లోకి వెళుతూనే ఉన్నాడు. తోటలోని కూరగాయలు కోసుకొని వెళ్తూనే ఉన్నాడు.

ఆఖరికి ఓ రోజున ముసలాయన ఇక ఉండబట్టలేక "బాబూ! నా చెట్టు నీడను నాకు ఇచ్చెయ్యి, నీ వెయ్యి రూపాయలు నీకు ఇచ్చేస్తాను" అని అన్నాడు.

"ఇంత చక్కటి చెట్టు నీడనే అమ్మే ఉద్దేశం నాకు లేదండీ! నా నీడ దగ్గరికి మీరు రాకండి. వెళ్ళిపొండి ఇక్కన్నుంచి!" అన్నాడు శివయ్య. ఇక లాభం లేదనుకొని పాపయ్య ఊళ్ళోవాళ్ళకు ఈ విషయం చెప్పాడు. ఇది విన్న ఊరివారంతా పిసినారి పాపయ్యను తగిన శాస్తి జరిగిందన్నారే తప్ప ఎవ్వరూ సహాయం చేయడానికి ముందుకు రాలేదు.

"పిసినారి గారూ! చెట్టు నీడ అమ్ముకున్నారు. ఇంకేదన్నా చెట్టు నీడ ఉంటే మాక్కూడా అమ్ముతారా? మేమూ కొనుక్కుంటాం" అంటూ ఆటపట్టించడం మొదలుపెట్టారు.



5th Telugu Reader _unit3.indd 43 02-07-2019 20:55:44
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



చివరకు పిసినారి పాపయ్య ఊరి పెద్దకు ఫిర్యాదు చేశాడు. ఊరి పెద్ద శివయ్యను పిలిపించాడు. శివయ్య జరిగినదంతా వివరించాడు. శివయ్య చేసిన పని సరైనదేనని తీర్పు చెప్పాడు ఊరి పెద్ద.

తీర్పు విన్న పిసినారి పాపయ్య తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. ఇది చూసి పిసినారి పాపయ్యలో మార్పు వచ్చిందని గ్రహించిన శివయ్య "పాపయ్య గారూ! చెట్టు మీదే! నీడ మీదే! మీలో మార్పు కోసమే ఇదంతా చేశాను" అని అన్నాడు.

పిసినారి పాపయ్య శివయ్యకు వెయ్యి రూపాయలు తిరిగి ఇచ్చివేసి కృతజ్ఞతలు చెప్పాడు. అప్పటి నుండి చెట్టునీడలో ఎవరు, ఎప్పుడు కూర్చున్నా ఏమీ అనేవాడు కాదు. తాగడానికి నీళ్ళిచ్చేవాడు, భోజనం కూడా పెట్టేవాడు. పిల్లలందరూ ఆటలాడుతుంటే తనూ వారితో కలిసి ఆడుతూ పిల్లవాడైపోయేవాడు పాపయ్య.

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. జాగీరు = రాజులు బహుమానంగా ఇచ్చిన భూమి
2. ఫిర్యాదు = ఆరోపించు
3. నమ్రత = వినయం, అణుకువ



5th Telugu Reader _unit3.indd 44 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

4. పశ్చాత్తాపం = చేసిన తప్పు తెలుసుకొని బాధపడడం

5. అర = గది

## II ప్రకృతి - వికృతి

1. ముఖం - మొగం

2. దిశ - దిక్కు

## III వ్యతిరేకపదాలు

1. లాభం × నష్టం

2. మర్యాద × అమర్యాద

3. ధైర్యం × అధైర్యం

4. పిల్లలు × పెద్దలు

## IV జతపరచండి

| | | |
|---|---|---|
| 1. పాపయ్య | - | చెట్టెక్కి దులుపు |
| 2. చింతకాయ పులుపు | - | పిసినారి |
| 3. శివయ్య | - | వెయ్యి రూపాయలు |
| 4. చెట్టునీడ ఖరీదు | - | యువకుడు |

## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



1. పాపయ్య ఎలాంటివాడు?

అ) మంచివాడు ఆ) పిసినారి ఇ) చెడ్డవాడు

2. చెట్టు నీడ ఖరీదు ఎంత?

అ) ఒక రూపాయి ఆ) రెండు రూపాయలు ఇ) వెయ్యి రూపాయలు

3. శివయ్య ఎవరు?

అ) యువకుడు ఆ) ముసలాయన ఇ) బ్రాహ్మణుడు



5th Telugu Reader _unit3.indd 45 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

4. పిసినారి పాపయ్య ఎవరికి కృతజ్ఞతలు చెప్పాడు?

అ) రాజు ఆ) శివయ్య ఇ) గ్రామపెద్ద

5. ఎవరు తన తప్పును తెలుసుకొని పశ్చాత్తాపంతో కుమిలిపోయారు?

అ) పాపయ్య ఆ) శివయ్య ఇ) గ్రామపెద్ద

## VI కలిపి రాయండి

1. రూపాయలు + ఇస్తావా =
2. ఊరు + అందరిదీ =
3. శివ + అయ్య =
4. నీది + అవుతుంది =

## VII ప్రశ్నలు

1. పిల్లల్ని చూసిన పిసినారి పాపయ్య ఏంచేశాడు?
2. శివయ్య మనస్సు ఎందుకు చివుక్కుమంది? ఏం చేయాలనుకున్నాడు?
3. పిసినారి పాపయ్య ప్రవర్తన చూసి శివయ్య ఏమనుకున్నాడు?
4. శివయ్య పిసినారి పాపయ్యకు ఎలా బుద్ధి చెప్పాడు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం.



విభక్తి – ప్రత్యయాలు

అ) కింది వాక్యాలను చదవండి, గీత గీసిన అక్షరాలను గుర్తించండి.

1. రాముడు మంచి బాలుడు.
2. శివ గురించి వాళ్ళ అమ్మ బడికి వెళ్ళింది.
3. ఎండతో పాటే వర్షం వస్తోంది.
4. రాణి పుస్తకం కోసం బజారుకెళ్ళింది.
5. అరేబియా సముద్రం కంటె పసిఫిక్ మహాసముద్రం పెద్దది.



5th Telugu Reader _unit3.indd 46 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

6. హనుమంతుడు రాముని యొక్క భక్తుడు.

7. గ్రామమందు పశువులు, పక్షులు, చెట్లు ఎక్కువగా ఉంటాయి.

పై వాక్యాలలో గీతగీసిన అక్షరాలను, పదాలను గమనించారు కదా! ఇవి లేకపోతే వాక్యాలు పూర్తి అర్థాన్ని ఇవ్వడం లేదు కదా! అంటే ఈ వాక్యంలో పదాల మధ్య సంబంధాన్ని ఏర్పరుస్తున్నాయి. ఇలాంటి అక్షరాలను, పదాలను "విభక్తి ప్రత్యయాలు" అని అంటారు.

ఈ ప్రత్యయాలున్నప్పుడే వాక్యం అర్థం అవుతుంది. లేకపోతే ఆ వాక్యం అర్థం కాదు.

తెలుగులో విభక్తి ప్రత్యయాలను 8 విధాలుగా విభజించారు.

| | | |
|---|---|---|
| 1. | డు,ము,వు,లు | ప్రథమా విభక్తి |
| 2. | నిన్, నున్, నన్, కూర్చి గురించి | ద్వితీయా విభక్తి |
| 3. | చేతన్, చేన్, తోడన్, తోన్ | తృతీయా విభక్తి |
| 4. | కొరకున్, కై | చతుర్థీ విభక్తి |
| 5. | వలనన్, కంటెన్, పట్టి | పంచమీ విభక్తి |
| 6. | కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ | షష్ఠీ విభక్తి |
| 7. | అందున్, నన్ | సప్తమీ విభక్తి |
| 8. | ఓ, ఓయి, ఓరి, ఓసి | సంబోధనా ప్రథమా విభక్తి |

## IX విద్యార్థులకు సూచన

1. పాఠంలో ఉండే విషయాన్ని ఊహించండి. పిసినారితనం వల్ల కలిగే లోపాలను తెలుసుకోండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. విద్యార్థులకు పాఠంలో ఉండే కష్టమైన పదాలకు అర్థాలను తెలియజేయండి.

### ప్రణాళికా పని

పిల్లలూ! మీ గ్రంథాలయం నుంచి హాస్యకథలను సేకరించండి. చదవండి. మీకు నచ్చిన హాస్యకథను సొంతమాటల్లో రాసి, చిత్రాలు గీసి ప్రదర్శించండి.





5th Telugu Reader _unit3.indd 47 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

విభాగం 3

చదువు - ఆనందించు

# 3.3 ఉత్తమ జంతువు



అడవి అంతా సందడిగా ఉంది. "ఉత్తమ జంతువు" పోటీ జరుగుతోంది. పక్క అడవి నుంచి న్యాయమూర్తుల బృందం ఉత్తమ జంతువును ఎంపిక చేయడానికి వచ్చింది. జంతువులన్నీ గుంపులు గుంపులుగా చేరాయి. న్యాయమూర్తులయిన సింహం, ఎలుగుబంటు, నక్క సిద్ధంగా ఉన్నాయి.

నెమలి తన అందమైన ధగధగ మెరిసే రంగురంగుల పురివిప్పింది. యువ సింహం రాజసం ఒలకబోస్తూ మెల్లగా నడిచి వచ్చింది. నక్క మిగతా జంతువుల వైపు అసూయగా చూసింది. ఉడుత మెరుస్తున్న తన ముందు పళ్ళను గోళ్లతో తట్టింది. పులి నిర్లక్ష్యంగా నడిచి వెళ్ళి ముందు వరుసలో కూర్చుంది. రామచిలుక కొమ్మ మీద వాలింది. పోటి మొదలైంది.



5th Telugu Reader _unit3.indd 48 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com





యువ సింహం లేచి నిలబడింది, "నన్ను నా బంగారు శరీరాన్ని చూడండి, నేను అందగాన్ని మాత్రమే కాదు, శక్తిమంతున్ని కూడా! త్వరలోనే ఈ అడవికి కాబోయే రాజును. అందుచేత నేనే ఉత్తమ జంతువును" అంది.

తర్వాత నెమలి తన పురివిప్పుతూ వచ్చింది, "నన్ను చూడండి, నేను ఎంత సుందరంగా, సౌమ్యంగా ఉన్నానో అందుచేత నేనే ఎన్నికవుతాను" అంది నెమలి.

పెద్దపులి కోపంగా అందరి వైపు చూసింది "మూర్ఖుల్లారా! ఎప్పుడూ నేనే మొదటి స్థానంలో ఉంటాను. నేను ఎంత గొప్పవాడినో మీకు తెలియదా? మీరు ఇచ్చే బహుమతిని, నాకు సేవకుడితో పంపి ఉండవలసింది" అంది.

నక్క లేచి నిలబడి గొంతు విప్పింది " నిజం చెప్పాలంటే పోటీ అవసరమే లేదు. నేను అందమైన వాడిని కాకపోవచ్చు. కాని చాలా తెలివైనవాడిని, చురుకైనవాడిని" అంది.





5th Telugu Reader _unit3.indd 49 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



"నా నవ్వు వినండి!" అంటూ హైనా గర్వంగా తన చాతిని విరుచుకుంది. తెరలు తెరలుగా నవ్వసాగింది. న్యాయమూర్తి నక్క చెవులు మూసుకుని ఉంది. అప్పుడు రామచిలుక లేచి నిలబడింది.

"ఓ సుందరీ ....." న్యాయమూర్తి నక్క ఇంకా ఏమీ వినే స్థితిలో లేదు. "నీకు సొంతంగా ఏమి రాదా! ఎవరో వల్లించిన మాటలను మళ్లీమళ్లీ చెబుతావేం?" అని అరచింది. రామచిలుక మరేం అనలేక కూర్చుంది.

చివరగా ఉడుత లేచి నిలబడింది "మెరిసే నా ఒంటి రంగు అందమైన పళ్ళు చూడండి. ఏదేమైనా నేనే ఉత్తమమైనదాన్ని అనుకోండి" పోటీ కార్యక్రమం ముగిసింది. న్యాయమూర్తి సింహం లేచి నిలబడింది.

"మిత్రులారా! న్యాయమూర్తుల బృందం ఆశ్చర్యం కలిగించే నిర్ణయం తీసుకుంది. ఈ పోటీలో పాల్గొనకపోయినా ఉత్తమ బహుమతికి తగిన ఒకరిని ఎంపిక చేసింది. మర్యాదకు మారుపేరైన ఆ జంతువు ఈ పోటీలో పాల్గొనలేదు. తన ఆహారం కోసం ఇతరులెవరినీ చంపే లక్షణం అతనిలో లేదు. అంతే కాదు శాకాహారి కూడా. అన్నిటినీ మించి గొప్ప జ్ఞాపకశక్తి అతని సొంతం. ఎవరి పట్లా ద్వేషం లేని వాడు. అలాంటి గజరాజును ముందుకు వచ్చి ఈ ఉత్తమ జంతువు బహుమతిని అందుకోవలసినదిగా కోరుతున్నాం" అని ప్రకటించింది సింహం.

ఏనుగు ఈ మాటలు విని చాలా భయపడింది. గుంపు వెనుక నక్కి నిలుచుంది. మిగతా జంతు మిత్రులు ముందుకు వెళ్లమని తోశాయి. ఏనుగు అయిష్టంగానే సిగ్గుపడుతూ ముందుకు వచ్చింది. "ఉత్తమ జంతువు" బహుమతిని గెలుచుకున్న ఏనుగును జంతువులన్నీ అభినందించాయి.



5th Telugu Reader _unit3.indd 50 02-07-2019 20:55:45
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విభాగం 4

# 4.1 పంట సిరి



తొలకరి జల్లు కురవగానే రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడతారు. అందరికీ అన్నం పెట్టే రైతు, వ్యవసాయ పనులు ఎలా మొదలు పెట్టారో ఈ పాట పాడుకుని తెలుసుకుందాం.

తొలి జల్లు వచ్చింది

తొలకరించింది

పదవోయి రైతన్న

పాటు చేయంగ



5th Telugu Reader _unit4.indd 51 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



హలమె మన సౌభాగ్య
బలమనుచు చాటి
పొలము దున్నాలోయి
పొలికేక బెట్టి

కదలరా! వడివడిగ
పదును చెడకుండ
అదునులో విత్తనము
వెదజల్ల వలెను

అడవులను, బంజర్ల
ననువుగా జేసి
సహకార సేద్యమును
సాగించుమన్న



5th Telugu Reader _unit4.indd 52 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



తరుణమందున పనులు

తెరువెరిగి చేయ

ఏపుగా పైరెదిగి

కాపు బడునన్న

విదిలించరా నిదుర

కదిలించరా శక్తి

పసచెడును నీవిపుడు

ప్రాల్మాలియున్న

తొలికారు మలికారు

పొలిగల్గిరాల

ఇనుప గజ్జెల తల్లి

వెను దిరుగు నన్న



5th Telugu Reader _unit4.indd 53 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

బలము నీవే జాతి

కలిమి నీవేరా!

పాతరల బంగారు

పంట నింపుమురా!

(రావెళ్ల వేంకట రామారావు – "చైతన్య స్రవంతి".)

## సారాంశం

రైతులారా! తొలకరి జల్లు కురిసింది పొలం వైపుకు పదండి. శ్రమించి పాటుపడదాం 'నాగలిని ఆయుధంగా, అదృష్టంగా మనకున్న శక్తిగా భావిస్తూ పొలం దున్నడానికి పోదాం రండి. ఆలస్యం చేయక అదును చూసి విత్తనాల్ని వెదచల్లడానికి వేగంగా బయలుదేరుదాం. అడవులను, బీటలువారిన నేలను కలిసికట్టుగా చదునుచేసి సామూహిక వ్యవసాయం చేద్దాం. సకాలంలో చేయాల్సిన పొలం పనులను చేస్తే పైరు ఏపుగా పెరిగి రైతు పెరుగుతాడు. నిద్రమత్తును వదిలి నీలో ఉన్న శక్తిని ఇప్పుడు వినియోగించకపోతే అది నిర్వీర్యమై నిష్ప్రయోజనమవుతుంది. మూడుకారులు పంటపండితే దరిద్ర దేవత వెనుతిరిగి పోతుంది. దేశానికి బలం నువ్వే .....! దేశ సంపద నువ్వే. కాబట్టి ఓ రైతన్నా ..... బంగారం వంటి పంటలను పండించి దేశ ధాన్యాగారాన్ని నింపవయ్యా!

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. వడివడిగా = వేగంగా
2. కలిమి = సంపద
3. హలం = నాగలి
4. సేద్యం = కృషి

### II ప్రకృతి – వికృతి

1. బంగారం – బ్రుంగారం
2. శక్తి – సత్తి
3. అడవి – అటవి
4. నిద్ర – నిదుర



5th Telugu Reader _unit4.indd 54 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## III వ్యతిరేక పదాలు

1. తొలి × మలి

2. బలం × బలహీనం

3. కలిమి × లేమి

## IV జతపరచండి

1. తొలిజల్లు - వెదజల్లు

2. హలం - పంట

3. విత్తనం - నాగలి

4. బంగారు - తొలకరించింది

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం

1. హలమే మన ________________బలం.



2. అదనులో ____________ వెదజల్ల వలెను.

3. పాతరల ____________పంట నింపుము.

(సౌభాగ్య, విత్తనం, బంగారు)

## VI విడదీసి రాయండి

1. రైతన్న -

2. పైరెదిగి -

3. తెరువెరిగి -

## VII ప్రశ్నలు

1. రైతుకు సౌభాగ్యమేది?

2. రైతులు ఏ సమయంలో విత్తనాలు చల్లుతారు?

3. ప్రాల్మాలితే ఎవరి పని చెడును? ఎందుకు చెడును?



5th Telugu Reader _unit4.indd 55 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## VIII భాషను గురించి తెలుసుకుందాం



క్రింది వాక్యాల్లోని విభక్తులను గుర్తించి రాయండి.

1. వేరు పురుగు వేరును తొలుస్తుంది.
2. ఆకలి సమయంలో తినే ఆహారమేదైనా అమృతంతో సమానం.
3. మంచి వారితో స్నేహం చేయడం వల్ల మన విలువ పెరుగుతుంది.
4. మురికివాడల్లోని సమస్యల గురించి తెలుసుకోండి.
5. ఆటలు ఆరోగ్యానికి మంచివి.
6. గ్రామాలందు నీటి సౌకర్యాన్ని అభివృద్ధి పరచాలి.
7. రాధా దేవుని కొరకు పూలు తెచ్చింది.
8. ఒరేయ్! చెట్టును నరకద్దురా! పాపం వస్తుంది.

ఆ) కింది పట్టిక ఆధారంగా వాక్యాలు రాయండి వాటిలోని విభక్తులను గుర్తించి గీత గీయండి.

| | | |
|---|---|---|
| లక్ష్మి దసరా | కు | వెళ్ళింది. |
| రాణి బాగా చదవడం | కంటె | పెద్దది |
| కృష్ణ సంచి | తో | కలిసి తిన్నాడు |
| శివ అక్క | గురించి | చెప్పాడు |
| సునీత మాధవి | వలన | మంచి మార్కులు వచ్చాయి |
| మన జెండా | నందు | పుస్తకాలున్నాయి |
| రాజు కూరగాయల | లో | మూడు రంగులు ఉన్నాయి |

## IX విద్యార్థులకు సూచన

1. రైతు గొప్పతనాన్ని గురించి, కష్టపడే విధానాన్ని గురించి విద్యార్థులు తెలుసుకోవాలి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. రైతు పొలంలో ఏమేమి పండిస్తాడో విపులంగా విద్యార్థులకు చిత్రపటాల ద్వారా తెలియజేయండి.



5th Telugu Reader _unit4.indd 56 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com


www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## ప్రణాళికా పని

1. రైతుకు సంబంధించిన గేయాలు సేకరించండి. తరగతి గదిలో చదివి వినిపించండి.



2. కింది బొమ్మలకు రంగులు వేయండి.



3. బొమ్మలను గురించి రాయండి.

www.Padasalai.Net



5th Telugu Reader _unit4.indd 57 02-07-2019 20:56:39
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 4

# 4.2 సెల్ ఫోన్ (చరవాణి)

(సంభాషణ)



నవంబర్ 14వ తేదీన బాలల దినోత్సవం సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు సెల్‌ఫోన్ (మొబైల్) వాడకం వల్ల 'లాభాలు – నష్టాలు' అన్న అంశంపై చర్చను ఏర్పాటు చేశారు. న్యాయనిర్ణేతగా ప్రధానోపాధ్యాయులు మధ్యలో కూర్చున్నారు. చర్చలో పాల్గొనడానికి వచ్చిన రెండు జట్లు న్యాయనిర్ణేతకు రెండు వైపులా కూర్చున్నారు.

న్యాయనిర్ణేత: అందరికీ నమస్కారాలు ఈరోజు సెల్‌ఫోన్ మన జీవితంలో ఒక భాగమైపోయింది. సెల్‌ఫోన్ నిత్యావసరాల్లో ఒకటిగా ప్రాధాన్యతను సంతరించుకుంది. మరి సెల్‌ఫోన్ వలన లాభాలు ఎక్కువగా ఉన్నాయా, నష్టాలు ఎక్కువగా ఉన్నాయా అని తెలుసుకోవడానికి ఈ చర్చా వేదికను ఏర్పాటు చేశాం. ఇందులో సెల్‌ఫోన్ వలన లాభాలే ఎక్కువ ఉన్నాయని వాదించడానికి మొదటి జట్టులో లత, మీనా, గోపి వచ్చారు. సెల్‌ఫోన్ వలన నష్టాలు ఎక్కువగా ఉన్నాయని వాదించడానికి రెండవ జట్టులో అజిత్, ప్రకాష్, లావణ్య వచ్చారు. విద్యార్థులూ! మీరు ఈ రెండు జట్టుల వాదనలను శ్రద్ధగా వినండి. చివరికి ఎవరి అభిప్రాయం సరైనదో మీరే నిర్ణయించాలి. మరి చర్చను ప్రారంభిద్దామా! ముందుగా సెల్‌ఫోన్ వలన లాభాలే ఉన్నాయని వాదించడానికి లతను ఆహ్వానిస్తున్నాను.



5th Telugu Reader _unit4.indd 58 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

లత: అందరికీ నమస్కారం. నేను ఈరోజు సెల్‌ఫోన్ ఉపయోగాల గురించి మాట్లాడబోతున్నాను. సెల్‌ఫోన్లు లేని కాలంలో ఏదైనా విషయాన్ని చేరవేయాలంటే ఉత్తరాలు రాసేవాళ్ళం. దీనివల్ల ఎంతో సమయం వృథా అయ్యేది. కానీ ఇప్పుడు సెల్‌ఫోన్ వల్ల విషయాన్ని క్షణాల్లో ప్రపంచంలో ఏ మూలకైనా చేరవేయగలుగుతున్నాం. ఇంట్లో కూర్చునే సెలెఫోన్ ద్వారా చాలామటుకు పనులన్నింటినీ కూడా చక్కబెట్టుకుంటున్నారు. అందుకే సెల్‌ఫోన్ ప్రస్తుతం అందరికీ "కర్ణుడి కవచకుండలం"లా అయిపోయింది.

న్యాయనిర్ణేత: "సెల్‌ఫోన్ వల్ల నష్టమే" అనే అంశంపై మాట్లాడేందుకు రెండవ జట్టులోని అజిత్‌ని ఆహ్వానిస్తున్నా .... !

అజిత్: అందరికీ నమస్కారాలు. లత చెప్పిన విషయంతో నేను ఏకీభవించను. సెల్‌ఫోన్ వాడకం ఎక్కువ కావడం వల్ల కుటుంబ సభ్యులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం తగ్గిపోతుంది. ఒకే ఇంట్లో కలిసి ఉన్నా మనుషుల మధ్య దూరం పెరిగిపోతుంది. గంటల కొద్దీ సమయాన్ని సెల్‌ఫోన్‌తోనే గడుపుతున్నారు. దీంతో మనుషుల మధ్య సంబంధాలు బలహీనపడుతున్నాయి, దూరం పెరిగిపోతుంది అన్నది నా అభిప్రాయం.

మీనా: సెలెఫోన్ మనుషుల మధ్య దూరాన్ని పెంచిందంటే నేను అంగీకరించను. సెల్‌ఫోన్లు అతి సామాన్య ప్రజలకు కూడా అందుబాటులోకి వచ్చాయి. మారుమూల ప్రాంతంలో ఉన్న వారితో కూడా మాట్లాడుకొనే వీలును కల్గించాయి. అంతేకాకుండా దూరప్రాంతాల్లో చదివే పిల్లల క్షేమ సమాచారాన్ని తెలుసుకోవడానికి సెలెఫోన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి. పిల్లలు తల్లిదండ్రుల మీద బెంగ లేకుండా చదువు మీద శ్రద్ధ చూపడానికి వీలవుతుంది.

ప్రకాష్: అందరికీ నమస్కారం. ప్రాచీన కాలంలో గురువుల ఆశ్రమాల్లో విద్య నేర్చుకునేవారు. అప్పుడు సెల్‌ఫోన్‌లు ఉండేవి కావు. అప్పట్లో సెల్‌ఫోన్ లేకపోయినా మనుషులు చాలాకాలం తర్వాత కలుసుకున్నప్పుడు వారిమధ్య అభిమానం, ఆప్యాయతలు ఉండేవి. మనుషులు దూరంగా ఉన్నా మనసులు దగ్గరగా ఉండేవి. సెలెఫోన్ వాడకం ఎక్కువై బంధువులు, స్నేహితుల ఇళ్ళకు రాకపోకలు కూడా తక్కువయినాయి. అంతే కాదు ఇంట్లో పెద్దలతో పాటు పిల్లలు కూడా సెలెఫోన్‌కు ఆకర్షితులవుతున్నారు. పిల్లలు సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటం, పాటలు వినడం వల్ల తమ చదువులపై శ్రద్ధ చూపలేకపోతున్నారు. సెల్‌ఫోన్ అలవాటై ఇతర విషయాల మీద వారు ఆసక్తి చూపడం లేదు. పిల్లలు ఎదిగే వయస్సులో వారికి ఆటలు, వ్యాయామం ఎంతో అవసరం. కానీ సెల్‌ఫోనుకు బానిసలై సహజంగా ఆడుకునే ఆటలకు దూరమవుతున్నారు. దీని వలన శారీరక, మానసిక అభివృద్ధి కూడా కుంటుపడుతోందని నేను గట్టిగా నమ్ముతున్నాను.

గోపి: విరామ సమయాల్లో పిల్లలు సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడటం వలన వారి సమయాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. దీని వలన పిల్లల్లో ఏకాగ్రత పెరుగుతుంది. కానీ సెల్‌ఫోన్ ఒక



5th Telugu Reader _unit4.indd 59 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

వ్యసనంగా మారకూడదు. నేడు అభివృద్ధి చెందుతున్న ఆధునిక విజ్ఞానాన్ని పిల్లలు సెల్‌ఫోన్ ద్వారా సులభంగా తెలుసుకుంటున్నారు. పరీక్షా ఫలితాలు కూడా వెంటనే తెలుసుకోవడానికి వీలవుతుంది. సెల్‌ఫోన్లో టీవీ చూడొచ్చు. ఇంట్లో కూర్చోనే సెల్‌ఫోన్ ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ కూడా చేసుకోవచ్చు. ఒకటేమిటి సెల్‌ఫోన్ ద్వారా ఎన్నో ప్రయోజనాలను పొందవచ్చు.

లావణ్య: ఎంతమంది సెల్‌ఫోన్‌ను సరిగ్గా వినియోగించుకుంటున్నారు అన్నదే నా ప్రశ్న. సెల్‌ఫోన్ వల్ల చదువుకునే పిల్లలు చెడు స్నేహాలు, చెడు అలవాట్లకు బానిసయ్యే అవకాశం ఉంది. అంతేకాదు సెల్‌ఫోన్ ఎక్కువగా వాడడం వల్ల చెవిపోటు, చెవుడు, నరాల దౌర్బల్యం, కంటిచూపు మందగించడం, మెదడుకు సంబంధించిన క్యాన్సర్, మెడనొప్పి, తలనొప్పి, నిద్రలేమి వంటి చాలా రకాల వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇంకా ముఖ్యమైన విషయం ఏమిటంటే సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి, ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. యువత బాధ్యతాయుతంగా పెరగాల్సిన దశలో సెల్‌ఫోన్‌కి బానిసలై విలువైన సమయాన్ని వృథా చేస్తూ తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు.

న్యాయనిర్ణేత : సెల్‌ఫోన్ లాభనష్టాలను గురించి రెండు జట్లు తమ తమ అభిప్రాయాలను చక్కగా చెప్పారు. ఏ వస్తువైనా దానిని ఉపయోగించుకునే విధానాన్ని బట్టి దాని ఫలితం ఉంటుంది. కాబట్టి సెల్‌ఫోన్ అతిగా వాడకూడదు. అవసరానికి మాత్రం వినియోగించుకోవాలి. అప్పుడే దాని విలువ రెట్టింపు అవుతుంది. మరి పిల్లలూ! మీరు విన్నారు కదా! మీ అభిప్రాయాలను ఒక కాగితం పై రాసి నాకు చూపించండి.

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. చర్చ = ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడడం
2. వృథా = వ్యర్థం
3. ఏకాగ్రత = ఒకే విషయంపై మనసు నిలపడం
4. దౌర్బల్యం = బలహీనత
5. అధ్యాపకుడు = ఉపాధ్యాయుడు

### II ప్రకృతి – వికృతి

1. విజ్ఞానం – విన్నాణం
2. దూరం – దవ్వు



5th Telugu Reader _unit4.indd 60 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. ప్రాంతం - పొంత

4. మనిషి - మనిసి

## III వ్యతిరేకపదాలు

1. లాభం × నష్టం
2. ఆసక్తి × అనాశక్తి
3. ప్రాచీనం × ఆధునికం
4. శ్రద్ధ × అశ్రద్ధ
5. అవసరం × అనవసరం

## IV జతపరచండి

1. సెల్‌ఫోన్ - బలహీనమయ్యాయి
2. మాట్లాడుకోవడం - మారకూడదు
3. సంబంధాలు - చరవాణి
4. చదువు - తగ్గిపోతుంది
5. వ్యసనంగా - శ్రద్ధ



## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం

పాఠం చదవండి. పాఠం ఆధారంగా పట్టికను పూరించండి.

| కారణం | ఫలితం |
|---|---|
| 1. సెల్‌ఫోన్ వలన విషయాలు | |
| 2. సెల్‌ఫోన్ ప్రస్తుతం అందరికీ | |
| 3. మారుమూల ప్రాంతం | |
| 4. సెల్‌ఫోన్‌కు బానిసలై | |
| 5. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపితే | |



5th Telugu Reader _unit4.indd 61 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## VI కలిపి రాయండి

1. నిత్య + అవసరాలు
2. పనులు + అన్నింటిని
3. బానిసలు + ఐ
4. ముఖ్యము + ఐన
5. దిన + ఉత్సవం

## VII ప్రశ్నలు

1. సెల్‌ఫోన్‌లేని కాలంలో విషయాన్ని ఎలా తెలియజేసేవారు?
2. సెల్‌ఫోన్ గురించి అజిత్ చెప్పిన అభిప్రాయాలేంటి?
3. దూరప్రాంతాల్లో చదువుకునే పిల్లలకు సెల్‌ఫోన్ ఎలా ఉపయోగకరంగా ఉంటుంది?
4. ఎందువల్ల పిల్లలు ఆటలకు దూరం అవుతున్నారు?
5. సెల్‌ఫోన్ వినియోగం ఎక్కువైతే కలిగే రోగాలను వివరించండి

## VIII భాషను గురించి తెలుసుకుందాం.

### వాక్యాలు – రకాలు



అ) కింది వాక్యాలను గమనించండి. చదవండి.

1. వ్యాసుడు కాశీ నగరానికి వచ్చాడు.
2. వ్యాసుడు కాశీలో తపస్సు చేశాడు.

పై వాక్యాలను గమనించండి. కొన్ని అక్షరాలతో ఒక పదం ఏర్పడుతుంది. కొన్ని పదాలు కలిస్తే వాక్యం ఏర్పడుతుంది. వాక్యాలు మూడు రకాలు. అవి :

1. సామాన్య వాక్యం : వాక్యం ఒక సమాపక క్రియతో పూర్తవుతుంది. దీనిని సామాన్య వాక్యం అంటారు.

   ఉదా॥ వ్యాసుడు కాశీ నగరానికి వచ్చాడు.

2. సంశ్లిష్ట వాక్యం : ఇందులో ఒకటి లేక అంతకన్నా ఎక్కువ అసమాపక క్రియలు ఒక సమాపక క్రియ ఉంటాయి. దీనిని సంశ్లిష్ట వాక్యం అంటారు.

   ఉదా॥ వ్యాసుడు కాశీ నగరానికి వచ్చి, తపస్సు చేసి శివుని దర్శనాన్ని పొందాడు.



5th Telugu Reader _unit4.indd 62 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. మహావాక్యం : సమాన ప్రాధాన్యం గల రెండు సామాన్య వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడుతుంది. దీనినే "సంయుక్త వాక్యం" అంటారు.

ఉదా॥ వ్యాసుడు కాశీ నగరానికి వచ్చాడు, తపస్సు చేశాడు.

ఆ) కింది సంశ్లిష్ట వాక్యాలను సామాన్య వాక్యాలుగా రాయండి

1. మాధవ్ మైదానానికి వెళ్ళి, ఖో,ఖో ఆట ఆడాడు.

______________________

______________________

2. ప్రకాష్ బడికి వచ్చి, తరగతిగదిలో కూర్చున్నాడు.

______________________

______________________

3. తాతయ్య రాగి జావ తాగి, దినపత్రిక చదివాడు.

______________________

______________________

4. నిఖిల్ కథల పుస్తకం చదివి, కథను చెల్లెలికి చెప్పాడు.

______________________

______________________

5. పిల్లలు బొమ్మలు గీసి, రంగులు వేశారు.

______________________

______________________

www.Padasalai.Net

## IX విద్యార్థులకు సూచన

1. సెల్‌ఫోన్ ఎక్కువ వినియోగించకుండా కొంత సమయం స్నేహితులతో ఆడుకోవాలి. పుస్తకాలు చదవాలి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. సెల్‌ఫోన్ అతిగా వాడటం వలన జరిగే అనర్థాలను వాటిని వివరించే చిత్రాలను సేకరించి ఆల్బమ్ తయారుచేయండి.



5th Telugu Reader _unit4.indd 63 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## ప్రణాళికా పని

1. కింది పేరా చదవండి ఖాళీలలో పదాలను ఊహించి రాయండి.



నవ్వు మనిషి ఆరోగ్యానికి వరంలాంటిది. నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక -------- అన్నారు. అందుకే -------- తూ బతకాలిరా తమ్ముడూ అన్నాడో కవి. అంటే పెద్దగా -------- కాదు. వెకిలిగా -------- అంతకన్నా కాదు. నవ్వులో అనేక రకాలు ఉన్నాయి. చిరుహాసం, మందహాసం, -------- దరహాసం ఇలా ఎన్నో -------- ఉన్నాయి. సందర్భోచితంగా -------- వల్ల ప్రమాదం రాదు. అపార్థం చేసుకోరు. నవ్వు నాలుగు విధాలుగా -------- అనే సామెత కూడా ఉంది. ఒక్కోక్కప్పుడు ఈ -------- అనేక అనర్థాలకు దారితీస్తాయి. కాబట్టి వెకిలి -------- ఎగతాళి నవ్వులు పనికిరావు. ఎల్లప్పుడూ చిరు -------- చిందిస్తూ ఎదుటివారి మనస్సు నొప్పించకుండా -------- కాలం గడపాలి.



5th Telugu Reader _unit4.indd 64 02-07-2019 20:56:40
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

చదువు – ఆనందించు

విభాగం 4

# 4.3 మనసుంటే మార్గం ఉంటుంది



అన్నీ అవయవాలు సరిగ్గా ఉన్నవారు కూడా చేయలేని పనులు ఎన్నో ఉన్నాయి. మరి చేతులు లేని వారు ఏం చేయగలరు? అని అనుకుంటాం. కానీ చేతుల్లేకున్నా పట్టుదలతో తాను అనుకున్నది సాధించిందామె. మనసుంటే మార్గం ఉంటుంది. ఆమె పట్టుదల ఆత్మవిశ్వాసం ముందు ఆ దేవుడైనా తలవంచాల్సిందే. ఇంతకూ ఎవరామె? ఏం చేసింది? పాఠం చదివి తెలుసుకోండి.



5th Telugu Reader _unit4.indd 65 02-07-2019 20:56:41
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

తిరువళ్ళూరు,

29–5–2019.

ప్రియమైన లక్ష్మీ!

ఎలా ఉన్నావు? ఇక్కడ మేమంతా క్షేమం. నీకు గుర్తుందా! మేము తమిళనాడు రాక ముందు గుజరాత్‌లోని సూరత్‌లో ఉండేవాళ్ళం. మొన్న దసరా సెలవులకు మా ఊరు వెళ్ళాం అదే. రాజ్‌కోట్ గ్రామానికి, అక్కడ మా నాన్నమ్మ ఉంది సాయంత్రం అయ్యేసరికి స్నేహితులం అందరం కలిశాం కాలనీలోని పిల్లలం అంతా మట్టిలో గీతలు గీసి కుంటుడు ఆటలు, కొబ్బరాకులతో పీకలు చేసి పీపీ...... ఊదడాలు, పరిగెడుతూ నేలబండ, దాగుడుమూతలు ఇలా రకరకాల ఆటలు ఆడాం. జ్యోత్స్న కూడా మాతో కలిసి ఆడేది. మేము పాటలు పాడితే మాతో కలిసి పాడేది. తాడాట, బంతాట వంటి ఆటలు ఆడేటప్పుడు మాత్రం ఒక పక్కగా కూర్చునేది. నీకు జ్యోత్స్న గురించి చెప్పలేదు కదా! మా స్నేహితురాలు. జ్యోత్స్న మనందరిలా కాదు. చాలా ప్రత్యేకమైన నేస్తం. ఎందుకో తెలుసా? తనకు చేతులు లేవు. ఐతేనేం! కాళ్ళు మాత్రం బాగా పనిచేస్తాయి. జ్యోత్స్నకు చాలా పట్టుదల. “నేనెందుకు అందరిలా చేయలేక పోతున్నాను? అని అనుకొనేది, కానీ ఎక్కడా వెనుకడుగు వేసేది కాదు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే మనం చేతులతో చేసే పనులన్నీ జ్యోత్స్న కాళ్ళతో చేయడం నేర్చుకుంది. నువ్వు జ్యోత్స్నను చూస్తే ఆశ్చర్యపోతావు. జ్యోత్స్న బియ్యంలో రాళ్ళు ఏరడం, ఇతరులకు తలదువ్వడం, కూరగాయలు తరగడం, బట్టలు ఉతకడం, పలక మీద రాయడం వంటి పనులన్నీ కాళ్ళతోనే చేస్తుంది. జ్యోత్స్న ఇలా పదో తరగతి వరకు చదివింది. జ్యోత్స్నలో ఉన్న పట్టుదల నాకు నచ్చింది. ఏది చేయాలనుకుంటే అది నేర్చుకునేవరకు విడిచి పెట్టదు.

జ్యోత్స్న ఇంట్లో వాళ్ళ అమ్మ, అక్క రకరకాల కుట్లు, అల్లికలూ చేసేవారు. వాళ్ళు చేస్తున్న పనులను జ్యోత్స్న ఎంతో శ్రద్ధగా గమనించేది. ఎప్పుడు నేర్చుకుందో తెలియదు గాని జ్యోత్స్న కూడా సూది పట్టుకుంది. అందంగా బట్టలపై డిజైన్లు కుట్టేది. బట్టల మీద అందంగా ఎంబ్రాయిడరీ చేయడం అంత తేలిక పని కాదు. కానీ మనసుంటే మార్గం ఉంటుంది కదా! ఆమె పట్టుదల, ఆత్మవిశ్వాసం చాలా గొప్పది.

చాలా తక్కువ కాలంలోనే జ్యోత్స్న ఊళ్ళోనే గొప్ప ఎంబ్రాయిడరీ కళాకారిణి అయింది. ఏ ఏ దుస్తులకు ఎటువంటి దారాలు, పూసలు వాడాలో ఆమెకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. ఆమె తయారు చేసినవన్నీ ప్రదర్శనలో పెట్టారు. మా ఊళ్ళోనేగాక లక్నో, బెంగాల్లో కూడా ఆమె కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ చేసిన బట్టలు అమ్ముడయ్యేవి. వాటికి మంచి గిరాకీ ఉండేది. సంప్రదాయ డిజైన్లకు ఆధునికతను జతచేసే ఆమె పనితనాన్ని అందరూ మెచ్చుకొనేవాళ్లు. జ్యోత్స్న కాళ్ళకు అసలు అలసట ఉండదు. ఆమె కాళ్ళు ఆగవు. ఏదో ఒక పని చేస్తూనే ఉంటాయి. ఆమె ఎదుగుదలకు సహకరిస్తూనే ఉంటాయి.

నిజంగా జ్యోత్స్న వంటి మిత్రురాలు నాకు ఉండడం చాలా గర్వంగా అనిపిస్తుంది. నాకు అన్నీ బాగున్నా నేను జ్యోత్స్న వలె పేరు సంపాదించలేదు కదా! ఈసారి ఆమెను మన ఊరికి తీసుకొనివస్తాను. మీ కందరికీ పరిచయం చేస్తాను.



5th Telugu Reader _unit4.indd 66 02-07-2019 20:56:41
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

మనం ఆమెను చూసి ఎంతో నేర్చుకోవాలి. మన స్నేహితులందరినీ అడిగానని చెప్పు. మీ అమ్మ, నాన్నలకు నా నమస్కారాలు చెప్పు. తొందరలో కలుసుకుందాం.

ఇట్లు

మీ,

శాంతి.

చిరునామా

లక్ష్మి
తండ్రి పేరు: శ్రీనివాసు,
శివాలయం వీధి,
విల్లివాక్కం,
చెన్నై – 600049





5th Telugu Reader _unit4.indd 67 02-07-2019 20:56:41
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
5

# 5.1 మంజీర

– డా॥ వేముగంటి నరసింహాచార్యులు



నీ కంకణక్వణము
వినదించి నంతనే
కర్షకుని నాగేలు
కదలి ముందుకు సాగు
నీచేతి చలువ చిం
దిలిపాటు గనినంత
పైరుపచ్చలు కనుల
పండువుగ విలసిల్లు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!



5th Telugu Reader _unit5.indd 68 02-07-2019 20:58:29
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

గిడసబారిన పుడమి
ఎడద కరిగించెదవు
చేద్దైన నేలలో
చెరుకు పండించెదవు
చేవగలిగిన మట్టి
జీవకణములు తెచ్చి
పొలముకు ఎరువుగా
బలము చేకూర్చెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!

ఆనాడు కుతుబు సు
ల్తాను నిలిపిన పురము
భాగ్యనగరములోన
వసియించు పౌరులకు
పంచదారను బోలు
మంచి నీరొసగెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!

పల్లెటూళ్ళను కూర్మి
తల్లి వలె లాలించి
స్నానపానాదులను
సమకూర్చెదవు నీవు
పట్టణమ్ములను తో
బుట్టువలె ప్రేమించి
ధాన్యరాసుల నంపి
తరచు పోషించెదవు
ఎంత చల్లని దానవే! నీవు మంజీర!
ఎంత తీయని దానవే!





5th Telugu Reader _unit5.indd 69 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## సారాంశం

అమ్మా! మంజీర! ఎంత చల్లని దానవు నువ్వు. ఎంత తీయని దానవు నువ్వు. నీ నీటి ప్రవాహపు సవ్వడి, ( నీ చేతి గాజుల గలగలల శబ్దం) వింటే చాలు రైతన్న నాగలి ముందుకు సాగుతుంది. నీ మంచితనం చూసిన వెంటనే రెప్పపాటులో పచ్చనిపైర్లు కన్నుల పండుగగా ప్రకాశిస్తాయి.

తల్లీ! మంజీర! చిన్నబోయిన నేలతల్లి హృదయాన్ని కరిగిస్తావు. చేదైన నేలలో తీయని చెరకును పండిస్తావు. సారవంతమైన మట్టిని తీసుకుని వచ్చి పొలాలకు ఎరువుగా అందించి బలాన్నిస్తావు.

అమ్మా! మంజీర! కులీకుతుబ్‌షా నిర్మించిన భాగ్యనగర (హైదరాబాద్) వాసులకు చక్కెర వంటి తీయని తాగునీటిని అందిస్తావు.

తల్లీ! మంజీర! పల్లెలను అమ్మలాగ, ప్రేమగా లాలించి స్నానం, తాగునీరు వంటి అవసరాలను తీరుస్తావు. నగరాలను తోడబుట్టినవాళ్ళుగ ప్రేమించి పల్లెల్లో పండిన ధాన్యాన్ని పంపి ఎల్లప్పుడు పోషిస్తావు. అమ్మా! మంజీర! నువ్వు ఎంత చల్లని దానవు, ఎంత తీయని దానవు.

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. కూర్మి = స్నేహం
2. పుడమి = భూమి
3. కర్షకుడు = రైతు
4. విలసిల్లు = ప్రకాశించు
5. చేవ = సారం

### II. ప్రకృతి - వికృతి

1. పురం - ప్రోలు
2. భాగ్యం - బాగ్గెం
3. పట్టణం - పట్నం



5th Telugu Reader _unit5.indd 70 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## III. వ్యతిరేక పదాలు

1. మంచి × చెడు
2. చేదు × తీపి
3. పుడమి × ఆకాశం

## IV. జతపరచండి

1. కర్షకుడు – చెరకు
2. చేదైన నేల – పొలమునకు ఎరువు
3. జీవకణములు – భాగ్యనగరం
4. కుతుబు సుల్తాన్ – నీవు మంజీర
5. చల్లని దానవే – నాగలి

## V. చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1. పైరుపచ్చలు ---------- ప్రకాశిస్తాయి.
2. చేదైన నేలలో ---------- పండిస్తావు.
3. కులీకుతుబ్‌షా నిర్మించిన పురం ----------
4. పల్లెటూళ్ళను ---------- వలె లాలిస్తావు.
5. ---------- నంపి తరచు పోషిస్తావు.

## VI. విడదీసి రాయండి

1. నీరొసగెదవు –
2. తోబుట్టువు –
3. వినదించినంతనే –
4. చేదైన –



5th Telugu Reader _unit5.indd 71 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## VII. ప్రశ్నలు

1. "నది పొలానికి బలం చేకూరుస్తుంది" అని కవి ఎందుకన్నాడు?
2. భాగ్యనగరానికి మంజీర నదికి ఉన్న సంబంధాన్ని తెల్పండి.
3. మనం నదులను ఎలా కాపాడుకోవాలి?
4. నదులు ఏ విధంగా పల్లెటూళ్ళను, పట్టణాలను కాపాడుతాయి?

## VIII. భాషను గురించి తెలుసుకుందాం



**కింది సామాన్య వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా రాయండి.**

**ఉదా॥** యాదయ్య పువ్వులు తెచ్చాడు. యాదయ్య పూలగుత్తులు తయారుచేశాడు.

**జ॥** యాదయ్య పువ్వులు తెచ్చి, పూలగుత్తులు తయారుచేశాడు.

1. శృతి పాటలు పాడింది. శృతి బహుమతులు గెల్చుకున్నది.
   ------------------------------------
2. భాస్కర్ సంచి తీసుకున్నాడు. భాస్కర్ రైతు బజారుకు వెళ్ళాడు.
   ------------------------------------
3. రజని బట్టల దుకాణానికి వెళ్ళింది. రజని పాప కోసం బట్టలు కొన్నది.
   ------------------------------------
4. గిరీష్ రైల్వేస్టేషన్‌కు వెళ్ళాడు. గిరీష్ రైలు ఎక్కాడు.
   ------------------------------------
5. కుందేలు క్యారెట్ తిన్నది. కుందేలు పొదలోకి వెళ్ళింది.
   ------------------------------------
6. అమ్మ లడ్డూ చేసింది పిల్లలకు ఇచ్చింది. ఆమె కూడా తిన్నది.
   ------------------------------------

## IX. విద్యార్థులకు సూచన

1. పాడిపంటలకు, సిరిసంపదలకు నదులే మూలం అన్న విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలి.



5th Telugu Reader _unit5.indd 72 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## X. ఉపాధ్యాయులకు సూచన

1. నదుల ప్రాముఖ్యతను, దాని ఉపయోగాన్ని, వాటిని ఎలా కాపాడుకోవాలనే విధానాన్ని విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి.

### ప్రణాళికా పని



తమిళనాడు రాష్ట్రంలో ప్రవహించే నదులు, వాటిపై నిర్మించిన ఆనకట్టలు, ఆ నదుల తీరాలలో ఉన్న పుణ్యక్షేత్రాలు, దర్శనీయ స్థలాలను తెలియజేసే పట్టికను తయారుచేయండి. నివేదిక రాసి ప్రదర్శించండి

| క్ర.సం. | నది పేరు | ఆనకట్ట | పుణ్యక్షేత్రం | దర్శనీయ స్థలం |
|---|---|---|---|---|
| 1. | | | | |
| 2. | | | | |
| 3. | | | | |
| 4. | | | | |
| 5. | | | | |
| 6. | | | | |
| 7. | | | | |
| 8 | | | | |
| 9 | | | | |
| 10 | | | | |



5th Telugu Reader _unit5.indd 73 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విభాగం 5

# 5.2 ప్రభు భక్తి



విజయనగర సామ్రాజ్య శిల్పి శిల్పాచార్యుడు ధనాశకులోనై కోట రహస్యాలను శత్రువులకు చేరవేయబోగా, దేశద్రోహానికి పాల్పడుతున్నందుకు భర్త అని కూడా తలంచక అతనిని అంతమొందించిన ఆదర్శపత్ని వృత్తాంతం ఈ నాటిక భాగం.

(తెర తీయబడింది)

బొమ్మ

నేపథ్యం : విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు తన ఏకాంత మందిరంలో దీర్ఘాలోచనలో ఉన్నారు. ఇంతలో మహామంత్రి తిమ్మరుసు అక్కడికి వచ్చారు.

**తిమ్మరుసు** : ప్రభువులకు అభివాదం!

**శ్రీకృష్ణ దేవరాయలు** : అభివాదం అప్పాజీ (మళ్ళీ ఆలోచనలో పడ్డాడు)

**తిమ్మరుసు** : ప్రభువులు ఏదో దీర్ఘాలోచనలో ఉన్నట్లున్నారు?

**శ్రీకృష్ణదేవరాయలు** : (తిమ్మరుసు వైపు తిరిగి) అవును అప్పాజీ! మన కోట శత్రుదుర్భేద్యమైనదని,



5th Telugu Reader _unit5.indd 74 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

విజయనగరం వైపు కన్నెత్తి చూడడానికి కూడా శత్రువులు సాహసించలేదు. కానీ ఈ మధ్య మన కోట రహస్యాలు శత్రువులకు తెలుస్తున్నాయని నాకు అనుమానంగా ఉంది.

**తిమ్మరుసు** : ఆ విషయమే మాట్లాడాలని వచ్చాను ప్రభు. బహమనీ సుల్తానులు మన పై దండెత్తి రావాలనే ఆలోచనలో ఉన్నట్లు వేగుల ద్వారా తెలిసింది.

**శ్రీకృష్ణదేవరాయలు** : అవునా అప్పాజీ! మరి మన కర్తవ్యం!

**తిమ్మరుసు** : అరివీర భయంకరులైన శత్రువులతో సైతం పోరాడి గెలవగల సమర్థులు మనవారు. అది కాదు మనం కలవరపడాల్సిన విషయం. మన కోట రహస్యాలు శత్రువులకు ఎలా తెలుస్తున్నాయన్నదే ప్రభూ.

**శ్రీకృష్ణదేవరాయలు** : నిజమేనా అప్పాజీ.....

**తిమ్మరుసు** : ప్రభూ! మన కోట రహస్యాలు మీకు, నాకూ, మన శిల్పి శిల్పాచార్యులకు తప్ప మరెవరికి తెలియవు. అందుకనే శిల్పాచార్యుని కదలికలపై నిఘా ఏర్పాటు చేశాను. ఈరోజు రాత్రికి మనం స్వయంగా అతనిని గమనిద్దాం.

**శ్రీకృష్ణ దేవరాయలు** : అలాగే అప్పాజీ

(తెరపడింది)

. ...... ....

(తెర లేచింది)

శిల్పాచార్యుని ఇల్లు .... మసక చీకటి .... తలుపులు తట్టిన శబ్దం ...

**వ్యక్తి** : (లో గొంతుతో) శిల్పాచార్య ! ... మారె శిల్పాచార్య...

**శిల్పాచార్య** : ఎవరూ .... ఇదిగో వస్తున్నా... (తలుపు తీసిన శబ్దం.)

**వ్యక్తి** : (మంద్ర స్వరంతో) హారే మిత్రమా! నేను ....... సుల్తాను దగ్గర్నుంచి వచ్చాం.

**శిల్పాచార్య** : ఓ.... నీవా! రా..... రా..... (తలుపు మూశాడు)

**వ్యక్తి** : సుల్తానుకు నీవు అందజేస్తానన్న మీ కోట రహస్యాలు ఇంకా అందలేదట అందుకే నన్ను పంపాడు. ఇదిగో నీకివ్వమని సుల్తాను ఈ రూకలు పంపాడు. (సంచి అందించాడు)



5th Telugu Reader _unit5.indd 75 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

**శిల్పాచార్యుడు** : (సంచి అందుకుని) వీలుపడక పంపలేదు. ఈ రోజు రాసి రేపు ఎలాగైనా పంపుతాను. ఎవరి కంటపడకుండా వెళ్ళిపో ...ఊ ... పో

...... (అతను వెళ్ళిపోయాడు - తలుపు మూసి - మూట దాచాడు శిల్పాచార్యుడు. చిన్న దీపం వెలిగించు కొని ఏవో పత్రాలు రాసి, ఒక పెట్టెలో దాస్తున్నాడు. ఇంతలో కీర్తిమతి అతని భార్య వచ్చింది.)

**కీర్తిమతి** : నాథా ఏమిటండి ఆ పత్రాలు? అంత భద్రంగా దాస్తున్నారు ......?

**శిల్పాచార్యుడు** : (తడబడుతూ) ఆ .... హహ..... అవా .... ఏమీ లేవు ..... అది సరేగానీ చాలా పొద్దుపోయింది, నువ్వెళ్ళి పడుకో .... వెళ్ళు .... వెళ్ళు .... (ఆమెను బలవంతంగా పంపించి, తాను మంచంపై నడుం వాల్చాడు)

(తెరపడింది)

- -- ---

(తెరదించి ఉంది)

(తెర ముందు నుంచి మారువేషాలలో ఉన్న రాయలు, తిమ్మరుసు మెల్లగా మాట్లాడుకుంటూ పోతున్నారు.)

**తిమ్మరుసు** : ప్రభూ! అదిగో అదే మన శిల్పాచార్యుని ఇల్లు, వెళ్ళి గమనిద్దాం రండి.

**శ్రీకృష్ణ దేవరాయలు** : పదండి అప్పాజీ (ఇద్దరూ నిష్క్రమించారు)

(తెర లేచింది)

(శిల్పాచార్యుని ఇల్లు. ఒక ప్రక్క మంచంపై శిల్పాచార్యుడు గాఢ నిద్రలో ఉన్నాడు ..... తిమ్మరుసు, రాయలు ఓ మూల తెరలోంచి తొంగి చూస్తున్నారు. మరొక పక్క పడుకుని ఉన్న కీర్తిమతి లేచి పక్కనే ఉన్న కొడుకును మెల్లగా నిద్రలేప సాగింది.)

**కీర్తిమతి** : (మెల్లగా) నాయనా..... ఒరేయ్ రంగాచార్య ...... లేవురా లే నాయనా లేవరా.......

**కొడుకు** : ఊ..... ఏమిటమ్మా ..... ?

**కీర్తిమతి** : అరవకురా.... లే...... లే (ఆవలిస్తూ లేచి కూర్చున్నాడు) చప్పుడు కాకుండా వెళ్ళి మీ నాన్న ....... (శిల్పాచార్యుడు మంచంపై పొర్లాడుతాడు). మీ నాన్న మంచం దగ్గరున్న పెట్టెలోని పత్రాలు తీసుకురా....... వెళ్ళు..... వెళ్ళు....ఊ

**కొడుకు** : ఇంత రాత్రిలో ఏంటమ్మా ఇది. నాకు నిద్ర వస్తుంది. రేపు పొద్దున్నే తెస్తాలే .....



5th Telugu Reader _unit5.indd 76 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

కీర్తిమతి : లేదు నాయనా లేదు...... రేపన్నది రూపు లేదు! ఇప్పుడే ఈ పని జరగాలి. వెళ్ళు ...... వెళ్లి పెట్టిలోని పత్రాలు తీసుకురా .......బుజ్జగించింది

కొడుకు : అలాగేనమ్మ ...... (వెళ్లి మెల్లగా పెట్టె తెరిచి అందులో నుండి పత్రాలు తెచ్చి తల్లి కిచ్చాడు. మూలనున్న దీపం వెలుతురులో వాటిని విప్పి చదివింది కీర్తిమతి.)

.. మహారాజు శ్రీ బీజాపూరు సుల్తాను ఆదిల్షాగారికి, తమ విధేయుడు శిల్పాచార్యుడి నమస్కారాలు. మీరు పంపిన ధనం అందింది. మీరడిగిన విజయనగర కోట రహస్యాలు ఈ పత్రంలో రాశాను. చిత్తగించగలరు. సెలవు. మీ సేవలో శిల్పాచార్యుడు.

కీర్తిమతి : అమ్మో!..... ఎంత ఘోరం తండ్రీ ...

కొడుకు : అమ్మా! ఏం జరిగిందమ్మా.....?

కీర్తిమతి : ఏం చెప్పనురా నాయనా?.... విజయనగరం కోట రహస్యాలు కాపాడవలసిన నీ తండ్రి స్వామి ద్రోహం, దేశద్రోహం చేస్తున్నాడురా. ఇది భరించరాని అపరాధం. హే విరుపాక్షా! నన్ను క్షమించు తండ్రి, నన్ను క్షమించు. (అక్కడున్న కత్తి అందుకుంది)

కొడుకు : (భయంతో బిగ్గరగా) అమ్మా! కత్తెందుకు తీసుకున్నావమ్మా...... అమ్మా చెప్పమ్మా....

కీర్తిమతి : ఇంతకంటె మరో దారి లేదురా నాయనా...... (ఈ శబ్దానికి శిల్పాచార్యుడు లేచాడు)

శిల్పాచార్యుడు : (భయాందోళనతో) కీర్తిమతీ..... ఆ పత్రాలెందుకు తీశావ్ .....? ఇలా ఇవ్వు.

(ముందుకు వచ్చాడు)

కీర్తిమతి : స్వామి! ఈ పత్రాలు మీకివ్వలేను. క్షమించండి. (ఒక్కసారిగా భర్త వైపు అడుగేసి, కత్తితో పొడిచింది.)

శిల్పాచార్యుడు : (నేల కొరుగుతూ....) అబ్బా! ఎంతపని చేశావు కీర్తి.... భర్తనని కూడా చూడకుండా నన్నే పొడుస్తావా......? అబ్బా....

కీర్తిమతి : దేశద్రోహి ఎవరైనాసరే వారికిదే శిక్ష. తండ్రీ విరూపాక్షా! విజయనగర సామ్రాజ్య రక్షణకు నేను చేసిన ఈ పనికి నన్ను క్షమించు దేవా! ..... క్షమించు. ఏ భార్య అయినా తను ముత్తైదువుగానే కన్నుమూయాలనుకుంటుంది...... అందుకే మీతో పాటు నేను వస్తున్నా స్వామి.



5th Telugu Reader _unit5.indd 77 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

(తానూ పొడుచుకుంది)

**కొడుకు** : అమ్మా!...... ఏంటమ్మా ఇది! నాన్నా..... అమ్మా....

(ఏడవ సాగాడు)

(శిల్పాచార్యుడు బాధతో మెలికలు తిరుగుతున్నాడు. రాయలు, తిమ్మరుసు దిగ్భ్రాంతితో వచ్చారు.

**తిమ్మరుసు** : కీర్తిమతి! ఎంతపని చేశావమ్మ! నీ దేశభక్తి, ప్రభు భక్తి సాటిలేనిది. నీ త్యాగం మరువలేనిది తల్లీ!

**కీర్తిమతి** : అప్పాజీ..... ఇదిగో నా బిడ్డ. తల్లిని, తండ్రిని కోల్పోతున్న అనాథ. వీడికి మీరే దిక్కు. వీడిని మంచి పౌరుడిగా, దేశ సేవకునిగా తీర్చి..... ది.. ద్దండి.

( చేతులు జోడించి, శిల్పాచార్యుని కాళ్ళపై పడి ప్రాణాలు విడిచింది...)

**శిల్పాచార్యుడు** : నన్ను మన్నించండి ప్రభూ! (రాయల కాళ్ళపై పడి ప్రాణాలు వదిలాడు)

**కొడుకు** : అమ్మా..... నాన్నా...

**శ్రీకృష్ణ దేవరాయలు** : ఏడవకు కుమారా ఏడవకు. నీ తల్లి చూపిన ప్రభుభక్తి మన సామ్రాజ్యానికి భవితనిచ్చింది. ఆమె ఆత్మ శాంతించుగాక ....... శాంతించుగాక పిల్లవాన్ని హత్తుకొని కళ్ళు మూసుకున్నాడు.)

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. దీర్ఘాలోచన = లోతుగా ఆలోచించడం.
2. దుర్భేద్యం = జయింపలేనిది.
3. వేగులు = రహస్యాలు సేకరించేవారు (గూఢచారులు)
4. నిఘా = జాగ్రత్తగా పరిశీలించడం.
5. మంద్ర స్వరం = మెల్లగా మాట్లాడడం (గుసగుసలు)
6. కడతేర్చుట = చంపడం
7. ఏకాంత మందిరం = రహస్య విషయాలు మాట్లాడుకునే గది.
8. దిగ్భ్రాంతి = ఆశ్చర్యం
9. హత్తుకొని = కౌగిలించుకొని.



5th Telugu Reader _unit5.indd 78 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## II. ప్రకృతి – వికృతి

1. రాత్రి – రాతిరి
2. స్వరం – సొరం
3. అమ్మ – అంబా

## III. వ్యతిరేకపదాలు

1. ఆశ × నిరాశ
2. కీర్తి × అపకీర్తి
3. దుర్భేద్యం × భేద్యం

## IV. జతపరచండి

1. బీజాపూరు సుల్తాను – విజయనగర శిల్పి
2. మంత్రి – అదిల్షా
3. శిల్పాచార్యుడు – శిల్పాచార్యుని భార్య
4. కీర్తిమతి – తిమ్మరుసు

## V. చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



1) శిల్పాచార్యుని భార్య పేరేమి?

అ) కీర్తిమతి ఆ) శుక్తిమతి ఇ) ఇంద్రమతి

2) శ్రీకృష్ణదేవరాయల మంత్రి పేరేమి?

అ) నాగయ్య ఆ) వెంకయ్య ఇ) తిమ్మరుసు

3) రంగాచార్యుడు ఎవరి కుమారుడు?

అ) అన్నమయ్య ఆ) శిల్పాచార్య ఇ) క్షేత్రయ్య

4) విజయనగరంపై దండెత్తాలని ఎవరు అనుకున్నారు?

అ) బహమనీ ఆ) బీజాపూర్ ఇ) తంజావూర్



5th Telugu Reader _unit5.indd 79 02-07-2019 20:58:30
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

5) విజయనగర సామ్రాజ్యరాజు ఎవరు?

అ) శ్రీకృష్ణదేవరాయలు ఆ) రంగాచార్యులు ఇ) అచ్యుతదేవరాయలు

## VI. కలిపి రాయండి

1. శిల్ప + ఆచార్యుడు =
2. సామ్రాజ్య + అధినేత =
3. దీర్ఘ + ఆలోచన =

## VII. ప్రశ్నలు

1. రాయలు ఏకాంత మందిరంలో ఎలా ఉన్నారు?
2. విజయనగర కోట శిల్పి పేరేమిటి?
3. విజయనగరంపై ఎవరు దండెత్తాలని ఉన్నారు?
4. శ్రీకృష్ణదేవరాయల మంత్రి పేరేమిటి?

## VIII. భాషను గురించి తెలుసుకుందాం.



**కింది సంశ్లిష్ట వాక్యాలను చదవండి. రెండు వాక్యాలుగా రాయండి.**

**ఉదా।** పావురం వచ్చి, రాజు దగ్గర వాలింది.

**ఉదా।।** పావురం వచ్చింది. పావురం రాజు దగ్గర వాలింది.

1. పాము చెట్టు దిగి, ఎలుకను మింగింది.

   --------------------------

   --------------------------

2. చీమ ఆకు మీద చేరి, ఒడ్డుకు చేరింది.

   --------------------------

   --------------------------

3. అతడు చదువుకొని, అంచెలంచెలుగా ఎదిగాడు.

   --------------------------

   --------------------------

www.Padasalai.Net





Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

4. అశ్విని రైలు ఎక్కి, బడికి వెళ్ళింది.

-------------------------

-------------------------

## IX. విద్యార్థులకు సూచన

1. మనపై నమ్మకం కలిగిన వారికి ఎటువంటి సమయంలోనూ ద్రోహం తలపకూడదని విద్యార్థులు తెలుసుకోవాలి.

## X. ఉపాధ్యాయులకు సూచన

1. ఇలాంటి స్వామి భక్తి, రాజ భక్తికి సంబంధించిన కథలను గ్రంథాలయాలలో సేకరించి విద్యార్థులకు బోధించాలి.

## ప్రణాళికా పని



1. ఈ నాటికను పిల్లలచే అభినయింప చేయండి.
2. ఇలాంటి నాటికలు, కథలు ద్వారా విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించండి.

www.Padasalai.Net



5th Telugu Reader _unit5.indd 81 02-07-2019 20:58:31
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
5

చదువు ఆనందించు

# 5.3 కవికోకిల సరోజిని నాయుడు



"ఎన్ని సార్లు చేసినా, జవాబు సరిగ్గా రాదు ...... పాడు లెక్క!" అని విసుక్కుంది ఒక అమ్మాయి. ఆ అమ్మాయికి లెక్కలంటే తలనొప్పి, మిగిలిన విషయాలలో ( subjects ) మాత్రం దిట్ట. మనసు మాత్రం లెక్కల మీదకు వెళ్ళేది కాదు. ఒక తెల్ల కాగితం తీసుకుంది. ఆలోచిస్తూ కూర్చుంది. ఆంగ్లంలో కొన్ని వాక్యాలు రాసింది. తనలో తాను చదువుకుంది. అంతులేని సంతోషంతో బిగ్గరగా చదివింది. అవి మామూలు వాక్యాలు కావు. కమ్మని కవిత. ఆ అమ్మాయికప్పుడు 11 ఏళ్లు మాత్రమే.

ఆ అమ్మాయి, పన్నెండో ఏటనే మద్రాసు విశ్వవిద్యాలయం వారి మెట్రిక్యులేషన్ పరీక్షలో, ఆ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచారు. పదమూడవ ఏటనే ఇంగ్లీషులో ఒక కావ్యం రాశారు. దాని పేరే సరోవరపు సారసాక్షి ( lady of the lake )

ఆమె ఆంగ్ల కవయిత్రిగా మంచి పేరు సంపాదించింది. పెద్దల ప్రశంసలు అందుకుంది. అంతేకాదు భారతదేశ "కవికోకిల (నైటింగేల్)" అనే గొప్ప పేరు కూడా సంపాదించింది. ఆమే "సరోజిని నాయుడు". సరోజిని 1879 వ సంవత్సరం ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో జన్మించింది. ఆమె తండ్రి పేరు అఘోరనాథ చటోపాధ్యాయ. తల్లి పేరు వరద సుందరీదేవి. ఆమె భర్త సుప్రసిద్ధ వైద్యుడు, మేజర్ జనరల్ ముత్యాల గోవిందరాజుల నాయుడు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కొడుకు పేరు డాక్టర్ జయసూర్య హోమియో వైద్యంలో ఆయన మంచి పేరు గడించారు.



5th Telugu Reader _unit5.indd 82 02-07-2019 20:58:31
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

1915వ సంవత్సరంలో ఆమెకు మహాత్మాగాంధీతో పరిచయం ఏర్పడింది. ఆనాటి నుంచి ఆమె రాజకీయాలకు అంకితమయ్యింది. 1930వ సంవత్సరంలో గాంధీజీ పిలుపునందుకొని ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నది. ఆమెను ఎర్రవాడ జైలులో నిర్బంధించారు. జైలులో ఆమె పూల మొక్కలకు ప్రతి రోజూ నీరు పోసి చక్కగా పెంచుతుండేది. అదే ఆమె నిత్యకృత్యంగా ఉండేది. ఆ విధంగా తాను పెంచే మొక్కలలో వచ్చే మొగ్గలను సంతోషంతో చూస్తూ కూర్చునేది. ఒకరోజు జైలరు "అమ్మా! ఈ వేళ మిమ్మల్ని విడుదల చేస్తున్నారు. సిద్ధంగా ఉండండి!" అని అన్నారు. సాధారణంగా ఆ విషయం విన్న వాళ్ళు సంతోషిస్తారు. కాని సరోజినీ నాయుడు మాత్రం విచారిస్తూ "ఇంకా ఇక్కడ ఒక్క వారం ఉంచండి! నేను పెంచిన మొక్కలకు పూలు వస్తాయి. వాటిని చూడాలని నాకెంతో ఆశగా ఉంది" అని అన్నారు. "వీల్లేదమ్మా!" అన్నాడు ఆ అధికారి. ఆమెకు ప్రకృతి అంటే అంత ఇష్టమన్నమాట.

సరోజినీ నాయుడు ఆంగ్లంలో ఎన్నో కవితలు రాశారు. వాటిల్లో బంగారు వాకిలి (The golden threshold), కాల విహంగం ( The bird of time ) భగ్న పక్షం ( The broken wing ) అనే కావ్యాలు ప్రసిద్ధి చెందాయి.

సరోజినీ నాయుడు గొప్ప కవయిత్రిగానే కాకుండా గొప్ప వక్తగా కూడా పేరుపొందారు. ఒకసారి ఒక సభలో ప్రసంగించడానికి వెళ్ళారు. సభా ప్రారంభానికి ముందు కరెంటు పోయింది. సభలో గందరగోళం ఏర్పడింది. సరోజినీ నాయుడు ఆ చీకటిలోనే ఉపన్యసించడానికి వేదిక ఎక్కింది. ఉపన్యాసం మొదలు పెట్టిందో లేదో తళుక్కున దీపాలు వెలిగాయి. సమయస్ఫూర్తితో వెంటనే "లైట్..... లైట్" అంటూ ఒక ఆంగ్ల కవితను చెప్పింది. సభికులంతా సంతోషంతో చప్పట్లు కొట్టారు. అప్రయత్నంగా అప్పుడు చెప్పిన ఆ కవిత విశేషమైన ప్రభావం పొందింది. ఆమె సహజ కవయిత్రి. అందువల్లనే ఆమెకు "కవికోకిల" అనే బిరుదు కూడా లభించింది.

1947 సంవత్సరంలో "ఏషియన్ రిలేషన్స్" సభ ఢిల్లీలో జరిగింది. ఆ సభకు ఆమె అధ్యక్షత వహించారు. ఆనాడు చేసిన ప్రసంగానికి ముగ్ధులై ఆసియా ప్రజలందరికీ నాయకురాలిగా ఆమెను ఎన్నుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఆమెను ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమించారు. స్వాతంత్ర్యం లభించిన తర్వాత దేశానికి మొట్టమొదటి మహిళా గవర్నరు ఆమె. సరోజినీ నాయుడు గవర్నరు పదవిని స్వీకరించిన తర్వాత సిబ్బందిని తగ్గించి, తన నివాసాన్ని తానే శుభ్రం చేసుకునేవారు. అది నిరాడంబరంగా జీవితాన్ని గడిపి ఆదర్శ మహిళగా పేరు తెచ్చుకున్నారు. మాటలలో చమత్కారిగా పేరుపొందారు. మనసులోని విషయాలను నిర్భయంగా, నిర్మొహమాటంగా చెప్పేవారు. నారీలోకానికి వన్నె తెచ్చారు. ఆ పదవిలో ఉండగానే, అంటే 1950 సంవత్సరంలో మార్చి 2వ తేదీన ఆమె శాశ్వతంగా కన్నుమూశారు. లక్నోలోని గోమతీ నదీ తీరాన దహన సంస్కారాలు జరిపి, అదే స్థానంలో ఒక స్మారక చిహ్నాన్ని కూడా నిర్మించారు.

సరోజినీ నాయుడు గవర్నర్ పదవిలో ఉన్న కాలంలో మహిళాభ్యున్నతికి, శరణార్థుల పునరావాసానికి ఎనలేని కృషి చేశారు. పరిపాలనా రంగంలో స్త్రీలు కూడా సమర్థులేనని, పురుషులకు ఏమాత్రం తీసిపోరని రుజువు చేశారు.

"సరోజినీ నాయుడుని గవర్నర్ గా నియమించడం వల్ల గవర్నర్ పదవికి ముందెన్నడూ లేని గౌరవం లభించింది" అని మొట్ట మొదటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్‌గారు అన్నారు.



5th Telugu Reader _unit5.indd 83 02-07-2019 20:58:31
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
6

# 6.1 రాజు - కవి

- గుర్రం జాషువా



1. సౌధరాజ మందు జన్మించె నొక బిడ్డ
పూరి గుడిసెలోన బుట్టెనొకడు
ప్రబలిరందునిందు; రాజయ్యె నొక్కడు
నొకడు రానురాను సుకవియయ్యె

2. అతని రాజదండ మధికారధనమయం
బితని కలము కావ్యశతశతమ్ము
అతని యిల్లు మేటిరతనాల రుచిమయం
బితని యిల్లు గండవితతిమయము

www.Padasalai.Net



5th Telugu Reader _unit6.indd 84 02-07-2019 20:58:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. కవినెరుగు రాజు, రాజును
కవియెరుగును, కవిని రాజు గణియింపండా
కవిరాజు గణన సేయడు
కవియును రాజిద్ధరాత్మ గౌరవ కాముల్

4. * భయము తోడ రాజు ప్రస్తుతింతురు ప్రజల్
భక్తి తోడ కవిని ప్రస్తుతింత్రు
జీతమిచ్చి రాజు సేవింపబడుచుండు
జీతమీక సుకవి సేవలందు

5. * రాజు చేతి కత్తి రక్తంబు వర్షించు
సుకవి చేతికలము సుధలు గురియు
ఆతడేల గలుగు యావత్ప్రపంచంబు
నీతడేల గలుగు నిహము పరము

6. * రాజు మరణించె నొకతార రాలిపోయె
కవియు మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు

## భావాలు

1. గొప్ప భవనంలో ఒక బిడ్డ జన్మించాడు. పూరిగుడిసెలో ఒక బిడ్డ పుట్టాడు. అచట, ఇచట పుట్టిన బిడ్డలు పెరిగి పెద్దవారైనారు. కాలగమనంలో ఒకడు రాజయ్యాడు, మరొకడు కవి అయ్యాడు.



5th Telugu Reader _unit6.indd 85 02-07-2019 20:58:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

2. రాజు చేతిలోని దండం అధికారంతో కూడి ఉంది. కవి వద్ద అనేక అందమైన కావ్యాలున్నాయి. రాజు ఇంట గొప్ప రత్నాలు ప్రకాశిస్తున్నాయి. కవి ఇంట రాళ్ళ కుప్పలున్నాయి.

3 రాజుకు కవి తెలుసు. అలాగే కవికి కూడా రాజు తెలుసు. అయినప్పటికీ ఒకరినొకరు లెక్కపెట్టరు. ఆత్మగౌరవాన్నే వాళ్ళు కోరుకుంటారు.

4. ప్రజలు రాజును భయంతోను, కవిని భక్తితోను పొగుడుతుంటారు. రాజు వల్ల జీవితాన్ని పొందేవాళ్ళు అతన్ని సేవిస్తారు. కాని సుకవి ఎవరికీ డబ్బులు ఇవ్వకుండానే భక్తితో కూడిన సేవలను ప్రజల నుండి అందుకుంటాడు.

5. ప్రభువు ఖడ్గం యుద్ధంలో నెత్తుటి వాన కురిపిస్తుంది. కవి చేతి కలం కావ్య రచన చేసి అమృతాన్ని కురిపిస్తుంది. రాజు ప్రపంచాన్ని పరిపాలించగలడు. కాని కవి ఈ లోకాన్ని, పరలోకాన్ని పాలించగల సమర్థుడు.

6. రాజు మరణించగా ఆకాశం నుండి ఒక నక్షత్రం నేలరాలింది. కవి చనిపోగా ఒక తార ఆకాశంలో కొత్తగా పొడసూపింది. రాజును గుర్తించుకోవడం కోసం రాతి విగ్రహాలుంచారు. కానీ, కవి నిరంతరం ప్రజల నాలుకలపై శాశ్వతంగా జీవించి ఉంటారు.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. సౌధం = భవనం
2. మేట = గొప్ప
3. ఇహం = ఈలోకం
4. తార = నక్షత్రం
5. ప్రబలుట = వ్యాపించుట, పెరుగుట
6. సుకవి = మంచి కవి
7. సుధ = అమృతం
8. శతం = నూరు
9. జన్మించడం = పుట్టడం
10. గండవితతి = రాళ్ళకుప్ప
11. గగనం = ఆకాశం



5th Telugu Reader _unit6.indd 86 02-07-2019 20:58:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## II ప్రకృతి – వికృతి

1. రాజు – ఱేడు
2. కవి – కయి
3. కావ్యం – కబ్బం
4. భక్తి – బత్తి

## III వ్యతిరేక పదాలు

1. గౌరవం × అగౌరవం
2. జీవించుట × మరణించుట
3. ఇవ్వడం × తీసుకోవడం
4. అమృతం × విషం

## IV జతపరచండి

1. పూరి గుడిసె – అధికారం
2. భవనం – కావ్యం
3. కలం – రాజు
4. రాజదండం – కవి

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1. భక్తి తోడ కవిని ----------------
2. రాజు మరణించె నొకతార ----------------
3. సుకవి జీవించే ప్రజల ----------------
4. రాజు చేతి కత్తి ---------------- వర్ధించు.

## VI విడదీసి రాయండి

1. ప్రబలిరందు –
2. గగనమెక్కె –
3. జీతమిచ్చి –



5th Telugu Reader _unit6.indd 87 02-07-2019 20:58:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

4. యావత్ప్రపంచం –

5. విగ్రహములందు –

## VII ప్రశ్నలు

1. రాజు, కవి ఎక్కడ జన్మించారు?
2. రాజు, కవి ఏవిధంగా సేవలు పొందుతారు?
3. రాజు, కవి వేటిని పాలిస్తారు?
4. మరణించిన తరువాత రాజు కవి ఎక్కడ జీవిస్తారు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం



అ) కింది పదాలను చదవండి, గమనించండి.

| మహద్వాచకం | మహతీ వాచకం | అమహద్వాచకం |
|---|---|---|
| పుంలింగం | స్త్రీ లింగం | నపుంసక లింగం |
| నేతాజీ | కల్పన | పర్వతం |
| కృష్ణుడు | రమ | పక్షులు |
| చంద్రయ్య | పావని | చెట్టు |

పైన ఉన్న నామవాచక పదాలను చదివారు కదా! వాటిలో కొన్ని పదాలు పుంలింగాన్ని, కొన్ని పదాలు స్త్రీలింగాన్ని, కొన్ని పదాలు నపుంసకలింగాన్ని తెలుపుతున్నాయి. ఇవి మూడు రకాలు.

1. పుంలింగం (మహద్వాచకం): పురుషులను గురించి తెలుపుతుంది. ఉదా॥ అర్జునుడు, సూర్యుడు, దశరథుడు.

2. స్త్రీ లింగం (మహతీ వాచకం): స్త్రీలను గురించి తెలుపుతుంది. ఉదా॥ సుభద్ర, శకుంతల, కౌసల్య

3. నపుంసక లింగం (అమహద్వాచకం): స్త్రీ, పురుషులు కాక తక్కిన వాటిని గురించి తెలుపుతుంది. ఉదా॥ ఇల్లు, చెట్లు, పలక, గోడ

ఆ) కింది వాక్యాలను చదవండి పట్టికను పూరించండి.

1. ఏకలవ్యుడు విలువిద్య నేర్చుకోవడానికి ద్రోణాచార్యుల వద్దకు వెళ్ళాడు.



5th Telugu Reader _unit6.indd 88 02-07-2019 20:58:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

2. రుక్మిణీదేవి గొప్ప నాట్యకళాకారిణి.

3. భారతదేశానికి మూడు వైపులా నీరు ఒకవైపు గొప్ప పర్వతాలు ఎల్లలుగా ఉన్నాయి.

4. వేటగాడు పక్షులను, జంతువులను వేటాడడానికి అడవికి వెళ్ళాడు.

5. ప్రాచీనకాలంలో ఎద్దుల సాయంతో వ్యవసాయం చేసేవారు.

6. ఉమ, దేవి, అచ్యుత్, ఆనంద్ అందరూ కలిసి చాలా రకాల పువ్వులు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు.

పైన వాక్యాల్లో ఉన్న స్త్రీలింగ , పుంలింగ, నపుంసకలింగ పదాల్ని పట్టికలో రాయండి.

| పుంలింగం | స్త్రీ లింగం | నపుంసక లింగం |
|---|---|---|
| | | |

## IX విద్యార్థులకు సూచన

1. కవిత్రయం అంటే ఎవరో తెలుసుకోండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. గుర్రం జాషువా రచనల ప్రత్యేకతను విద్యార్థులకు తెలపండి.

## ప్రణాళికా పని

కింది విభక్తి ప్రత్యయాలను ఉపయోగించి వాక్యం రాయండి



1. గురించి – నా గురించి దిగులు పడకు.
2. తోడన్ –
3. యొక్క –
4. కొఱకు –
5. వలన –
6. అందు –



5th Telugu Reader _unit6.indd 89 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 6

# 6.2 బాలభట సంఘం



బాల బాలికలలో దేశభక్తిని, క్రమశిక్షణను పెంపొందించి వారిని సమాజసేవకులుగా తీర్చిదిద్దడానికి ప్రారంభించబడిన ఉద్యమం 'బాలభట ఉద్యమం'. ఈ ఉద్యమంలో పాఠశాలలోని విద్యార్థులు ఎవరైనా చేరవచ్చు. బాలభట ఉద్యమంలో పాల్గొనే అబ్బాయిలను 'కబ్బులు' అంటారు. వీరి బృందాన్ని 'స్కౌట్స్' అంటారు. అలాగే అమ్మాయిలను 'బుల్‌బుల్' అంటారు. వీరి బృందాన్ని 'గైడ్స్' అంటారు.

### మొదలైందిలా:

ఈ ఉద్యమాన్ని 'సర్ రాబర్ట్ బేడన్ పావెల్' అనే బ్రిటీష్ సైన్యాధికారి 1907వ సంవత్సరం దక్షిణాఫ్రికాలో బోయర్ యుద్ధాలలో గాయపడిన వాళ్ళకు సేవ చేయడానికి 20 మంది విద్యార్థులతో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఆ పిల్లలంతా ఎంతో ఉత్సాహం, సహనంతో అందరికీ సేవ చేశారట. పిల్లలలోని పట్టుదలను చూసిన పావెల్ యుద్ధాల తర్వాత కూడా దీనిని కొనసాగించారు. అందుకే పావెల్ గుర్తుగా ఏటా ఆయన పుట్టిన రోజైన ఫిబ్రవరి 22ను 'అంతర్జాతీయ బాలభట దినోత్సవంగా' జరుపుతున్నారు.

### బాలభట సంఘం లక్ష్యాలు:

1. సమాజానికి సేవలు అందించడం.



5th Telugu Reader _unit6.indd 90 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

2. జాతీయ పతాకాన్ని, స్కౌట్ పతాకాన్ని ఎగుర వేయడం.

3. సేవా సంస్థల గురించి తెలుసుకోవడం, వాటికి సహాయపడటం.

4. ప్రథమ చికిత్స చేయడం.

5. ఈతకొట్టడం, వంతెనలు, రోడ్లు వేయడం.

6. వ్యక్తిగత పరిశుభ్రత, నిర్ణయాలు తీసుకోవడం.

7. గుడారాలు కట్టడం, శిబిరాలు నిర్వహించడం.

అంతేకాకుండా ఆటపాటలు కూడా ఈ శిక్షణలో భాగమే. సెలవుల్లో కొన్ని ప్రత్యేక రోజుల్లో శిబిరాలు నిర్వహిస్తారు. గ్రామాల్లో జరిగే జాతరలు, తిరునాళ్ళు, బహిరంగ సభలు జరిగినప్పుడు స్కౌట్లు ఆ ప్రదేశానికి వెళ్ళి అక్కడ ఏదైనా సహాయం అవసరమైతే చేస్తుంటారు. అందుకోసం ముందుగా గుడారాలు వేసుకుంటారు. తర్వాత వస్తువులు, ఆహార పదార్థాలు సేకరించుకుంటారు. రాత్రి వేళలో శిబిరాన్ని ( Campfire )నిర్వహిస్తారు. అంటే మంట వేసి చుట్టూ చేరి, పాటలు పాడుతూ ఆడుకుంటారు.

## నియమాలు

ఈ ఉద్యమంలో విద్యార్థులందరూ స్వచ్ఛందంగా చేరాలి. సత్యం పలకడం, కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం, రోగగ్రస్థులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యవసర సమయాల్లో సాయపడటం వంటి పనులు బాలభటులు చేస్తుంటారు.

ఆయుధాలు లేకుండా వీరు కేవలం ఒక కర్రను మాత్రమే ధరిస్తారు. వీరికి సైనికుల వలె ప్రత్యేక దుస్తులు ఉంటాయి. బూడిద రంగు చొక్కా, ముదురు నీలిరంగు నిక్కరు వేసుకుంటారు. స్కౌట్లకు ప్రతేక బ్యాడ్జీలు ఉంటాయి. స్కౌట్లు బ్యాడ్జిని చొక్కా ఎడమ జేబుకు ధరిస్తారు. బూడిదరంగు బెల్టు కట్టుకుంటారు. ఈ ఉద్యమంలో చేరినవారు దళాలుగా ఏర్పడుతారు. ప్రతి దళానికి ఒక పతాకం, వాయిద్యాలు ఉంటాయి. "సదా సమాజ సేవలో ఉంటాం" అనే నినాదం ఈ పతాకంపై రాసి ఉంటుంది. స్కౌటులో చేరిన విద్యార్థులతో మాతృదేశానికి, తోటి మానవులకూ సేవ చేస్తామని ప్రమాణం చేయిస్తారు. కుడిచేతి వందనం, ఎడమ చేతి కరచాలనం వీరి సంప్రదాయం.

సమాజ సేవ అంటే పెద్దవాళ్ళే చేస్తారనుకుంటాం కదా! కానీ మనం కూడా సమాజ సేవ చెయ్యొచ్చు. అందుకోసం బడిలోనే శిక్షణ కూడా తీసుకోవచ్చు. దీని ద్వారా మన వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకోవడమే కాకుండా మన దేశానికి కూడా సేవచేయొచ్చు.



5th Telugu Reader _unit6.indd 91 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## అభ్యాస వేదిక

### I క్రింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. గుడారం = తాత్కాలికంగా ఉండటానికి వేసే గుడిసె
2. శిబిరాగ్ని = రాత్రిపూట కట్టెలు వెలిగించి గుంపుగా చేరడం
3. రోగగ్రస్తులు = ఆరోగ్యం బాగా లేని వారు
4. దుస్తులు = బట్టలు
5. దళం = సమూహం

### II ప్రకృతి – వికృతి

1. జాతర – యాత్ర
2. సత్యం – సత్తెం
3. భక్తి – బత్తి
4. ఆహారం – ఓగిరం

### III వ్యతిరేకపదాలు

1. ఉత్సాహం × నిరుత్సాహం
2. రాత్రి × పగలు
3. కష్టం × సుఖం
4. కుడి × ఎడమ
5. పిల్లలు × పెద్దలు

### IV జతపరచండి

1. బాలలు – బ్రిటిష్ సైన్యాధికారి
2. బాలికలు – బాలభట దినోత్సవం
3. ఫిబ్రవరి 22 – బుల్‌బుల్
4. పావెల్ – కబ్బులు



5th Telugu Reader _unit6.indd 92 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



కింది వాటికి సరియైన సమాధానాలు రాయండి.

1) బాలభట ఉద్యమాన్ని ---------------- స్థాపించారు

అ) సుభాష్ చంద్రబోస్ ఆ) సర్ రాబర్ట్ బేడన్ పావెల్ ఇ) సర్ థామస్ మన్రో

2) బాలభట సంఘంలో అమ్మాయిల బృందాన్ని ---------------- అంటారు

అ) కబ్బులు ఆ) స్కౌట్స్ ఇ) బుల్‌బుల్ ఈ) గైడ్స్

3) బాలభట ఉద్యమాన్ని ---------------- సంవత్సరంలో ప్రారంభించారు.

అ) 1907 ఆ) 1947 ఇ) 1950 ఈ) 1970

4) బాలభటులు ధరించు బెల్టు ----------------

అ) ఎర్ర రంగు ఆ) నల్ల రంగు ఇ) బూడిద రంగు ఈ) తెల్ల రంగు

5) బోయర్ యుద్ధం ---------------- దేశంలో జరిగింది

అ) అమెరికా ఆ) ఇంగ్లాండ్ ఇ) చైనా ఈ) దక్షిణాఫ్రికా

## VI కలిపి రాయండి

1) సైన్య + అధికారి =

2) దిన + ఉత్సవం =

3) ప్రతి + ఏక =

4) జరుపుతు + ఉన్నారు =

## VII ప్రశ్నలు

1) బాల భట ఉద్యమాన్ని ఎవరు, ఎక్కడ ప్రారంభించారు?

2) బాలభట సంఘం లక్ష్యాలేవి?

3) బాలభటులు చేయాల్సిన పనులను రాయండి.

4) బాలభటుల అబ్బాయిల బృందాన్ని ఏమంటారు?

www.Padasalai.Net



5th Telugu Reader _unit6.indd 93 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net
www.Trb Tnpsc.Com

## VIII భాషను గురించి తెలుసుకుందాం.



తెలుగు భాషలో వాక్యాంగాలు మూడు. అవి

1) కర్త

2) కర్మ

3) క్రియ

వీటిని గురించి తెలుసుకుందాం.

అ) కింది వాక్యాలను చదవండి

1) గోపి గుర్రం కళ్ళేన్ని చేత్తో పట్టుకున్నాడు.

2) దివ్య 'రాజు-కవి' కథ చదువుతున్నది.

3) శేఖర్ మొక్కలు నాటాడు.

4) రాజు గారు పండితులను సత్కరించారు.

ఆ) పై వాక్యాలకు సంబంధించిన ప్రశ్నార్థక వాక్యాలు చదవండి.

1) గుర్రం కళ్ళేన్ని ఎవరు పట్టుకున్నారు?

2) రాజు-కవి కథను ఎవరు చదువుతున్నారు?

3) మొక్కలు ఎవరు నాటారు?

4) పండితులను ఎవరు సత్కరించారు?

పిల్లలూ పై వాక్యాలలో ఏ ప్రశ్నార్థక పదం ఉందో గమనించండి. ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి. ఇలా 'ఎవరు' అనే పదానికి సమాధానం వచ్చే వాటిని 'కర్త' అంటారు.

1) గోపి దేన్ని పట్టుకున్నాడు?

2) దివ్య దేన్ని చదువుతుంది?

3) శేఖర్ వేటిని నాటాడు?

4) రాజు గారు ఎవరిని సత్కరించారు?

ఈ ప్రశ్నలకు వచ్చే సమాధానాలు ఏవో చెప్పండి. మీరు చెప్పిన మాటలను అనగా ఎవరిని, దేనిని, వేటిని అనే పదాలకు సమాధానంగా వచ్చే పదాలను 'కర్మ' అంటారు.

పై వాక్యాలలో పనిని తెలియజేసే పదాలు ఏవి? వీటిని ఏమంటారు?



5th Telugu Reader _unit6.indd 94 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

ఇ) కింది వాక్యాలను చదవండి. వాటిలోని పదాలలో కర్త, కర్మ, క్రియలను గుర్తించి పట్టికను పూరించండి.

1) విద్యార్థులు ఊరేగింపులు నిర్వహిస్తున్నారు.

2) కవిత గేయాన్ని రాసింది.

3) కృష్ణ మామిడి పండ్లు తెచ్చాడు.

4) కావ్య శుభలేఖను చదివింది.

5) నానమ్మ కథలు చెప్పింది.

| | కర్త | కర్మ | క్రియ |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |

## IX విద్యార్థులకు సూచన

1) మీ పాఠశాలలో గల బాలభట సంఘంలో చేరండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1) బాలభట సంఘాలు ఏర్పరచి శిబిరాలు నిర్వహించండి.

2) మన దేశాన్ని రక్షించే సైనికుల గురించి తెలపండి.

## ప్రణాళికా పని

1) నీవు బాలభటుడిగా జాతరలోను, తిరునాళ్ళలోనూ ఉన్నప్పుడు ప్రజలకు ఎలాంటి సేవలు చేస్తావో తెలపండి.





5th Telugu Reader _unit6.indd 95 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

చదువు - ఆనందించు

# విభాగం 6

# 6.3 ఆరోగ్యమే మహాభాగ్యం



మనిషికి ఆరోగ్యం కంటె మించినది మరొకటి లేదు అని తెలియజెప్పే చిన్న ప్రయత్నమిది

శీనయ్య, జానయ్య ఇద్దరు చిన్ననాటి స్నేహితులు దగ్గరి దగ్గరి పల్లెలో నివసించేవారు. ఇద్దరికీ చెరో పది ఎకరాల పొలం ఉంది. కాని వర్షాలు సమయానికి రాక వ్యవసాయానికి నోచుకోలేక బంజరు భూములయ్యాయి. ఇద్దరూ వ్యవసాయ కూలీలయ్యారు.

జానయ్య ఊరు పట్టణానికి దగ్గరలో శీనయ్య ఊరు కొంతదూరంలో ఉండేవి. పారిశ్రామిక ప్రగతి, నగరీకరణం వల్ల పొలాలకు మంచి బేరాలు వచ్చాయి. అందరూ పొలాలు అమ్ముకోసాగారు. మన పొలాలు కూడా అమ్ముకుందాం. కోట్ల రూపాయలు వస్తాయి ఎలాగో మనవి బంజరు భూములే కదా! వాటి వల్ల మనకెలాగూ ఉపయోగం లేదు. కష్టపడకుండా రెండు తరాలు కూర్చొని తినొచ్చు అన్నాడు జానయ్య శీనయ్యతో. అందుకు శీనయ్య నిజమే కాని తాతలు సంపాదించిన పొలం అమ్మడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు అన్నాడు. తరువాత జానయ్య తాతలే పోయాక వారి భూములు ఉండి ఏం లాభం? ఇప్పుడు అమ్మితే కదరా లాభం. గింజ పండని మన బంజరు భూములు ఉన్నా ఒక్కటే లేకున్నా ఒక్కటే. డబ్బుంటేనే గదరా మనిషికి విలువ, గౌరవం. డబ్బేరా మనిషికి మహాభాగ్యం. "ధనం మూలం ఇదం జగత్" అన్న మాట తెలుసు కదా! నేను మాత్రం పొలం



5th Telugu Reader _unit6.indd 96 02-07-2019 20:58:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



అమ్ముతున్నాను, నా మాట విని నువ్వు పొలం అమ్మి సొమ్ము చేసుకో లేకపోతే ఏదో ఒకరోజు "ఒరే జానయ్య ఓ వంద రూపాయలు ఇవ్వరా" అంటూ అప్పు కోసం నా దగ్గరికొస్తావు గుర్తుంచుకో అని వెళ్ళిపోయాడు జానయ్య.

మిత్రుడి మాటలకు చాలా బాధపడ్డాడు శీనయ్య. అయినా తమ పెద్దలు సంపాదించిన పొలం అమ్మదలుచుకోలేదు.

జానయ్య మాత్రం తన పది ఎకరాల పొలాన్ని కోట్లకు అమ్మి కోటీశ్వరుడయ్యాడు, శీనయ్యను మరచిపోయాడు. జానయ్య ఊర్లో ఓ పరిశ్రమ, అనేక ఇళ్ళు వెలిశాయి. పచ్చగా ఉన్న ఒక చెట్టు కూడా కనబడకుండా అంతరించిపోయాయి.

శీనయ్యకు ఏం చేయాలో తెలియక అలాగే ఉండగా, ఆ ఊరి టీచర్ దగ్గర్లోని బ్యాంకు వారితో మాట్లాడి శీనయ్య భూమిని తాకట్టు పెట్టించి కొంత డబ్బు ఇప్పించాడు. పొలంలో బోరు వేసుకున్నాడు శీనయ్య. అదృష్టం కొద్దీ నీళ్ళు బాగానే పడ్డాయి. కొన్ని పాడి ఆవులు కొనుక్కున్నాడు. తన బంజరు భూమిలో కొంత మేర పశువులకు పచ్చిక, తక్కిన పొలంలో రకరకాల కూరగాయలు, మామిడి, కొబ్బరి చెట్లు వేశాడు. అంతేకాదు తన బోరు నుండి చుట్టు పక్కల గల పొలాల వారికి నీరిచ్చాడు. వారు కూడా శీనయ్యలా పంటలు వేసుకున్నారు. కాలగర్భంలో పది సంవత్సరాలు గడిచాయి.

పరిశ్రమ వదిలే విషవాయువులు, సాగిపోని మురికి నీటి వలన చెట్లు లేక మంచి గాలి కరువై ఊరి దరిదాపుల జనులు అనేక రోగాలకు గురైనారు. జానయ్యకు కూడా శ్వాసకోశ సంబంధిత వ్యాధి సోకింది. లక్షలకొద్ది డబ్బు ఖర్చు చేసినా వ్యాధి నయం కాలేదు. సరికదా డబ్బు మాత్రం హారతి కర్పూరంలా కరిగిపో సాగింది. "రోజుకో రాయి తీస్తే కొండలైనా కరుగుతాయి మరి" మిగిలిన డబ్బును ఇద్దరు కొడుకులు పంచుకొని చెరో దారి చూసుకొన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక, ఆదరించేవారు కరువై దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేరాడు జానయ్య.

శీనయ్య బోరు నీటి పుణ్యమా అని ఊరు ఊరంతా పంటలు పండించుకుంటున్నారు. ఆ ఊరి టీచరు సలహా మేరకు అందరూ సేంద్రియ ఎరువులే వాడడం వల్ల అధిక దిగుబడి పొందుతున్నారు. అంతేకాదు



5th Telugu Reader _unit6.indd 97 02-07-2019 20:59:00
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

దగ్గరలోని రైతు బజారులో అమ్మెడి నాణ్యమైన వీరి సరుకులకు మంచి పేరు వచ్చింది. శీనయ్య ఆదర్శ రైతయ్యాడు, అతని బంజరు భూమి బంగారు భూమిలా మారింది.

ఆరోజు జూన్ 5, ప్రపంచ పర్యావరణ దినోత్సవం. దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం ముగించి రోగులందరికీ పాలు, తన పొలంలో పండిన పండ్లు పంచడానికి తనవారితో లోనికి వెళ్ళాడు శీనయ్య. అలా పంచుతుండగా తనను చూసి ముఖం చాటేసిన ఒక రోగి దగ్గరికెళ్ళాడు శీనయ్య. బక్క చిక్కిన శరీరం, మాసిన బట్టలు, వాడిపోయిన ముఖం, పెరిగిన గడ్డంతో ఉన్నా, వాడు తన చిన్ననాటి మిత్రుడు జానయ్య అని గుర్తించాడు శీనయ్య. జరిగిన విషయమంతా తెలుసుకున్నాడు. జానయ్య స్థితికి ఎంతో నొచ్చుకొని బలవంతంగా తనతో తీసుకెళ్ళాడు శీనయ్య.

పదేళ్ళ ముందు ఊరిలా లేదు శీనయ్య ఊరు. ఎక్కడ చూసినా చెట్లే అదొక వనసీమగా అనిపించింది. జానయ్యకు. పాడిపంటలతో ఊరంతా కలకలలాడుతూ ఉంది.

అదే పాత ఇల్లు... అదే శీనయ్య అతనిలో ఏ మార్పు రాలేదు. నలుగురు కొడుకులు కోడళ్ళు, వారి పిల్లలతో ఇల్లంతా స్వర్గంలా ఉంది. నలుగురు కొడుకులు ఉమ్మడిగానే జీవిస్తున్నారు. ఎవరిలోనూ జానయ్య కొత్తవాడన్న అభిప్రాయం లేకపోగా శీనయ్యకు మల్లే గౌరవం, అభిమానం చూపారు. ఆ ఆదరాభిమానాలే జానయ్యను మళ్ళీ మామూలు మనిషిగా చేశాయి. వారం తిరక్కుండానే జానయ్య ఆరోగ్యం కుదుటపడసాగింది. నెల తిరక్కుండానే పూర్తిగా కోలుకున్నాడు.

పదేళ్ళ క్రితం శీనయ్యతో తానన్న మాటలు తనకు చెవిలో మారుమ్రోగాయి జానయ్యకు. కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంతలో శీనయ్య వచ్చాడు. ఒరేయ్ శీనయ్య, మనిషికి డబ్బే గొప్ప భాగ్యం అనుకున్నాను. నా ఊహ తప్పురా! మనిషికి "ఆరోగ్యమే మహాభాగ్యం" ఆరోగ్యవంతుడే గొప్ప భాగ్యవంతుడురా! అని పశ్చాత్తాపపడ్డాడు జానయ్య. "నువ్వు పూర్తిగా ఆరోగ్యవంతుడయ్యావు నాకదే చాలు" అంటూ జానయ్యను కౌగిలించుకున్నాడు శీనయ్య.

వృక్షో రక్షతి రక్షితః

"ఆరోగ్యవంతుడే ఐశ్వర్య వంతుడు" "ఆరోగ్యమే మహాభాగ్యం".



5th Telugu Reader _unit6.indd 98 02-07-2019 20:59:00
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విభాగం 7

# 7.1 జన్మభూమి

– రాయప్రోలు సుబ్బారావు



1. ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

2. ఏ పూర్వ పుణ్యమో ఏ యోగ బలమో
జనియించినాడవీ స్వర్గ ఖండమున
ఏ మంచి పూవులన్ ప్రేమించినావో
నిను మోసె ఈ తల్లి కనక గర్భమున

3 లేదురా ఇటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి పౌరులింకెందు



5th Telugu Reader _unit7.indd 99 02-07-2019 21:00:04
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

సూర్యుని వెలుతురుల్ సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక

4 అందాక గల ఈ అనంత భూస్థలిని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు
పాడరా! నీ తెన్గు బాల గీతములు
పాడరా! నీ వీర భావి భారతము.

www.Padasalai.Net

## భావాలు

1. ఓ భారతీయుడా! ఏ దేశానికి వెళ్ళినా, ఎలాంటి ఉన్నతమైన అధికారాన్ని పొందినా మాతృభూమి అయిన భారతదేశాన్ని పొగుడుతూ, భారత జాతి గౌరవాన్ని నిలపాలి.

2. పూర్వజన్మ పుణ్యం చేత, యోగ బలం వల్ల, భారతదేశమనే స్వర్గ ఖండంలో పుట్టాం, మన లాంటి పౌరులు ఎక్కడా లేరు.

3. మనదేశం లాంటి గొప్ప దేశం ఎక్కడా లేదు. మనలాంటి అదృష్టవంతులు లేరు. సూర్యుని వెలుతురు ప్రసరించినంతవరకు, ఓడలపై జెండాలు ఎగురుతున్నంత వరకు మనదేశం లాంటి గొప్ప దేశం మరొకటి లేదు.

4. అంతులేని ఈ విశాల భూమిలో మన భారత భూమిలాంటి చల్లని తల్లి లేదు, కాబట్టి మన దేశానికి సంబంధించిన గీతాలను పాడండి. అలాగే మన దేశానికి సంబంధించిన వీరగాథలను చెప్పండి.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. పీఠం = అధికారం, సింహాసనం
2. యోగబలం = తపస్సు వల్ల కలిగిన శక్తి
3. స్వర్గం = దేవలోకం
4. ఖండం = భాగం
5. కనకం = బంగారం



5th Telugu Reader _unit7.indd 100 02-07-2019 21:00:04
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

6. సోకు = ప్రసరించు

7. పొగడు = ప్రశంసించు

8. అనంతం = అంతులేని

9. ధీరుడు = ధైర్యశాలి

## II ప్రకృతి - వికృతి

1. పీఠం - పీట

2. పుణ్యం - పున్నెం

3. గౌరవం - గారవం

## III వ్యతిరేక పదాలు

1. పొగడడం × తిట్టడం

2. ప్రేమించడం × ద్వేషించడం

3. పుణ్యం × పాపం

4. భూమి × ఆకాశం

5. వెలుతురు × చీకటి

## IV జతపరచండి

1. జన్మభూమి - ఆడునందాక

2. పాడరా - ప్రేమించినావో

3. ఓడల జెండాలు - రాయప్రోలు సుబ్బారావు

4. ఏ మంచిపూవులన్ - బాలగీతములు

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



1) నిలుపరా నీ జాతి నిండు ______________

2) నినుమోసె ఈ తల్లి కనక ______________



5th Telugu Reader _unit7.indd 101 02-07-2019 21:00:04
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3) లేరురా మనవంటి __________

4) మన భూమి వంటి చల్లని __________

## VI విడదీసి రాయండి

1) పౌరులింకెందు –

2) సోకునందాక –

3) ఎవ్వరేమనినా –

4) పీఠమెక్కినా –

## VII ప్రశ్నలు

1) జన్మభూమి గొప్పతనాన్ని రాయండి.

2) భారతదేశ పౌరులు ఎటువంటి వారు?

3) మనం ఏ పాటలు పాడాలి?

4) ప్రపంచంలో గొప్పదేశమేది?

## VIII భాషను గురించి తెలుసుకుందాం



1) పండు – పండ్లు

2) చెట్టు – చెట్లు


3) కాకి – కాకులు

4) పుస్తకం – పుస్తకాలు

పైన చెప్పిన పదాలలో ఒక దానిని గురించి మాత్రం తెలిపే పదాలను 'ఏక వచనం' అంటారు, ఒకటి కన్నా ఎక్కువ ఉంటే వాటిని బహు వచనం అంటారు.

ఆ) కింది ఏకవచనాలకు బహు వచనాలు చెప్పండి. రాయండి.

| ఏకవచనం | బహువచనం |
|---|---|
| బంతి | |
| విత్తనం | |






5th Telugu Reader _unit7.indd 102 02-07-2019 21:00:04
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

| | |
|---|---|
| లడ్డు | |
| కాయ | |
| ఆవు | |
| పక్షి | |
| మనిషి | |
| పువ్వు | |
| మేక | |
| చేప | |



## IX విద్యార్థులకు సూచన

1) గ్రంథాలయానికి వెళ్ళి దేశభక్తికి సంబంధించిన గీతాలను సేకరించి చదవండి.

## X ఉపాధ్యాయులకు సూచన

విద్యార్థులకు దేశభక్తిని గూర్చి వివరించండి. దేశభక్తులుగా తీర్చిదిద్దండి.

## ప్రణాళికా పని

1. గురజాడ అప్పారావు రాసిన దేశభక్తి గీతాన్ని సేకరించండి. దానిని చార్టుపై రాసి తరగతిగదిలో అతికించండి.



www.Padasalai.Net



5th Telugu Reader _unit7.indd 103 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 7

# 7.2 గానయోగి - ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం



గానగంధర్వులు, సంగీతమే ఊపిరిగా కొన్ని వేల పాటలను అనేక భారతీయ భాషలలో పాడి సినీసంగీత ప్రపంచానికి మకుటంలేని మహారాజుగా వెలుగొందుతున్న ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం సంగీతాభిమానులందరికీ సుపరిచితమే. తన సుమధురమైన గాత్రంతో ఆబాలగోపాలాన్ని సంగీత సముద్రంలో ఓలలాడించే ఆ మధురగాయకుడు శ్రీ బాలసుబ్రహ్మణ్యం మన తెలుగువారు కావడం మనందరికీ గర్వకారణం.

**బాల్యం:**

ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం 1946వ సంవత్సరం జూన్ నెల 4వ తేదిన తమిళనాడులోని తిరువళ్ళూరు జిల్లా, పల్లిపట్టు తాలూకా, కోనేటంపేటలో తన అమ్మమ్మగారింట్లో జన్మించారు. వీరి తల్లిపేరు శకుంతలమ్మ, తండ్రి పేరు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి. ఈయన హరికథా పండితుడు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం పూర్తి పేరు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. అందరూ బాలు అని ముద్దుగా పిలిచేవారు. వీరి బాల్యం కోనేటంపేటలోను, తండ్రిగారి ఊరైన నెల్లూరులోను గడిచింది.

**విద్యాభ్యాసం:**

"పువ్వు పుట్టుగానే పరిమళిస్తుంది" అన్నట్టుగా బాలు చిన్నప్పటి నుంచే పాటలు చాలా చక్కగా పాడేవారు. ఆయన ప్రాథమిక విద్య కోనేటంపేటలోను, నెల్లూరులోను చదివారు. ఇంజినీరింగ్ అనంతపూర్‌లో చేరారు. ఆకాలంలోనే వివిధ పాటల పోటీలలో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. ఇంజినీరింగ్



5th Telugu Reader _unit7.indd 104 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



పూర్తిచేయకముందే పాటల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. అంచలంచెలుగా ఎదిగి, వసంతకాలపు కోకిలలాగా తన పాటలతో అందరినీ మైమరిపించారు.

## గాన ప్రస్థానం:

ఇంజినీరింగ్ చదువుకుంటున్న సమయంలో చలనచిత్రరంగ ప్రవేశం చేశారు. 1966లో శ్రీశ్రీశ్రీ మర్యాద రామన్న చిత్రంతో సినీ గాయకునిగా జీవితం ప్రారంభించారు.

పాటలోనే మాటలను, గళంలో అభినయాన్ని నింపి తెలుగుదనం ఒలికించగల విలక్షణత ఆయన ప్రత్యేకత. తరాలు మారినా ఎందరో నటులకు వారి హావభావాలకు, నటనాశైలులకు అనుగుణంగా ఆయన పాటలు పాడి ప్రాణం పోశారు. ఘంటసాల తరువాత తెలుగు సినిమా పాటలకు వారసుడిగా నిలిచారు. శంకరాభరణం, సాగరసంగమం లాంటి తెలుగు చిత్రాలే కాకుండా ఏక్‌తుజేకేలియే లాంటి హిందీ చిత్రాలకు ఆయన పాడిన పాటలు దేశమంతా ఉర్రూతలూగించాయి.

50 ఏళ్ళ సినీప్రస్థానంలో 40 వేల పాటలు, 14 ప్రాంతీయ భాషలలో పాడి అరుదైన ఘనతను సాధించారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ, తుళు, ఒరియా, అస్సామీ, బడగ, సంస్కృతం, కొంకిణి, బెంగాలి, మరాఠి మరియు పంజాబి మొదలైన భాషలలో మధురమైన పాటలు పాడి వాటికి ప్రాణం పోశాడు.



5th Telugu Reader _unit7.indd 105 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

### అవార్డులు :

బాలుగారు పాటల ప్రపంచంలో ఎవరూ పాడనన్ని పాటలు పాడి ఎన్నో అవార్డులను, సన్మానాలను, బిరుదులను సొంతం చేసుకొన్నారు. ఉత్తమ గాయకుడిగా ఆరు సార్లు జాతీయ అవార్డులను పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే నంది బహుమతులలో ఉత్తమ గాయకుడుగా 29 నంది అవార్డులను పొందారు.

ప్రతి ఏటా భారతప్రభుత్వం అందించే ఉన్నత పురస్కారాలైన పద్మశ్రీ 2001లోను, 2011లో పద్మభూషణ్ పురస్కారం పొందారు. 1981లో 'కళైమామణి' బిరుదును తమిళనాడు ప్రభుత్వం ప్రదానం చేసింది. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారు డాక్టరేట్ నిచ్చి సత్కరించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంవారు 2009లో కళాప్రపూర్ణ బిరుదుతో సన్మానించారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ ఇలా అనేక భాషలలో లెక్కలేనన్ని పురస్కారాలు, బిరుదలను పొందారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం బాలూగారి సహజ గుణం. తరతమ భేదం లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవించే బాలుగారు వినయసంపన్నుడు. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఒక సాధారణ సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి స్వయంకృషి, పట్టుదల, అంకిత భావంతో గానప్రపంచంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి జీవితం మనందరికీ ఆదర్శం.

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. మధుర స్వరం = తియ్యని స్వరం
2. ఆబాలగోపాలం = చిన్నపిల్లల నుండి పెద్దల వరకు
3. పరిమళం = సువాసన
4. గళం = గొంతు
5. విలక్షణత = ప్రత్యేకత
6. సాగరం = సముద్రం
7. ప్రస్థానం = ప్రయాణం
8. ఘనత = గొప్పతనం



5th Telugu Reader _unit7.indd 106 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## II ప్రకృతి – వికృతి

1. శ్రీ – సిరి
2. విద్య – విద్దె
3. భాష – బాస
4. గౌరవం – గారవం

## III వ్యతిరేకపదాలు

1. అదృష్టం × దురదృష్టం
2. గెలుపు × ఓటమి
3. ప్రారంభం × ముగింపు
4. ఉత్తమ × అధమ

## IV జతపరచండి

1. జన్మస్థలం – ఆంధ్రా విశ్వవిద్యాలయం
2. ముద్దుపేరు – 2001
3. పద్మశ్రీ – కోనేటంపేట
4. కళాప్రపూర్ణ – బాలు

## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



కింది వాటికి సరియైన సమాధానాలు రాయండి.

1. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం ----- రంగానికి చెందినవారు.

   అ) సినిమా ఆ) చిత్రలేఖనం ఇ) బోధన

2. బాలుగారు ------ సంవత్సరం జన్మించారు.

   అ) 1947 ఆ) 1946 ఇ) 1956

www.Padasalai.Net



5th Telugu Reader _unit7.indd 107 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. బాలుగారికి 'కళైమామణి' బిరుదును ప్రదానం చేసిన రాష్ట్రం ---

అ) ఆంధ్రప్రదేశ్ ఆ) కర్ణాటక ఇ) తమిళనాడు

4. బాలుగారికి 2011లో భారతప్రభుత్వం ఇచ్చిన అవార్డు

అ) పద్మభూషణ్ ఆ) భారతరత్న ఇ) పద్మశ్రీ

## VI కలిపి రాయండి

1) శంకర + ఆభరణం =

2) పండిత + ఆరాధ్య =

3) అంచెలు + అంచెలు =

4) ప్రతి + ఏకత =

## VII ప్రశ్నలు

1. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంగారు ఎప్పుడు, ఎక్కడ జన్మించారు?

2. బాలుగారు ఏ సంవత్సరం చలనచిత్రరంగ ప్రవేశం చేశారు?

3. బాలుగారు పొందిన అవార్డులేవి?

4. బాలుగారు ఏ ఏ భాషల్లో సినిమా పాటలు పాడారు?

## VIII భాషను గురించి తెలుసుకుందాం.



కింది వాక్యాలలో ఏక వచనాలను, బహువచనాలను గుర్తించండి.

1) లత పుస్తకాలు తీసుకొచ్చింది.

2) మేము పాఠశాలలో చెట్లు నాటాము.

3) శ్రీజ పాట పాడింది.



5th Telugu Reader _unit7.indd 108 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

4) శ్రీకృష్ణదేవరాయలు దేవాలయాలు కట్టించాడు.

5) మా తాత బొమ్మలు చేశాడు.

6) ఉగాది పండుగ వచ్చింది.



కింది ఏకవచన వాక్యాలను, బహువచనంలోకి మార్చి రాయండి.

1) ఆకాశంలో పావురం ఎగురుతున్నది.

------- ------- ------- ------- ------- -------

2) గుర్రం వేగంగా పరుగెత్తుతున్నది.

------- ------- ------- ------- ------- -------

3) ఆకాశంలో చుక్క మెరుస్తున్నది

------- ------- ------- ------- ------- -------

4) కొలనులో తామరపువ్వు పూసింది.

------- ------- ------- ------- ------- -------

5) మా తోటలో మామిడి పండు తిన్నాను.

------- ------- ------- ------- ------- -------

6) రాజు కోట కట్టించెను.

------- ------- ------- ------- ------- -------

7) లత ముగ్గు వేసింది.

------- ------- ------- ------- ------- -------

8) శిష్యుడు గురువుకు సేవ చేసెను.

------- ------- ------- ------- ------- -------

9) గోపి ఆవును మేపుతున్నాడు.

------- ------- ------- ------- ------- -------



5th Telugu Reader _unit7.indd 109 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## IX విద్యార్థులకు సూచన

1. తెలుగు సంగీతంలో వాగ్గేయకారులను గూర్చి తెలుసుకోండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంలాగా స్వయంకృషితో ఎదిగిన మరికొందరిని గూర్చి విద్యార్థులకు తెలియజేయండి.



## ప్రణాళికా పని

ఒక గ్రామంలో రామయ్య అనే రైతు ఉండేవాడు. ఆయనకు నలుగురు కుమారులు. వారు ఎప్పుడూ గొడవలు పడుతుండేవారు. రామయ్యకు వయసు మీరిపోతూవుంది. ఒకరోజు తన కుమారులను పిలిచి, ఒక్కొక్కరిని ఒక్కో కర్రను తీసుకురమ్మన్నాడు. వాళ్ళు ఒక్కో కర్రను తీసుకొచ్చారు. ఆ కర్రను విరవమని చెప్పాడు. సునాయాసంగా ఆ కర్రను విరిచేశారు. ఈసారి ఒక్కొక్కరికి నాలుగు కర్రలిచ్చి విరవమన్నాడు. కాని నాలుగు కర్రలు విరచడం వారికి సాధ్యంకాలేదు. అప్పుడు రామయ్య నాయనా! మీరు కూడా ఒక్కొక్కరుగా ఉంటే మిమ్మల్ని ఎవరైనా ఓడిస్తారు. నలుగురు ఐకమత్యంగా ఉంటే మిమ్మల్ని ఎవరూ ఓడించలేరు అని కర్రలను చూపించి చెప్పారు. అప్పటి నుంచి వారు కలిసిమెలిసి జీవించసాగారు.

## ప్రశ్నలు

1. రామయ్యకు కుమారులెందరు?
2. వారు ఎలా ఉండేవారు?
3. రామయ్య వారికి ఏమి ఇచ్చి విరచమన్నాడు?
4. ఈ కథలోని నీతిని చెప్పండి.
5. ఈ కథకు మీరే ఒక పేరుపెట్టండి.




5th Telugu Reader _unit7.indd 110 02-07-2019 21:00:05
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

చదువు - ఆనందించు

విభాగం 7

# 7.3 ఎవరు బాధ్యులు



రాత్రి వేళయింది. సముద్రం నుంచి చల్లగాలులు వీస్తున్నాయి. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది. రోడ్డు పక్కన కరెంటు స్తంభం, పక్కనే పెద్ద చెట్టు. ఎక్కడో దూరంగా కుక్కల అరుపులు వినబడుతున్నాయి. నల్లని తారు రోడ్డు విద్యుద్దీపాల వెలుగులో మిలమిల మెరుస్తోంది. ఆ సమయంలో అవి ఏం మాట్లాడుకుంటున్నాయో పాఠం చదివి తెలుసుకోండి.

విద్యుత్ స్తంభం : హమ్మయ్య! రాత్రయింది. మనం ఇంక తీరిగ్గా కబుర్లు చెప్పుకోవచ్చు.

చెట్టు : నిజమే! ఈ మధ్య రాత్రుళ్ళు తగ్గిపోతున్నాయి. ఈ జనం ఎంతసేపటికి ఇళ్ళకు వెళ్ళరు. రోడ్లు పట్టుకు తిరగడమే! చూడు .... ఇప్పుడు రోడ్డు ఎంత స్పష్టంగా కనిపిస్తుందో.

రోడ్డు : ఔను, నా మొహాన్ని మీరు స్పష్టంగా చూడాలంటే అర్ధరాత్రి దాకా ఆగాలి మరి.



5th Telugu Reader _unit7.indd 111 02-07-2019 21:00:06
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విద్యుత్ స్తంభం : సముద్రపు గాలి తీవ్రత పెరుగుతూ ఉంది. వేగంగా గాలి వీస్తే నా బల్బు మాటిమాటికీ ఆరిపోతూ, వెలుగుతూ ఉంటుంది. నాకేమో చాలా భయంగా అనిపిస్తుంది.

చెట్టు : నిజమే! ఆ రోజు గుర్తుందా నా మీద పిడుగు పడింది. అబ్బా! అవి మెరుపులా ఇంకేమన్నానా! గుర్తొస్తే ఇప్పటికీ నా గుండె దడ ఆగదు. ఆ పిడుగు పడ్డ వైపు కొమ్మ అంతా కాలిపోయింది కదా! అప్పటి నుండి ఎప్పుడు వర్షమొచ్చినా నాకు ఆ రాత్రే జ్ఞాపకం వస్తుంది. ఒళ్లంతా భయంతో కంపించిపోతాను.

రోడ్డు : అన్నివేళలా అలా జరగదు కదా! భయపడకు. నాకైతే వర్షం పడితే మహా ఆనందం. వర్షానికి నా మీద ఉన్న చెత్తాచెదారం, దుమ్ము ధూళి అంతా కొట్టుకుపోయి శుభ్రంగా తయారవుతాను.

చెట్టు : నాకూ వర్షం పడితే సంతోషమే. కానీ తుఫాను అంటేనే భయం. ఆ తుఫాను గాలికి ఎక్కడ కొమ్మలు విరిగిపోతాయేమో అనిపిస్తుంది.

విద్యుత్ స్తంభం : నాకా భయం లేదు. నన్ను లోహంతో తయారు చేశారు కదా! అన్నిటికీ తట్టుకుని నిలబడగలను. వర్షానికి తడిసినా జబ్బు చేయడం వంటివి ఉండవు. కానీ అప్పుడప్పుడూ అనిపిస్తోంది నాది ఒక జీవితమేనా అని!

చెట్టు : అదేమిటి అలా అంటావు? నువ్వు లేకపోతే ఈ వీధికి వెలుతురేది? నీ కన్నా ముందు నేను ఇక్కడ పుట్టాను. అప్పట్లో ఈ రోడ్డు కూడా ఉండేది కాదు. ఆ పెద్ద పెద్ద భవనాలు, పోస్టర్లు అసలే లేవు. అదిగో ఆ సముద్రం, నేను ... నాకు చాలా ఒంటరిగా అనిపించేది. ఎప్పుడైతే నిన్ను ఇక్కడ పాతారో నాకు తోడు దొరికిందనిపించింది. మెల్లగా ఈ రోడ్డు వచ్చింది. చాలా రోజులు నువ్వు నాతో మాట్లాడేవాడివి కావు. నీవు అలా ఉంటే నీకు చాలా గర్వమేమో అనుకునేదాన్ని.

విద్యుత్ స్తంభం : అవును, నాకు ఇది కొత్త వాతావరణం. కానీ అప్పుడు జరిగిన సంఘటన నాకు చాలా బాగా గుర్తుంది. ఆరోజు తుఫాను వచ్చింది. నేను తుఫాను గాలికి నీ మీద పడిపోయాను. నువ్వే లేకపోతే కింద పడిపోయేవాడిని. అప్పటికే నువ్వు బాగా దెబ్బతిన్నావు. అయినా నన్ను కాపాడావు. ఆరోజు నుంచే మన మధ్య స్నేహం కుదిరింది.

చెట్టు : ఔను! ఈరోజు గాలి చూస్తే నాకు మళ్ళీ ఆ రోజులే జ్ఞాపకం వస్తున్నాయి.

రోడ్డు : మీరు మరీ భయపడుతున్నారు. చెట్టు నేస్తమా! ఆ రోజు నువ్వు చాలా చిన్నగా ఉన్నావు. నీ కొమ్మలు సన్నగా ఉన్నాయి. అందుకే గాలికి విరిగిపోయాయి. కానీ నువ్వు ఇప్పుడు బాగా ఎదిగావు. నీ కొమ్మలన్నీ చాలా దృఢంగా ఉన్నాయి. భయపడాల్సిన పని లేదు. నిన్ను కూడా ఇప్పుడు బలంగా పాతిపెట్టారు. ఊరికే అధైర్యపడకండి. అదిగో మన పిచ్చుక నేస్తం వచ్చింది. ఏం విశేషాలు చెబుతుందో చూద్దాం!



5th Telugu Reader _unit7.indd 112 02-07-2019 21:00:06
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



పిచ్చుక : ఏమిటి! వీళ్ళకేదో ధైర్యం చెప్తున్నావు?

రోడ్డు : తుఫాను వస్తుందేమోనని వీళ్ళ భయం.

పిచ్చుక : తుఫాను కన్నా మీరు భయపడాల్సిన విషయం వేరొకటి ఉంది తెలుసా?

చెట్టు : ఏమిటది? ఎలాగా?

పిచ్చుక : ఎలాగేమిటి? ఈ మనుషుల వల్లే! మన స్తంభాన్ని చూడు ముందు లైటుతో ఠీవిగా నిలబడి ఉండేది. ఇప్పుడు చూడు కేబుల్ వైర్లు, డబ్బాలు, బ్యానర్లు, జెండాలు అన్నీ కట్టి ఎలా అందవిహీనంగా తయారు చేశారో!

విద్యుత్ స్తంభం: అవును నువ్వు చెప్పింది నిజమే! నేను లేకపోతే ఒక నిమిషం గడవని మనుషులు నన్ను ఎంత నిర్లక్ష్యంగా వాడుతున్నారో చూడు. రాత్రి చీకటిగా ఉంటుంది. కాబట్టి నన్ను వాడుకున్నా అర్థం ఉంది. పగలు కూడా కరెంటు ఆపరు. నా దీపాలు వెలుగుతూనే ఉంటాయి. ఎంత వృథా కదా! ఈ మధ్య విపరీతంగా కరెంటు కోతలతో రాత్రి నాకు వెలగడమే కష్టమైపోతుంది.

చెట్టు : నిజమే! నేనూ వింటున్నాను. కదలలేని మనలను చూస్తే అందరికీ లోకువే! ఎవరికి ఇష్టం వచ్చినట్టు వాళ్ళు మనతో ఆడుకుంటున్నారు. నన్నే చూడు నేను వీళ్ళకు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నాను. వస్తారు నన్ను పట్టించుకోరు ఏ క్షణం నన్ను ఇక్కడి నుండి లేపేస్తారో అని భయంగానే ఉంటుంది.



5th Telugu Reader _unit7.indd 113 02-07-2019 21:00:07
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

రోడ్డు : నువ్వు చెప్పింది నిజమే! ఈమధ్య నన్ను వెడల్పు చేయడానికి మీ చెట్లను పూర్తిగా నరికేస్తున్నారు. మీకే కాదు, ఈ మనుషుల వల్ల నా కష్టాలను ఏమని చెప్పను. రోజూ వందల కొద్ది లారీలు, బస్సులు, కార్లు స్కూటర్లు, బైకులు నా మీద పోతున్నాయి. నా మీద అక్కడక్కడ గోతులు కూడా పడ్డాయి. వర్షం పడిందా, ఆ గోతులు కనిపించవు. ఎవరు పడతారో తెలియదు. ఈ మధ్య ఇలాంటి ప్రమాదాలు ఎక్కువయ్యాయి. అదీగాక నామీదే ఉమ్మేయడాలు, చెత్తాచెదారం వేసి నన్ను ఎంతలా పాడుచేయాలో అంతలా పాడుచేస్తున్నారు. వీళ్ళు వేసే చెత్తలో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నాను. వీళ్ళకి ఎప్పుడు బుద్ధి వస్తుందో.

పిచ్చుక: చూశారా! నేను ఇలా మొదలెట్టానో లేదో! ఈ మనుషుల వల్ల మీరు ఎదుర్కొంటున్న కష్టాలన్నీ బయటపెట్టారు.

చెట్టు : మా కష్టాలు సరే! నువ్వు హాయిగానే ఉన్నావు కదా!

పిచ్చుక : నేను బాగానే ఉన్నట్టు కనబడుతున్నా. కానీ మా జాతి పూర్తిగా అంతమయ్యే పరిస్థితి వచ్చేసింది.

విద్యుత్ స్తంభం : అదేమిటి? అలా అంటున్నావు?

పిచ్చుక : అవును ఈ మధ్య చూశావా! నీ కంటే కూడా ఎత్తుగా పెద్ద పెద్ద టవర్లు వచ్చాయి. అవి సెల్‌ఫోన్ టవర్లు. వాటి నుండి వచ్చే రేడియో తరంగాల వల్ల మా పక్షి జాతి ప్రాణాలకే ఆపద కల్గుతోంది. మనుషుల తెలివితేటలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. దీని వల్ల అన్నీ నష్టాలే అయినా పట్టించుకోవడం లేదు. నాలాగే తేనెటీగల చిరునామా కూడా గల్లంతైపోతుంది. భవిష్యత్తులో తేనె రుచి ఎలా ఉంటుందో కూడా గ్రహించలేని పరిస్థితిలోకి మనిషి వెళ్ళిపోతాడు. తాను కూర్చున్న కొమ్మను తాను నరుక్కోవడమంటే ఇదే! తేనెటీగలు అంతరిస్తే క్రమేపి సమస్త మానవ జాతి కూడా అంతరిస్తుందట.

విద్యుత్ స్తంభం : నిజమే! నేను వింటున్నాను. ఇప్పుడు ప్రతి ఒక్కరి చేతిలో సెల్‌ఫోన్ ఉంటున్నది. ఇది ఇలాగే కొనసాగితే నిజంగానే అందరూ కష్టాలు ఎదుర్కోవాల్సిందే నిజంగా మనిషి ఎంత తెలివైనవాడో, అంత మూర్ఖుడు కూడా కదా!

పిచ్చుక : సరిగ్గా చెప్పావు.

చెట్టు : కానీ మనల్ని కాపాడేది కూడా వాళ్ళే!

విద్యుత్ స్తంభం : ఎలా?



5th Telugu Reader _unit7.indd 114 02-07-2019 21:00:07
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

చెట్టు : రోజూ నా దగ్గరికి వచ్చే పిల్లల్ని చూడండి. వాళ్ళే మన నేస్తాలు. వాళ్ళకు మన కష్టాలు చెప్పుకుందాం. నేటి పిల్లలే రేపటి పౌరులు కదా! మనల్ని కాపాడుకునే బాధ్యతను వాళ్ళు తప్పకుండా తీసుకుంటారు. నాకు ఆ నమ్మకం ఉంది. వాళ్ళు ప్రతి ఏటా వనమహోత్సవం నాడు మొక్కల్ని నాటుతారు తెలుసా!

పిచ్చుక : అవును నువ్వు చెప్పింది నిజమే! మన దగ్గరికి వచ్చే పిల్లలకు మన కష్టాలన్నీ చెప్పుకుందాం. దీనివల్ల వాళ్ళకు కలిగే నష్టాలను కూడా చెబుదాం. పక్షులు, జంతువులు, ప్రకృతి మీద ప్రేమ, దయ, జాలి కలిగి ఉండాలని చెబుదాం. తెల్లారింది. ఆ రోజు సాయంత్రం పిల్లలందరూ చెట్టుకింద ఆడుకోవడానికి వచ్చారు. చెట్టు, రోడ్డు, స్తంభం, పిచ్చుక తమ వద్దకు వచ్చిన పిల్లలను చూడగానే సంబరపడిపోయాయి. ముందు పిచ్చుక గబగబా పిల్లల దగ్గరకు వెళ్ళింది. మాట్లాడింది. పిల్లలతో చెట్టు, స్తంభం, రోడ్డు కూడా మాట్లాడాయి. అవన్నీ ఏమి మాట్లాడి ఉంటాయో ఊహించండి.



5th Telugu Reader _unit7.indd 115 02-07-2019 21:00:07
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విభాగం 8

# 8.1 సంతోషానికి కారణం





1. కుచ్చుతోక నాడిస్తూ
కొమ్మ లెక్కి దూకేస్తూ
ఉడుత ఒకటి సరదాగా
అడవిలోన తిరుగసాగె

2. అంతలోన పట్టు తప్పి
ఆకతాయి ఉడుత తూలి
నేలపై పరుండిన తో
డేలు మీద జారిపడి పోయే.



5th Telugu Reader _unit8.indd 116 02-07-2019 21:00:56
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



3. హుమ్మని తోడేలు ఉడుత
నొడిసి పట్టి చంప బోవ
విడువు మంచు దీనంగా
ఉడుత వేడు కొనసాగెను.

4. తోడేలే కళ మందో
తొందరపడి చంపబోక
ఉడుతమ్మను చూచి చూచి
పలికెనిట్లు శిరసు నుంచి,

5. విడిచిపెట్ట మంటావా?
ఉడతమ్మా; సరేగాని
సందేహం నాకొక్కటి
ఉంది, నీవు తీర్చాలంది.

6. ఏ వేళను నిను జూచిన
ఎంతో సంతోషంతో
అరుచుచుండు వెగురు చుందు
వది యెల్లా సాధ్యమయ్యె?

www.Padasalai.Net

7. ఎల్లప్పుడు నా మనమున
ఏదో ఒక దిగులుండును.
ఒళ్ళు మరచి పోవునంత
ఉల్లాసం నాకు లేదు.



8. గుప్పెడైనా లేని నీకు
కోకొల్లగా తృప్తియేమి?
నేనింత వాణ్ణి కదా
ఏల నాకు సుఖం లేదు?



5th Telugu Reader _unit8.indd 117 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

9. అప్పుడిట్లు పలికె నుడుత




"అయ్యా తోడేలు గారు!
ఆ ప్రశ్నకు సమాధాన
మంతా తెలుసండి నాకు.

10. ప్రభువు వారి గోళ్ళ వల్ల
ప్రక్క సలుపు చున్న దండి
వదిలేస్తే కొమ్మ ఎక్కి
పదిలంగా పలుకగలను."

11. తోడేలుకు జాలి పుట్టె
ఉడతమ్మను విడిచి పెట్టె
మెరుపులాగ కొమ్మ మీది
కురికి ఉడుత చెప్పెనిట్లు

12. "నిరాయుధుల నమాయకుల
నెత్తి మొత్తి మొక్కు చుండు
తోడేలా! నీ పాపం
నిన్ను కట్టి కుడుపుతోంది.

13. నీ లోపలి క్రూరత్వం
నిప్పై నిను కాల్చుచుండ
సుఖమన్నది నీకు లేదు
దిగులు నిన్ను విడిచి పోదు.



14. పరుల కెపుడు కీడు చేసి
యెరుగని మా ఉడుత జాతి
కానందం నాకేమిటి?
సంతృప్తికి లోటేమిటి?



www.Padasalai.Net

5th Telugu Reader _unit8.indd 118 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## భావాలు

1. కుచ్చు లాంటి అందమైన తోకను ఆడిస్తూ ఒక ఉడుత కొమ్మలు ఎక్కుతూ, దూకుతూ అడవిలో సరదాగా తిరుగుతోంది.

2. అంతలోనే పట్టుతప్పి ఆ ఉడుత తూలి చెట్టు కింద పడుకుని ఉన్న తోడేలు మీద జారి పడిపోయింది.

3. ఒక్క ఉదుటున తోడేలు ఉడుతను గట్టిగా పట్టుకొని చంపబోయింది. తనను వదిలి పెట్టమని తోడేలు తో ఉడుత దీనంగా వేడుకుంది.

4. ఏ కళనుందో తోడేలు తొందరపడి ఉడుతను చంపకుండా ఇలా పలికింది.

5. “నిన్ను విడిచి పెట్టాలాంటే నాకొక సందేహం ఉంది దాన్ని తీర్చాలి.

6. ఎప్పుడు చూసినా నువ్వు ఎంతో సంతోషంతో అరుస్తూ, ఎగురుతూ ఉంటావు. అలా నువ్వు అన్ని సమయాల్లో హాయిగా ఎలా ఉండగలుగుతున్నావు!

7. కాని నా మనసు ఎప్పుడూ దిగులుగానే ఉంటుంది నీలాగా అన్నీ మర్చిపోయేటంత ఉల్లాసం, సంతోషం నాకు లేదు.

8. ఆకారంలో చాలా చిన్నదానివైనా (గుప్పెడు కూడా లేని) నువ్వు చాలా ఎక్కువ తృప్తితో జీవిస్తావు. నీ కన్నా పెద్దగా ఉన్న నాకెందుకు సుఖం లేదు?

9. అప్పుడు ఉడుత ఇలా పలికింది “అయ్యా! తోడేలు గారు! మీరడిగిన ప్రశ్నకు సమాధానం నాకు తెలుసు.

10. మీ చేతి గోళ్ళ వల్ల నాకు నొప్పి కలుగుతోంది. నన్ను మీరు వదిలేస్తే జాగ్రత్తగా కొమ్మ ఎక్కి సమాధానం చెబుతాను”.

11. ఉడుత మాటలకి జాలి కలిగి తోడేలు ఉడుతను వదిలేసింది. ఒక్క ఉదుటున మెరుపు వేగంతో కొమ్మ మీదికి ఉరికింది ఉడుత తర్వాత–

12. “ఆయుధాలు లేనివారు, అమాయకులను చంపి తిన్నావు కదా! నీవు చేసిన పాపమే నిన్ను పట్టి కుదుపుతోంది.

13. నీలో ఉన్న క్రూరత్వమే నిప్పులా నిన్ను కాల్చుతోంది. అందువల్లే నీకు సుఖమన్నది లేకుండా పోయింది. నీలో ఉన్న దిగులు నిన్ను విడిచి పోవడం లేదు.

14. మా ఉడుత జాతి ఇతరులకు ఎప్పుడూ అపకారం (చెడు) చేయదు. అలాంటప్పుడు మాకు దిగులు ఎందుకుంటుంది? అందుకే మా ఆనందానికి హద్దులేదు. సంతృప్తికి లోటు లేదు” అని పలికింది ఉడుత.



5th Telugu Reader _unit8.indd 119 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. ఆకతాయి = తుంటరి
2. ఒడిసి పట్టు = కొంచెం పైకి ఎగిరి పట్టుకోవడం
3. తూలి = పక్కకు ఒరిగి
4. శిరస్సు = తల
5. సలుపు = బాధను కలిగించు
6. ఉరికి = దూకి
7. కీడు = చెడు
8. లోటు = కొదువ

### II. ప్రకృతి - వికృతి

1. శిరసు - సిరసు
2. అటవి - అడవి
3. సందేహం - సందియం
4. సంతోషం - సంతసం
5 . సుఖం - సుకం

### III. వ్యతిరేక పదాలు

1. సాధ్యం × అసాధ్యం
2. సుఖం × దుఃఖం
3. సంతృప్తి × అసంతృప్తి
4. పాపం × పుణ్యం
5. ఆయుధం × నిరాయుధం



5th Telugu Reader _unit8.indd 120 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com
www.Padasalai.Net

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## IV. జతపరచండి

1. ప్రభువు వారి - పలుకగలను
2. వదిలేస్తే - చన్నదండి
3. ప్రక్కసలుపు - గోళ్ళవల్ల
4. పదిలంగా - కొమ్మ ఎక్కి



## V. చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం

1. ఉడుత -------- ఎక్కి దూకేస్తూ, సరదాగా ------- లో తిరగసాగింది.
2. తనపై బడిన ఉడుతను తోడేలు హుమ్మని ----- పట్టి చంపబోయింది.
3. తోడేలుకు తన ------- కాల్చు చుండ --------దానికి లేదు.
4. ఇతరులకు --------- చేయని ఉడుతకు ---- లోటు లేదు.

## VI. విడదీసి రాయండి

1. ఉడుతమ్మ =
2. నాకేమిటి =
3. నిరాయుధులు =
4. నాకొక్కటి =

## VII. ప్రశ్నలు

1. ఉడుత తోడేలుపై ఎందుకు జారి పడింది?
2. తనపైన పడిన ఉడుతను చూసి తోడేలు ఏమని పలికింది?
3. తోడేలు ఎందుకు సంతోషంగా లేదు?
4. ఉడుత ఎందుకు సంతృప్తితో ఉంది?



## VIII. భాషను గురించి తెలుసుకుందాం

కింది పేరా చదవండి పేరాలోని నామవాచకాలు, సర్వనామాలు, విశేషణాలు, క్రియాపదాలను పట్టికలో



www.Padasalai.Net

5th Telugu Reader _unit8.indd 121 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

రాయండి.

కాకతీయ సామ్రాజ్యాన్ని పాలించిన వారిలో రుద్రమదేవి గొప్ప రాణిగా పేరు పొందారు. ఆమె తండ్రి గణపతిదేవ చక్రవర్తి. చిన్నప్పటి నుండి రుద్రమదేవి తండ్రి పాలనను నిశితంగా పరిశీలిస్తుండేది. గణపతి దేవుడు ఆమెను కొడుకువలే పెంచాడు. అన్ని విద్యల్లో శిక్షణ ఇప్పించాడు. తండ్రి తరువాత రుద్రమదేవి కన్న తల్లిలాగా రాజ్యాన్ని పాలించింది. ప్రజల అభిమానాన్ని చూరగొంది. ప్రజలకు రుద్రమదేవి అంటే అమితమైన భక్తి.

| నామవాచకం | సర్వనామం | విశేషణం | క్రియాపదం |
|---|---|---|---|
| | | | |

## IX. విద్యార్థులకు సూచన

1. మీరు ఎప్పుడెప్పుడు సంతోషంగా ఉంటారో ఆ సమయాలను పట్టికపరచండి.

## X. ఉపాధ్యాయులకు సూచన

1. విద్యార్థులకు సంతోషం వలన కలిగే లాభాలను గూర్చి వివరించి వారిని సంతోషంగా అభ్యసనంలో పాల్గొనేటట్లు చేయండి.

## ప్రణాళికా పని



### కింది గేయాన్ని పొడిగించి రాయండి

తెలుగెంతో హాయి హాయి

మధురంగా ఉండునోయి

తెలుగుతల్లి బిడ్డలుగా

పుట్టడమే భాగ్యమోయి

---------------

---------------

---------------

---------------



5th Telugu Reader _unit8.indd 122 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
8

# 8.2 సాహస బాలుడు



ఆంధ్రప్రదేశ్‌లో ఆకుల శ్రీకాంత్ అనే అబ్బాయి ఉన్నాడు. అతడు లక్ష్మీకాంతమ్మ, సమ్మారావుల మురిపాల కొడుకు. ఇతనికి క్రికెట్ ఆడడం, ఈదడం ఇష్టమైన పనులు. అరుణ్, అనిల్, సందీప్‌లు అతని మిత్రులు.

ఒక రోజు శ్రీకాంత్ మరో స్నేహితుడు కలిసి వాళ్ళుండే ఊరులో క్రికెట్ ఆడుతున్నారు. ఆట ఆసక్తికరంగా ఉన్న సమయంలో సందీప్ పరిగెత్తుతూ వచ్చాడు. "అరుణ్, అనిల్‌లు కాలువలో పడిపోయారు" అని కంగారుగా చెప్పాడు.

సందీప్ మాటలు విన్న శ్రీకాంత్ వెంటనే వేగంగా పరిగెత్తుతూ కాలువ గట్టుకు వెళ్ళాడు. అక్కడ చాలామంది గుమిగూడి చూస్తున్నారు. శ్రీకాంత్ ఇంకా ముందుకు వెళ్ళి చూశాడు. ఉధృతంగా ఉన్న కాలువ ప్రవాహంలో అరుణ్, అనిల్‌లు కొట్టుకుపోతున్నారు. వారిలో ఒకరి తల్లి "రక్షించండి, రక్షించండి" అని కేకలు వేస్తుంది. వెంటనే శ్రీకాంత్ ముందూ వెనుకా చూడకుండా కాలువలోకి దూకాడు. ఆ ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాళ్ళ దగ్గరకు వెళ్ళాడు. అతికష్టం మీద ఆ ఇద్దరిలో ఒకరిని పట్టుకొని ఒడ్డుకు చేర్చగలిగాడు. మరో అబ్బాయి



5th Telugu Reader _unit8.indd 123 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

మరింత దూరంగా కొట్టుకొని పోయాడు. నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్న శ్రీకాంత్ అలసిపోయాడు. అయినా పట్టుదలతో ఈదుకుంటూ కొట్టుకొనిపోతున్న ఆ రెండో అబ్బాయి వద్దకు చేరి అతన్ని కూడా ఒడ్డుకు చేర్చాడు.

ఇంతలో వారి బడిలో పనిచేసే ఒక ఉపాధ్యాయుడు అక్కడికి వచ్చారు. ఆ బాలునికి ప్రథమ చికిత్స చేసి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే అక్కడ గుమిగూడిన వారందరూ, శ్రీకాంత్ చేసిన సాహసాన్ని మనసారా మెచ్చుకున్నారు. శ్రీకాంత్ చేసిన సాహసకార్యం ఆనోట ఈనోట పడి చివరకు భారత ప్రభుత్వానికి చేరింది. శ్రీకాంత్ చూపిన ధైర్యసాహసాలకు మెచ్చి ఆ బాలునికి "జాతీయ సాహస బాలల పురస్కారాన్ని" ప్రకటించింది. ఆ బహుమానాన్ని దేశ రాజధాని ఢిల్లీలో "గణతంత్ర దినోత్సవం" నాడు అందుకొన్నాడు. ఇది శ్రీకాంత్ జీవితంలో మరిచిపోలేని సంఘటన.

బాలలూ! మీరు కూడా ఆపదలో చిక్కుకున్న వాళ్ళను ధైర్యసాహసాలతో, వివేకంతో కాపాడే ప్రయత్నం చేస్తారుగా ....

## అభ్యాస వేదిక

### I. కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. మురిపెం = ఇష్టం
2. స్నేహితులు = మిత్రులు
3. సాహసం = ధైర్యం
4. కేకలు = అరుపులు
5. ప్రథమ చికిత్స = ప్రమాదం జరిగినపుడు మొదటచేసే వైద్యం
6. పురస్కారం = బహుమానం
7. గణతంత్ర దినోత్సవం = జనవరి 26న జరిగే జాతీయ పండుగ
8. గుమిగూడు = గుంపుగా చేరు

### II. ప్రకృతి – వికృతి

1. కార్యం – కర్జం
2. ఉపాధ్యాయుడు – ఒజ్జ
3. యత్నం – జతనం



5th Telugu Reader _unit8.indd 124 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## III. వ్యతిరేకపదాలు

1. ఆసక్తి × అనాసక్తి
2. దగ్గర × దూరం
3. వెనుక × ముందు
4. ధైర్యం × అధైర్యం
5. మిత్రుడు × శత్రువు

## IV. జతపరచండి

1. ఉధృతం – ఒడ్డుకు చేర్చాడు
2. ఈదుకుంటూ – ఢిల్లీ
3. బాలుడు – సాహస బాలల పురస్కారం
4. రాజధాని – కాలప్రవాహం
5. శ్రీకాంత్ – ప్రథమ చికిత్స



## V. చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం

1. శ్రీకాంత్ వెంటనే వేగంగా పరిగెత్తుతూ --------- వెళ్ళాడు
2. శ్రీకాంత్ ముందు వెనుకా చూడకుండా ------- దూకాడు.
3. బాలునికి ప్రథమ చికిత్స చేసి దగ్గరలో ఉన్న -------- చేర్చాడు.
4. నీటి ప్రవాహంలో ఈదుతున్న ------ అలసిపోయాడు.
5. శ్రీకాంత్ చేసిన సాహసాన్ని ---- మెచ్చుకున్నారు

(మనసారా, కాలువలోకి, ఆసుపత్రిలో, శ్రీకాంత్, కాలువగట్టుకు )

## VI. కలిపి రాయండి

1. ఇష్టము + ఐన =
2. వారు + అందరు =



5th Telugu Reader _unit8.indd 125 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

3. వాళ్ళు + ఉండే =

4. పరుగు + ఎత్తుతూ =

5. దిన + ఉత్సవం =

## VII. ప్రశ్నలు

1. శ్రీకాంత్ కాలువలో ఎందుకు దూకాడు?
2. శ్రీకాంత్‌కు ఇష్టమైన పనులేవి ?
3. శ్రీకాంత్ స్నేహితుల పేర్లు తెలపండి.
4. ఉపాధ్యాయుడు ఏ విధంగా సహాయం చేశాడు?
5. భారత ప్రభుత్వం శ్రీకాంత్‌కు ఏ బహుమతి ఇచ్చింది?

## VIII. భాషను గురించి తెలుసుకుందాం.



కింది విషయాన్ని చదవండి, గమనించండి.

అచ్చు – హల్లులతో మొదలయ్యే పదాలు, ద్విత్వాక్షర, సంయుక్తాక్షర పదాలు వెతికి కింది పట్టికలో రాయండి.

ప్రాచీన కాలం నుండి ఆంధ్రదేశం గొప్ప కవులకు, కళలకు ప్రసిద్ధి చెందింది. పేరిణి నృత్యం, మిమిక్రి, యక్షగానం, కూచిపూడి నృత్యం మొదలైన ఎన్నో కళలకు నిలయమైంది. స్వామి రామానంద తీర్థ, పి.వి.నరసింహారావు, పొట్టిశ్రీరాములు, టంగుటూరి ప్రకాశం పంతులు, గురజాడ అప్పారావు ఇలా ఎంతో మంది మహానుభావులు పుట్టిన నేల తెలుగు నేల; అన్ని మతాలు, కులాలు, భాషలు వారు ఆంధ్రదేశంలో స్థిరపడి ఐకమత్యంతో జీవిస్తున్నారు.

పదాలను గుర్తించి పట్టికలో రాయండి. రాయడం

| అచ్చుతో మొదలయ్యే పదాలు | హల్లుతో మొదలయ్యే పదాలు | ద్విత్వాక్షర పదాలు | సంయుక్తాక్షర పదాలు |
|---|---|---|---|
| | | | |



5th Telugu Reader _unit8.indd 126 02-07-2019 21:00:57
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## IX. విద్యార్థులకు సూచన

1. మీ స్నేహితులు ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు మీరు సహాయం చేస్తే ఆ విషయాన్ని తరగతిలో వివరించండి.

## X. ఉపాధ్యాయులకు సూచన

1. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించే మంచి కథలను చదివించండి.



### ప్రణాళికా పని

జాతీయ సాహస బాలల పురస్కారాన్ని అందుకున్న కొంతమంది బాలల పేర్లను సేకరించి పట్టికను తయారు చేయండి.

www.Padasalai.Net



5th Telugu Reader _unit8.indd 127 02-07-2019 21:00:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

చదువు – ఆనందించు

# విభాగం 8

# 8.3 క్రిస్మస్



ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్న పండుగలలో క్రిస్మస్ పండుగ ఒకటి. ఈ పండుగ క్రైస్తవులకు అతి పెద్ద పండుగ. దీనిని ప్రతి సంవత్సరం డిసెంబరు 25వ తేదీన జరుపుకుంటారు. ఈ పండుగను క్రిస్మస్ ఈవ్, క్రిస్మస్, బాక్సింగ్ దినం అనే మూడు రోజులుగా జరుపుకుంటారు. ఇది ప్రతి సంవత్సరం డిసెంబర్ నెలలో 24, 25, 26 తేదీలనాడు వస్తాయి.

సంప్రదాయ కథనాల ప్రకారం జీసస్ ఒక పశువులశాలలో పశువుల మధ్య పుట్టాడని, జన్మించగానే ఆయన తల్లి మేరీమాత ఆయనను వస్త్రాలతో చుట్టి వారున్న ధర్మశాలలో ఖాళీ లేనందున పశువుల కొట్టంలో ఉంచవలసి వచ్చిందని 'బైబిలు' చెబుతోంది. ఆయన పుట్టిన రోజు రాత్రి ఆ ఊరికి పక్కనున్న పొలాల్లో కొందరు పశువుల కాపరులు తమ గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి వారి ముందుకు దిగి వచ్చాడు. ఆ దూత చుట్టూ ఉన్న వెలుగుకు గొర్రెల కాపరులు భయపడ్డారు. దేవదూత వాళ్ళతో "భయపడకండి ఇదిగో మీకొక సంతోషకరమైన శుభవార్త ఇవ్వాళ బెత్లహేంలోని ఒక పశువులపాకలో లోకరక్షకుడు పుట్టాడు. ఆయన అందరికీ ప్రభువు. ఒక పసికందు పొత్తిగుడ్డలో చుట్టబడి పశువులశాలలో



5th Telugu Reader _unit8.indd 128 02-07-2019 21:00:58
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

ఉన్న దాణా తొట్టిలో పడుకొని ఉంటాడు. ఇదే మీకు ఆనవాలు". దేవదూత ఇలా చెబుతుండగా పొలమంతా దేవదూతలతో నిండిపోయింది. వాళ్ళంతా దేవునికి స్తుతి గీతాలు పాడి మాయమయ్యారు. గొర్రెల కాపరులు వెంటనే వెళ్ళి దేవదూత చెప్పిన పశువుల పాకకు చేరుకున్నారు. అక్కడ తొట్టెలో పడుకొని ఉన్న శిశువును చూశారు.

అలా 2000 సంవత్సరాల కిందట డిసెంబరు 24వ తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించాడు. అందుచేత ఆ మరునాడు అంటే డిసెంబరు 25వ తేదీ క్రిస్మస్ పండుగని జరుపుకుంటున్నారు.



ఈ పండుగకు క్రైస్తవులు తమ ఇళ్ళను, చర్చిలను అలంకరిస్తారు. వెదురు బద్దలతో, రంగు కాగితాలతో ఒక పెద్ద నక్షత్రాన్ని తయారుచేసి ఇంటి కప్పు మీద ఎత్తులో పెడతారు. రాత్రివేళ దీపాలంకరణలతో చర్చీలు అందంగా ఉంటాయి. ప్రతి ఇంట్లోను ఒక క్రిస్మస్ చెట్టును ఏర్పాటు చేస్తారు. ఇది ఈ పండుగ ప్రత్యేకత. ఈ చెట్టును రంగు కాగితాలతోను, కాగితపు నక్షత్రాలతోను, చిరుగంటలతోను, చిన్న చిన్న గాజు గోళాలతోను అలంకరిస్తారు. మరొక విశేషం ఉంది. క్రిస్మస్ కిందటి రాత్రి శాంతాక్లాజ్ (ఫాదర్ క్రిస్మస్) ఆకాశం నుండి ధృవపు జింకలు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇస్తాడని నమ్ముతారు. క్రిస్మస్ రోజున బంధువుల ఇళ్ళకు, మిత్రుల ఇళ్ళకు వెళ్ళి ప్రేమాభిమానాలతో క్రిస్మస్ శుభాకాంక్షలు చెబుతారు.



5th Telugu Reader _unit8.indd 129 02-07-2019 21:00:59
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం
9

# 9.1 బుద్ధి బలం



కోతి వసించెను చెట్టుమీద - మొసలి వసించే నీటిలోన

పండ్లు కోసి కోతి వేసే - తింటు మొసలి చెలిమి చేసె

మిత్రుడిచ్చెడి పండ్లు కొన్ని - మొసలి పెట్టెను ఇంతికి

పండ్లు తిన్న మొసలి ఇంతి - చేటు తలపు తలచె ఇట్లు

చెట్లు పండ్లే ఇంత తియ్యన - వాటి తినెడి కోతి గుండె కమ్మన

తెచ్చి పెట్టుము కోతి డెందము - ఒట్టు పెట్టెను మొసలి పెండ్లాము

విన్న మకరము చిన్నబోయెను - గట్టు చేరను చింతగుండెను.

దిగులు గుండెడి హితుని చూచి - ఇట్లు అడిగెను పిలిచి కోతి

చింత ఏలనో మిత్రమా - నాకు తెలియగ జెప్పుమా

పండ్లు తిన్న నాదు ఇంతి - నీదు తోడ కూడి రమ్మెనె



5th Telugu Reader _unit9.indd 130 02-07-2019 21:13:25
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



నేను జూడ వృక్ష వాసిని – నీవు జూడ జలచరానివి
ఎట్లు రాగల నీదు ఇంటికి – వీలుపడునా నాదు వంటికి
నిజమె కాదననో నేస్తము – అయిన కలదొకుపాయము
ఎక్కి కూర్చొను నాదు వీపున – చక్క దింపెద మాదు గృహమున
అటులె చేసెను వానరం – నీటి సాగెను మకరం
యేటి మధ్యన నిలిచి మొసలి – తెలిపె తనింతి మనోగతి
విస్తుబోయెను విన్న కోతి – స్తబ్ధమైనది దేహ గతి
అయినను తక్కున తేరుకున్నది – ఉపాయమొకటి అల్లుకున్నది
అయ్యో అదెంతటి చిన్న కోరిక – మున్నె తెలిపిన తెస్తుంటి తప్పక
జారిపోవును ఎగురునపుడని – గుండె దాచితి చెట్టు కొమ్మని
త్వరగ మరలుము మాను వరకు – గుండె తెచ్చెద నా చెల్లి కొరకు
మొసలి నిజమని చేరె గట్టు – కోతి ఉరుకున ఎక్కె చెట్టు
చెలిమి మరచి చెరవదలచిన – నీదు చెలిమికి ఇపుడె చెల్లని
బుద్ధి బలముతో నెగ్గె కోతి – ఎద్ది దొరకక చనె మందమతి





Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## సారాంశం

నది ఒడ్డున ఒక చెట్టు ఉండేది. ఆ చెట్టుపైన కోతి నివసిస్తూ ఉండేది. నదిలో ఒక మొసలి జీవిస్తూ ఉండేది. చెట్టుపైన ఉన్న కోతి పండ్లు తింటూ కొన్నింటిని నీటిలో పడేసేది. ఆ పండ్లను మొసలి తింటూ కోతితో స్నేహం చేసింది. స్నేహితుడు ఇచ్చిన కొన్ని పండ్లను మొసలి తన భార్యకు తీసుకువెళ్ళి ఇచ్చాడు. ఆ పండ్లను తిన్న మొసలి భార్యకు మనసులో చెడు ఆలోచన కలిగింది.

"చెట్టు పండ్లే ఇంత తియ్యగా ఉంటే వాటిని తినే కోతి గుండెకాయ ఇంకెంత తియ్యగా ఉంటుందో" అని అనుకుంది మొసలి భార్య. మొసలితో తనకు కోతి గుండె కావాలని వెంటనే తెచ్చి పెడతానని (పెట్టమని) ఒట్టు వేయించుకుంది. భార్య మాటలు వినగానే మొసలి చిన్నబుచ్చుకుంది (బాధపడ సాగింది). బాధతో నది ఒడ్డుకు మరలి వెళ్ళింది. దిగులుగా ఉన్న స్నేహితుడుని చూసి "ఎందుకు బాధపడుతున్నావని" కోతి అడిగింది. నువ్వు ఇచ్చిన పండ్లు తిన్న తర్వాత నా భార్య నిన్ను మా ఇంటికి తీసుకురమ్మని చెప్పింది" అని మొసలి అనగానే కోతి "నేనేమో వృక్షాలపై జీవిస్తాను, నువ్వేమో నీటిలో నివసిస్తావు. మీ ఇంటికి ఎలా రాగలను" అని ప్రశ్నించింది. అందుకు మొసలి "నువ్వు చెప్పింది నిజమే కాని మిత్రమా! నా దగ్గర ఒక ఉపాయం ఉంది. నా వీపు మీద ఎక్కి కూర్చో. నిన్ను చక్కగా మా ఇంటికి తీసుకు వెళతాను" అని చెప్పింది. కోతి అలాగే చేసింది. మొసలి మీద ఎక్కి కూర్చుంది. నీళ్ళల్లో కొంత దూరం వెళ్ళిన తర్వాత తన భార్య కోరికను కోతితో చెప్పింది. విన్న వెంటనే కోతి ఆశ్చర్యపోయింది. శరీరం కొయ్యబారిపోయింది వెంటనే తేరుకొని ఈ ఆపద నుంచి బయటపడటానికి తెలివిగా ఒక ఉపాయం ఆలోచించింది, "అయ్యో! ఇది ఎంతో చిన్న కోరిక. ముందే నువ్వు చెప్పినట్లయితే నాతో గుండెకాయను తెచ్చి ఉంటాను జారిపోతుందని చెట్టు కొమ్మపైన గుండెను దాచి పెట్టాను. త్వరగా ఆ చెట్టు దగ్గరికి తీసుకువెళ్ళు. నా చెల్లెలు కోసం నా గుండెను తెచ్చి ఇస్తాను" అని చెప్పింది. కోతి మాటలను నిజమని నమ్మి మొసలి గబగబ చెట్టు దగ్గరికి తీసుకు వెళ్ళింది. కోతి ఒక్క ఉదుటున చెట్టుపైకి ఎక్కింది. "మన స్నేహాన్ని మరచి నాకు ద్రోహం చేశావు. నీ స్నేహాన్ని ఇప్పుడే వదులు కుంటున్నాను" అని కోతి మొసలితో చెప్పింది. తన బుద్ధిబలంతో ఆపద నుంచి బయటపడింది కోతి. తన తెలివి తక్కువతనంతో కోతి "గుండె"ను పొందకుండానే (తీసుకోకుండానే) వెనుదిరిగింది మొసలి.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం

1. చెలిమి = స్నేహం
2. మిత్రుడు = స్నేహితుడు
3. ఇంతి = స్త్రీ
4. డెందం = హృదయం
5. చింత = బాధ



5th Telugu Reader _unit9.indd 132 02-07-2019 21:13:25
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

6. హితుడు = మంచిని కోరేవాడు
7. వృక్షం = చెట్టు
8. నేస్తం = స్నేహం
9. గృహం = ఇల్లు
10. వానరం = కోతి
11. మకరం = మొసలి
12. విస్తుబోయే = ఆశ్చర్యపోయెను
13. స్తబ్ధత = చేష్టారహితం
14. మాను = చెట్టు
15. మందమతి = తెలివి తక్కువతనం

## II ప్రకృతి - వికృతి

1. ఇంతి - స్త్రీ
2. నిజం - నిక్కం
3. గృహం - గీము
4. హృదయం - డెందం

## III వ్యతిరేక పదాలు

1. మిత్రుడు × శత్రువు
2. చిన్న × పెద్ద
3. ఎక్కుట × దిగుట
4. పండు × కాయ
5. నిజం × అబద్ధం

## IV జతపరచండి

1. పండ్లు కోసి కోతి వేసె - కోతి ఊరుకున ఎక్కె చెట్టు
2. తెచ్చిపెట్టవు కోతి డెందము - నీతో సాగెను మకరం



5th Telugu Reader _unit9.indd 133 02-07-2019 21:13:25
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com
www.Padasalai.Net

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. చింత ఏలనో మిత్రమా - తింటూ మొసలి చెలిమి చేసె

4. అటులె చేసెను వానరం - ఒట్టు పెట్టెను మొసలి పెండ్లాము

5. మొసలి నిజమని చేరె గట్టు - నాకు తెలియగ జెప్పుమ్మా

## V చదువుదాం, ఆలోచిద్దాం, రాద్దాం



పాఠం చదివి కింది వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో రాయండి.

1. ఎందుకు బాధ పడుతున్నావు?
2. "నేనేమో వృక్షాలపై జీవిస్తాను. నువ్వేమో నీటిలో నివసిస్తావు"
3. "నా వీపు మీద ఎక్కి కూర్చో"
4. "నా చెల్లెలు కోసం నా గుండెను తెచ్చి ఇస్తాను"
5. " నా భార్య నిన్ను ఇంటికి తీసుకు రమ్మంది"
6. మన స్నేహాన్ని మరచి నాకు ద్రోహం చేశావు

## VI విడదీసి రాయండి

1. మిత్రుడిచ్చెడి =
2. నిజమని =
3. ఉపాయమొకటి =
4. స్తబ్ధమైనది =

## VII ప్రశ్నలు

1. కోతి ఎక్కడ నివసించేది?
2. మొసలి కోతితో ఎందుకు స్నేహం చేసింది?
3. మొసలి భార్య కోతి గుండెను ఎందుకు కోరింది?
4. మొసలి కోతిని ఏ విధంగా తన ఇంటికి తీసుకు వెళతానని చెప్పింది?
5. ఆపద నుంచి కోతి ఎలా బయటపడింది?
6. చెట్టు పైకెక్కి కోతి మొసలితో ఏమని చెప్పింది?

www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 134 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

## VIII భాషను గురించి తెలుసుకుందాం



కాలములు మూడు రకాలు

1) భూత కాలం

2) వర్తమాన కాలం

3) భవిష్యత్ కాలం

1) భూత కాలం : జరిగిపోయిన కాలాన్ని తెలిపే పదాలను భూతకాలం అంటారు.
ఉదా॥ నేను నిన్న చదివాను.

2) వర్తమాన కాలం: జరుగుతున్న కాలాన్ని తెలిపేది వర్తమాన కాలం.
ఉదా॥ నేను ఇప్పుడు ఆడుకుంటున్నాను.

3) భవిష్యత్ కాలం: జరగబోయే కాలాన్ని తెలిపేది భవిష్యత్ కాలం.
ఉదా॥ నేను రేపు పుస్తకం కొనుక్కుంటాను.

కింది వాక్యాలు ఏ కాలానికి చెందినవో చెప్పండి.

1) శ్యామల పూజ చేస్తున్నది.

2) రఘు రేపు వస్తాడు.

3) లక్ష్మణుడు అడవికి వెళ్ళాడు.

4) షాజహాన్ తాజ్‌మహల్ నిర్మించాడు.

5) కవి పాట రాస్తున్నాడు.

6) రేపు మా ఇంటిలో పిండివంటలు చేస్తారు.

## IX విద్యార్థులకు సూచన

1. మంచి నీతి కథలను చదివి వాటిని తరగతి గదిలో చెప్పండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. చిన్నయసూరి నీతి కథలను విద్యార్థులతో నాటక రూపంలో ప్రదర్శించండి..





Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## ప్రణాళికా పని



క్రింది గడులలో ఉన్న జంట పదాలను వెతికి రాయండి.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| రా | వె | ను | క | ముం | దు | చే |
| జు | లు | కం | చె | ట్టు | చే | మ |
| వా | గు | వం | క | దూ | ప | లు |
| ఊ | నీ | రు | ని | ప్పు | త | నిం |
| రు | డ | ప్పు | చా | కొ | డి | గీ |
| వా | లు | ఉ | ల | ప్పె | పో | నే |
| డ | మ | ఉ | ద్దె | ర | డి | ల |

1 వెనుకముందు

2 ________

3 ________

4 ________

5 ________

6 ________

7 ________

www.Padasalai.Net




5th Telugu Reader _unit9.indd 136 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 9

# 9.2 మహాత్ముడు



"మీరు దేనికోసమో వెతుకుతున్నట్లు ఉన్నారు?" అని అడిగింది ఆమె.

"ఔను! నేను రాసుకునే పెన్సిల్ కనబడడం లేదు" అన్నారు ఆయన మెల్లగా.

"అయితే ఈ కొత్త పెన్సిల్ తీసుకోండి" అంటూ ఆమె పెన్సిల్ చేతికి ఇవ్వబోయింది.

"నేను కొత్త పెన్సిల్ కావాలని అడగలేదే!" అంటూ వెదకడంలో మునిగిపోయారు ఆయన. చాలాసేపటికి కాగితాల మధ్య ఆ పెన్సిలు దొరికింది. అది వేలెడంత కూడా లేదు. దాన్ని చూశాక ఆయన ముఖంలో చాలా సంతృప్తి కనబడింది.


"ఇంత చిన్న పెన్సిల్‌కు అంత విలువ ఇవ్వాలా!" అని అడిగింది ఆమె.

"పనికొచ్చే ప్రతి వస్తువుకూ విలువ ఇవ్వాలి, పడవేయకూడదు. దేన్నైనా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి సుమా!" అంటూ తన పుస్తకంలో రాసుకోవడం మొదలుపెట్టారు.

పిల్లల్లారా! ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా? ఎవరో కాదు మన బోసినవ్వుల తాత "గాంధీజీ". మన దేశానికి స్వాతంత్రం తేవడం కోసం అహింసా మార్గంలో పోరాడిన మహనీయుడు.



5th Telugu Reader _unit9.indd 137 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com



ఆయన పూర్తి పేరు మోహన్‌దాస్ కరంచంద్ గాంధీజీ. 1869 అక్టోబరు 2 వ తేదీన గుజరాత్‌లోని పోర్‌బందరులో జన్మించారు. ఆయన తండ్రి కరంచంద్ గాంధీ. తల్లి పుత్లీ బాయి.

తల్లి పుత్లీ బాయి, ప్రతిరోజు గాంధీ గారికి ఎంతో ప్రేమతో కథలు చెప్పేది. ఆయన ఎంతో ఆసక్తితో వినేవారు. గాంధీ గారి ఆసక్తిని ఆయన తండ్రి గ్రహించారు. ఆయన ఒక రోజున "శ్రవణ కుమారుని నాటకం" అనే పుస్తకాన్ని గాంధీజీకి కొనిచ్చారు. గుడ్డి వాళ్ళయిన తల్లిదండ్రులకు సేవ చేసిన శ్రవణుని కథ గాంధీ గారిని బాగా ఆలోచింపజేసింది. తాము కూడా శ్రవణ కుమారుని లాగా తల్లిదండ్రులకు, పెద్దలకు సేవ చేయాలని అనుకున్నారు. అప్పటి నుంచి తల్లిదండ్రుల మాటను జవదాటే వారు కాదు.

అలాగే ఒకసారి గాంధీ గారు "సత్య హరిశ్చంద్ర" నాటకం చూశారు. హరిశ్చంద్రుడు సత్యం కోసం పడిన కష్టాలను నాటకం ద్వారా గాంధీజీ తెలుసుకున్నారు. నాటి నుంచి తను సత్యాన్నే పలకాలని నిర్ణయించుకున్నారు. చిన్నప్పటి ఈ సంఘటనలు గాంధీ గారి జీవితంలో చెరగని ముద్ర వేశాయి. జీవితంలో క్రమశిక్షణ, సత్యం, అహింస మొదలైన మార్గాలను ఆయన అనుసరించారు.

ఒకరోజున గాంధీజీకి వచ్చిన ఉత్తరాలను ఆయన కార్యదర్శి సమాధానాలు రాస్తున్నారు. ఒక తెల్ల కాగితం తీసి, చింపి రాయబోతున్నాడు ఇదంతా గాంధీజీ గమనించారు. కార్యదర్శిని మందలిస్తూ "కార్డుతో సరిపోయేదానికి కాగితం ఎందుకు? కవరు, అదనపు పోస్టేజిని ఎందుకు వృథా చేయడం?" అన్నారు.



5th Telugu Reader _unit9.indd 138 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

పొదుపు విషయంలో గాంధీ గారి దగ్గర నుంచి గుణపాఠం నేర్చుకున్నాడు కార్యదర్శి. ఏదైనా సరే అనవసరంగా వృథా చేయడానికి గాంధీగారు ఇష్టపడేవారుకారు. తమకు వచ్చే ఉత్తరాలలో వెనకవైపు ఖాళీగా ఉంటే అక్కడ కూడా రాసుకునేవారు.

అలాగే సబర్మతి ఆశ్రమ భోజనాలయంలో బోర్డు మీద "ఆశ్రమ ఆస్తి అందరిదీ, ఇది ఈ దేశంలో బీదవారి ఆస్తిగా భావించాలని నేను ఆశిస్తున్నాను" అని రాయించారు. ఇంకా, "అవసరానికి మించి ఉప్పయినా సరే వడ్డించుకోవద్దు", "నీరు కూడా వృథా చేయకూడదు" అని రాసి ఉండేది.

గాంధీ గారు జీవితంలో తాను నమ్మిన విషయాలను ఆచరించేవారు. ఏదైనా తాము ఆచరించిన తర్వాత ఇతరులకు చెప్పేవారు.

గాంధీ గారు తమ పనులను తామే చేసుకునేవారు ఆశ్రమంలో ఉంటూ పరిసరాలను తానే శుభ్రం చేసేవారు. తమ బట్టలకు కావలసిన నూలును తామే వడికేవారు. తమ బట్టలను తామే ఉతుక్కునేవారు. బ్రిటిష్ వారు మన దేశాన్ని పాలించడం చూసి స్వాతంత్ర్యం కోసం కృషి చేశారు. తమ పోరాటంలో గాంధీ గారు నాయకులను ప్రజలను ఒకే తాటిమీద నడిపించారు.

గాంధీ గారికి ఆయన భార్య కస్తూరిబాయిగారు చేదోడువాదోడుగా ఉండేవారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయనకు సహకరించేవారు.

గాంధీగారు "అంటరానితనం మహాపాపం" అన్నారు. మానవులందరూ ఒకటేనన్నారు. అందరికీ మేలు జరగాలని కోరుకున్నారు.

సత్యం , అహింస, ఆత్మవిశ్వాసం, ధైర్యం, పట్టుదల అన్నవి గాంధీ గారిని గొప్ప నాయకుడిని చేశాయి. అందువల్లనే ఆయన "మహాత్ముడు" అని పేరు పొందారు.

## అభ్యాస వేదిక

### I కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం.

1. మహనీయుడు = గొప్పవాడు
2. కృషి = ప్రయత్నం
3. నూలు = దారం
4. మేలు = మంచి
5. విశ్వాసం = నమ్మకం



5th Telugu Reader _unit9.indd 139 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

## II ప్రకృతి – వికృతి

1. సత్యం – సత్తెం
2. దేశం – దేసం
3. విశ్వాసం – విసువాసం
4. గుణం – గొనం

## III వ్యతిరేకపదాలు

1. చిన్న × పెద్ద
2. హింస × అహింస
3. ఆశక్తి × అనాశక్తి
4. ఇష్టం × అయిష్టం
5. ధైర్యం × అధైర్యం

## IV జతపరచండి

1. గాంధీజీ – బీదవారి ఆస్తి
2. హరిశ్చంద్రుడు – పుత్తలీబాయి
3. బట్టలు – మహాత్ముడు
4. సబర్మతి ఆశ్రమం – నూలు
5. గాంధీజీ తల్లి – సత్యం

## V చదువుతాం! ఆలోచిస్తాం! రాస్తాం



1. గాంధీజీ పూర్తిపేరు ----

అ) మహాత్మగాంధీ ఆ)మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ

ఇ) మోహన్‌గాంధీ ఈ) శ్రవణకుమార గాంధీ

2. గాంధీజీ గుజరాత్ ---- లోని పోరుబందర్‌లో జన్మించారు.

అ) రాష్ట్రం ఆ) దేశం ఇ) జిల్లా ఈ) గ్రామం



5th Telugu Reader _unit9.indd 140 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

3. ఒకసారి గాంధీగారు ---- నాటకం చూశారు

అ) కన్యాశుల్కం ఆ) భక్తప్రహ్లాద ఇ) సత్యహరిశ్చంద్ర ఈ) మహాభారతం

4. గాంధీగారు ---- కోసం వెతికారు.

అ) కలం ఆ) కత్తి ఇ) రబ్బరు ఈ) పెన్సిలు

5) గాంధీగారు మనదేశ --- కోసం పోరాడారు.

అ) స్వాతంత్ర్యం ఆ) వ్యాపారం ఇ) సంపద ఈ) రాజరికం

## VI కలిపి రాయండి

1. మహా + ఆత్ముడు =
2. భోజన + ఆలయం =
3. వేలెడు + అంత =
4. మహా + పాపం =

## VII ప్రశ్నలు

1. గాంధీజీ ఎప్పుడు, ఎక్కడ జన్మించారు?
2. గాంధీజీ తల్లిదండ్రులు ఎవరు?
3. శ్రవణ కుమారుని కథ విన్న తర్వాత గాంధీజీలో ఎలాంటి మార్పు వచ్చింది?
4. గాంధీజీ "పొదుపు" గురించి వివరించండి.
5. గాంధీజీ సత్యాన్నే పలకాలనీ ఎప్పుడు నిర్ణయించుకున్నారు?
6. గాంధీజీకి "మహాత్మ" అని ఎందుకు పేరు వచ్చింది?



## VIII భాషను గురించి తెలుసుకుందాం.

1. తులసి, మల్లిక కూరగాయలు కొన్నారు. --------------------------
2. శ్రీనివాస్ పుస్తకం చదువుతూ ఉన్నాడు. --------------------------
3. నిఖిల్, నితీష్ క్రికెట్ పోటీలకు వెళతారు. --------------------------
4. పిల్లి గిన్నెలోని పాలు తాగుతూ ఉంది. --------------------------



5th Telugu Reader _unit9.indd 141 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

5. అతడు కవిత్వం రాస్తూ ఉన్నాడు. --------------------------

6. రాముడు గుర్రం మీద స్వారీ చేయాలనుకున్నాడు. --------------------------

| భూతకాల పదాలు... | భవిష్యత్ కాల పదాలు... | వర్తమాన కాల పదాలు. |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |

## IX విద్యార్థులకు సూచన

1. గాంధీజీ లాంటి మహాత్ముల చిత్రపటాలను సేకరించి తరగతి గదిలో ప్రదర్శించండి.

## X ఉపాధ్యాయులకు సూచన

1. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న త్యాగధనుల జీవిత చరిత్రలను విద్యార్థులకు తెలియజేయండి.

### ప్రణాళికా పని



మహాత్మా గాంధీ జీవిత విశేషాలను తెలుసుకొని ఆయనలాగా వేషం వేసుకొని తరగతి గదిలో ప్రదర్శన ఇవ్వండి. లేదా ఏకపాత్రాభినయం చేయండి.

www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 142 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

విభాగం 9

చదువు - ఆనందించు

# 9.3 అతిథి సత్కారం



'అతిథి దేవోభవ' అని పెద్దల మాట. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టి ఆదుకుంటె అంతకంటె ఆనందం మరొకటి లేదు. ఈ సత్యాన్ని తెలియజేసేదే ఈ పాఠం యొక్క సారాంశం.

పూర్వం రామనాథపురం అనే గ్రామంలో రామయ్య అనే పేదవాడు నివసించేవాడు. అతనికి భార్య నలుగురు పిల్లలు ఉండేవారు. పొట్టకూటి కోసం ప్రతి రోజు అడవికి వెళ్ళి ఎండు కట్టెలు కొట్టుకొని వాటిని అమ్మి జీవనం సాగించేవాడు. అతడు ఒకనాడు కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్ళాడు. సాయంత్రమైంది కాని తనకు కావలసిన ఎండు కట్టెలు మాత్రం దొరకలేదు. పొద్దు మునిగింది. ఆ పూట అతడు అడవిలోనే గడపాల్సి వచ్చింది. విధిలేక చెట్టు కింద నడుం వాల్చాడు. అతని దగ్గర తినడానికి గాని, కప్పుకోవడానికి గాని ఏమీ లేకపోయింది. ఉన్నట్లుండి మేఘాలు కమ్మాయి. కన్నుమూసి తెరిచే లోపల వడగళ్ళ వర్షం ప్రారంభమైంది. పూర్తిగా తడిసిపోయాడు రామయ్య. కొంతసేపటికి వర్షం నిలిచిపోయింది.



5th Telugu Reader _unit9.indd 143 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



అతనికి ఆకలి నకనకలాడింది. చలికి గడగడ వనికాడు.చెట్టుమీద గూడు కట్టుకొని కాపురం చేస్తున్న పావురాల జంట రామయ్య దురవస్థ చూసి మగ పావురం ఆడ పావురంతో “ఈ మనిషి మనకు శత్రువు నిజమే కాని, ఈ మనిషి మన చెట్టు కిందకు వచ్చి మనకు అతిథి అయ్యాడు. “అతిథి దేవోభవ” అన్నారు కదా పెద్దలు. అతన్ని ఆదరించడం మన కర్తవ్యం. చలి మరింత ఎక్కువ అవుతూ ఉంది. అతను రాత్రంతా ఇలానే ఉంటే చలి బాధకు తట్టుకోలేక చనిపోవడం ఖాయం. అతడు చనిపోతే ఆ పాపం మనకు అంటుకుంటుంది. మనం ఇప్పుడు అతన్ని చలి నుండి కాపాడాలి” అని అనింది. అందుకు ఆడ పావురం సరే అంది.

పావురాలు తాము కష్టపడి కట్టుకున్న గూటిని కిందికి పడవేశాయి. చిన్నచిన్న కట్టె పుల్లల్ని తమ ముక్కులతో కరుచుకొని వచ్చి కిందికి పడవేశాయి. కొంచెం సేపైన తర్వాత ఆడ పావురం ఎగిరిపోయి ఎక్కడినుంచో చిన్న కొరివిని తెచ్చి ఆ కట్టెపుల్లల మీద పడవేసింది. కట్టెపుల్లలు రగులుకొని మండసాగాయి. కట్టెలు కొట్టేవాడు మరిన్ని పుల్లలు పోగుచేసి మంటలో వేశాడు. మంట వల్ల చలి నుండి బయటపడ్డాడు.

అతనికి బాగా ఆకలి వేసింది. మంట వెలుగులో తినడానికి ఏమైనా దొరుకుతుందేమో అని అటూ ఇటూ చూడసాగాడు. అతను ఆకలితో అల్లాడి పోతున్నాడు. ఇదంతా చూసిన ఆడ పావురం మగ పావురం తో అతిథి సాక్షాత్తు భగవంతుని స్వరూపం. ఇంటికి వచ్చిన అతిథి పాపం ఆకలితో బాధపడుతున్నాడు. ఇతని ఆకలి తీర్చడానికి మన వద్ద ఏముంది? నేను మండుతున్న నిప్పులో దూకుతాను. “పరోపకారార్థమిదం శరీరం” అని కదా పెద్దలు అన్నారు. అతడు నా మాంసం తిని ఆకలి తీర్చుకుంటాడు అని ఆడ పావురం చెట్టు పైనుండి గభాలున నిప్పులో దూకింది. అప్పుడు మగ పావురం తనలో తాను “ఈ కొద్దిపాటి ఆహారంతో ఈ అతిథి



5th Telugu Reader _unit9.indd 144 02-07-2019 21:13:26
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com



ఆకలి తీరుతుందా? నేను కూడా మంటల్లో పడి నా శరీరాన్ని అతనికి ఇస్తాను" అని అనుకుని మరుక్షణమే మంటలోనికి దూకింది.

రామయ్య అడవిలో పావురాలు చేసిన సహాయానికి, ప్రాణత్యాగానికి ముక్కు మీద వేలు వేసుకున్నాడు. ఆనాటినుండి పావురాలను ఆదర్శంగా తీసుకొని ఇతరులకు తన వంతు సహాయం చేయాలని సంకల్పించుకున్నాడు.

నీతి: "అతిధి దేవోభవ .....మానవసేవే మాధవసేవ."



5th Telugu Reader _unit9.indd 145 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

# కొబ్బరి చెట్టు (వ్యాసం)



భారతదేశంలో కొబ్బరిచెట్టుకు ఒక ముఖ్యమైన స్థానం ఉంది. దీనిని కల్పవృక్షం, స్వర్గానికి చెందిన చెట్టు అని అంటారు. కొబ్బరి చెట్టుమనకు కావలసిన ఆహారాన్నీ, పానీయాన్నీ, తలదాచుకునే చోటుని, నిత్యావసర వస్తువులను అందిస్తుంది. కొబ్బరికాయలు పూజలలో, పెళ్ళిళ్ళలలో, ఇతర ఉత్సవాల సమయంలో వాడుతారు.

కొబ్బరిచెట్లు కోస్తా ప్రాంతాలలోను, ఇసుక ప్రాంతాలలో ఎక్కువగా పెరుగుతాయి. భారతదేశంలో కేరళ రాష్ట్రం, ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ కొబ్బరికాయలకు ప్రసిద్ధి. ఈ చెట్టు సుమారు 100 అడుగుల ఎత్తు పెరుగుతుంది. 100 సంవత్సరాలు జీవించి ఉంటాయి. 7 సంవత్సరాల వయసు రాగానే ఈ చెట్టు చిగురిస్తూ, పూత పూసి కాయలు కాయడం ప్రారంభిస్తుంది.

ఉపయోగాలు:

1. కొబ్బరి నీరు ఏ ఋతువులోనైనా తాగచ్చు. లేత కొబ్బరి నీటిలో కార్బోహైడ్రేట్స్ తక్కువగా ఉంటాయి. చక్కెర పరిమితంగా ఉంటుంది. కొబ్బరి బొండంలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. శరీరంలో నీటిలేమిని సరిచేస్తుంది.
2. కొబ్బరి పీచుతో తాళ్ళు, చాపలు, పరుపులు తయారుచేస్తారు.
3. కొబ్బరి మట్టలను వంటచెరకుగా ఉపయోగిస్తారు. కొబ్బరి ఆకుల ఈనెలతో చీపురు కట్టలు తయారుచేస్తారు.
4. కొబ్బరి ఆకులతో చాపలు, బుట్టలు అల్లుతారు., పందిరి, ఇంటి పైకప్పుల పైన వేస్తారు.
5. కొబ్బరి చెట్టు కాండాన్ని కలపగా, ఇల్లు కట్టుకోవడంలో దూలాలు, స్తంభాలు కింద వాడుతారు.
6. కొబ్బరి నూనెను తలకు రాసుకుంటారు. చర్మం పొడిబారకుండా కొబ్బరినూనెను వాడుతారు. కొబ్బరి నూనెను వంటచేయడానికి, కొన్ని సౌందర్య సాధనాల తయారీకి వినియోగిస్తారు.
7. కొబ్బరికాయలను మనం నిత్యం అనేక వంటకాల్లో వినియోగిస్తారు. ఇలా కొబ్బరిచెట్టు వలన అనేక ఉపయోగాలున్నాయి.





Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# విద్యార్థులు – క్రమ శిక్షణ

'విద్య'ను ఆర్జించే వారు విద్యార్థులు. క్రమమైన పద్ధతిని అనుసరించడాన్ని 'క్రమశిక్షణ' అని అంటారు. ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే చిన్నతనం నుంచి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలి.

క్రమశిక్షణ అలవాటు చేసుకోవడానికి విద్యార్థి దశ ఉత్తమమైనది. మొక్కై వంగనిది మానై వంగునా? అనే సామెత వ్యవహారంలో ఉంది. అంటే ఏదైనా చిన్న వయస్సులోనే నేర్చుకోవడం, అలవాటు చేసుకోవడం సులభమని, పెద్దయిన తరువాత కష్టమని అర్థం. విద్యాభ్యాసం బాల్యంలోనే జరుగుతుంది కాబట్టి, విద్యలో క్రమశిక్షణ ఒక భాగమని విద్యార్థులు తెలుసుకోవాలి. క్రమశిక్షణలేని జీవితం దారం తెగిన గాలిపటం వంటిది.

విద్యార్థులు ఉదయం నిద్రలేవడం నుంచి పాఠశాలకు వెళ్ళేవరకు వారు తమ పనులను క్రమపద్ధతిలో చేయడం అలవాటు చేసుకోవాలి. పాఠశాలకు సమయానికి వెళ్ళడం కూడా క్రమశిక్షణలో ఒక భాగమే. పాఠశాలలో ఏ రోజు చెప్పిన పాఠాలను ఆ రోజే చదవాలి. క్రమశిక్షణ గల విద్యార్థుల వలన ఆ పాఠశాలకు, తల్లిదండ్రులకు కూడా మంచి పేరు వస్తుంది. పరీక్షలలో మంచి మార్కులు వస్తాయి.

ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మగౌరవాన్ని, పెద్దలు, గురువుల పట్ల వినయ విధేయతలను, మంచి ప్రవర్తన మొదలైన వాటిని పెంపొందించాలి. బస్టాండు, రైల్వేస్టేషన్, ఆసుపత్రి, దుకాణాలు ఇలా ప్రతి చోట వరుస క్రమంలో నిలబడి క్రమశిక్షణతో మెలగాలి.

క్రమశిక్షణ లేని జీవితం "చుక్కాని లేని నావ వంటిది". కాబట్టి ప్రతి విద్యార్థి క్రమశిక్షణను అలవాటు చేసుకోవాలి.



5th Telugu Reader _unit9.indd 147 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## సెలవు చీటి

చెన్నై -1
తేది : ............

రాయువారు

ఎస్.కవిత,
5వ తరగతి, 'బి' కక్ష్య,
కె.టి.సి.టి. బాలికల మహోన్నత పాఠశాల,
షావుకారుపేట,
చెన్నై-1.

పొందువారు

తరగతి ఉపాధ్యాయిని,
5వ తరగతి, 'బి' కక్ష్య,
కె.టి.సి.టి. బాలికల మహోన్నత పాఠశాల,
షావుకారుపేట,
చెన్నై-1.

గౌరవనీయులైన ఉపాధ్యాయిని గారికి నమస్కారాలు,

నేను గత రెండు రోజులుగా తలనొప్పి, జ్వరంతో బాధపడుతున్నాను. నిన్న సాయంత్రం ఆసుపత్రికి వెళ్ళాను. డాక్టర్ మందులు ఇచ్చారు. నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. కాబట్టి నాకు నాలుగు రోజులు సెలవు కావలసినదిగా కోరుతున్నాను.

ధన్యవాదాలు.

ఇట్లు
తమ విధేయురాలు,
ఎస్.కవిత.

www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 148 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

## పుట్టినరోజు పండుగకు ఆహ్వానిస్తూ మిత్రురాలికి లేఖ

చెన్నై–1
తేది ......

ప్రియమైన మిత్రుడు / మిత్రురాలు

ఇక్కడ నేను క్షేమంగా ఉన్నాను. అక్కడ నీవు క్షేమమని తలచుచున్నాను. నా పుట్టినరోజు పండుగను 28–6–19న సాయంత్రం 6 గంటలకు బంధుమిత్రులతో కలిసి ఘనంగా జరపడానికి నిర్ణయించారు మా తల్లిదండ్రులు. కాబట్టి నువ్వు కూడా రావాలని కోరుకుంటున్నాను. నీ కోసం ఎదురుచూస్తుంటాను.

ఇంతే సంగతులు
ఇట్లు
నీ మిత్రురాలు

చిరునామా
.......
బి. నారాయణ,
నెం. 12, గాంధీ నగర్,
తిరువళ్ళూరు.





5th Telugu Reader _unit9.indd 149 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# V Standard

## Telugu Reader


### Academic Advisor

**Dr. P. Kumar,**
Joint Director (Syllabus)
SCERT, Chennai-6

### Domain&Reviewer

**Dr. T. Rajeswari,**
H.O.D. of Telugu,
Bharathi Women's College
Chennai - 108

### Co-ordinator

**K. Chandrasekaran,**
Lecturer, DIET, Chennai

### Art and Design Team

Art Team
Ravikumar, Nalan, Shalini

Layout
Kumaran Offset, Ammayarkuppam.

Kamatchi Balan
Selvakumar Manickam, Thirunageswaram
Sridhar
Vinoth kumar
Sandiyagu Stephen
S. Porsellvan

### Wrapper Design

Kathir Arumugam

### In-House QC

Rajesh Thangappan
Jerald Wilson
Yogesh

### Co-ordinator

Ramesh Munisamy

### Authors

**V.Revathibala,** B.T.Asst. Telugu,
K.T.C.T. Girls' Higher Secondary School, Chennai.

**Dr. A.Venkatesulu,** B.T.Asst.Telugu,
Govt. High School, Keechalam, Pallipat Taluk,
Thiruvallur Dist. 631208

**P.Babu,** B.T.Asst.Telugu,
S.K.D.T Higher Secondary School,
Villivakkam Chennai - 600 049

**G.Poornima,** B.T.Asst. Telugu,
K.T.C.T. Girls' Higher Secondary School,
Chennai.

**M. Balaiah** S.G Asst.
P.U.P School, Doddabeluru
Kelamangalam Block, Krishnagiri Dist

**B.C.Subramanyam** S.G Asst.
P.U.P School, Choodagondapally
Hosur, Krishnagiri Dist

**K. Venkatesulu** B.T.Asst. Telugu,
P.U.M. School, Ulibanda
Thalli Block, Krishnagiri Dist


www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 150 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# NOTES

www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 151 02-07-2019 21:13:27

Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com

www.Padasalai.Net www.Trb Tnpsc.Com

# NOTES

www.Padasalai.Net



5th Telugu Reader _unit9.indd 152 02-07-2019 21:13:27
Kindly Send me Your Key Answer to Our email id - Padasalai.net@gmail.Com